శ్రీ.

ప్రభావతీప్రద్యుమ్నము.

7/149

ఇయ్యది,

సనాతన కవిపుంగవుండగు పింగళిసూరనార్యకృతంబైన

ప్రబంధరాజంబుననుసరించి,

కోఠాముర్రాజ్య లక్ష్మీమనోహరుండగు

శ్రీ. శ్రీ. రాజావత్సవాయ వేంకటసింహాద్రి జగత్పతి రాజాబహద్దరు

మహారాజావారి కంకితంబుగా,

నేతత్సంస్థానాస్థానస్థిత సత్కవీశ్వరుండగు,

బ్రహ్మశ్రీ-హోతా వేంకటకృష్ణకవి ప్రణీతంబై

విరాజిల్లు నేడంకముల నాటకము.

మొదటికూర్పు 1050 ప్రతులు.

చెన్నపట్టణము.

ఆనందధూమ ముద్రానిలయంబునన్ముద్రితము.

1911.

కాపీరైట్ రిజిస్టర్డు.

వెల. పోస్టేజీవగైరాఖర్చులుగాక రు. 1-0-0.

VEMANA ANDHRA BHASHA NILAYAM

పీఠిక.

చదువరులారా!

పూర్వకాలంబునఁ గాళిదాసాదిమహాకవులు కొంద ఱెట్టి రసవంతమైనగాథయైనను శ్రోత్రపర్వంబగుటయేఁ గాక నేత్రపర్వంబుఁగూడ నయ్యెనేని మఱియు శ్లాఘనీయంబగు ననితలంచి యభిజ్ఞాన శాకుంతలాది మహానాటకంబులను సంస్కృతభాషలో రచియించి దృశ్యప్రబంధములకు మార్గప్రదర్శకులై యందలి పరిశ్రమాధిక్యతను గమనించియే "నాటకాంతమ్ కవిత్వమ్" అని వక్కాణించిరి. ఇటీవల గీర్వాణభాషయందు నాంధ్రభాషయందు సమానప్రజ్ఞగల కవితల్లజులు కొంద ఱా సంస్కృతనాటకంబులనే యాంధ్రీకరించి యమితమైన మాతృభాషచే రచియింపఁబడిన నాటకములలోని రసమును మితమైన యాంధ్రభాషచే సమగ్రముగఁ బ్రచురింపఁ బ్రయత్నించి ప్రప్పులోకాలువైచిరి. అందువలన నుభయభాషల గౌరవంబునకును కొంత కలుగునని యెంచి మఱికొంద ఱు కవివృషభులు దివ్యమో యదివ్యమో దివ్యాదివ్యమో యొక యితివృత్తముంగొని భావరసాలంకారలక్షణసమన్వితంబుగ నాంధ్రభాషలో నిజేచ్ఛ నాటకంబులను రచియింపఁదొడంగిరి. ఆంధ్రభాషయందును విశేషించి దృశ్యప్రబంధములయందును మిక్కుటమైన యభిరుచికలవాఁడనగుటచే నేను నట్టిపూనిక వహించి యిదివరలో కొన్ని నాటకములను రచియించియు నంతటితోఁ దనివిననక మఱియొక నాటకంబు వ్రాయఁదలంచి యే తత్ప్రోద్యమంబున కెట్టికథారచనంబు సర్వజనసమాదరణీయం బగునోయని నేనిట్లు వితర్కించితిని:—

సనాతనాంధ్రకవితాశిరోమణులలోఁ జేరెన్నికఁగన్న పింగళి సూరనార్యకృతంబులగు 1 రాఘవపాండవీయము 2 కళాపూర్ణోదయము 3 ప్రభావతీప్రద్యుమ్నము, నాఁబరగు నాంధ్రకావ్యరత్నంబులలో ప్రభావతీప్రద్యుమ్నంబను నమూల్యకావ్యరత్నంబు నాయకరత్నంబై విరాజిల్లుచు చదువరుల హృదయంబులను మరందతుందిలంబులుగఁ జేయుచున్నదను విషయంబు తదీయగ్రంథరచనామృత నిషేవణాయత్తచిత్తులగు మనీషులందఱకు ననుభవనీయంబే కదా. కావున నవకోమలరసాల కిసాలయపుట్టికలోనింపిన యమృతరసంబు నుదృకరంబుల గ్రహించి చూచువారలుఁగూడ నానందింపవలనుబడుటకై శ్రవ్యప్రబంధంబగువద్దాని నేఁడంకముల దృశ్యప్రబంధంబుఁగ రచియించి ప్రఖ్యాతివడసెదఁగాక—"

అని కృతనిశ్చయుండనైతిని. నాయీసాహసంబునకు గుణదోషవిమర్శన నైపుణీ విశారదులగు కోవిదులలుఁగ నవసరములేదు. సత్కార్యమైనచో నెద్దానినైన శక్తికొలంది ప్రయత్నించుట వివేకవంతులందఱకు సహజమే కదా. కావునః

చ. జడనిధిఁగట్టురామునకు శక్తిగణింపక యూతఁగొల్వఁగా
నుడతయుఁదోఁకతోనిసుక నుద్ధతిఁబోయదె వార్ధిలోన నా
వడువున సూరనార్యుని ప్రబంధముఁ జక్కని నాటకంబుఁగా
దోడరితి నేరచించుటకు దోషములెంచకుఁడీ దయామతిన్.

మఱియు నేతత్కావ్యరచనామృతంబునుఁ గడుపారఁ గ్రోలియున్నవాఁడనగుటచే దానియందు నాకుంగల మిక్కుటమైన యభిమానముచేతను నేనిటవరలో రచియించియున్న దృశ్యప్రబంధంబులను చదివిచూచి హర్షించిన సుహృద్వరులుచేసిన హెచ్చరికచేతను మదీయపోషకులును ద్యుమణికుల సుక్షత్రియాన్వయ నభోంతరాళ క్షపానాథులును శ్రీమద్వత్సవాయవంశపయఃపారావారరాకాసుధాకరులు నగు శ్రీశ్రీ రాజా వేంకటసింహాద్రి జగత్పతి రాజాబహద్దరు మహారాజావారి ప్రోత్సాహంబుచేతను నేనింతటి సాహసంబొనరించి దైవానుగ్రహంబువలనను సుహృదోత్తములగు సుధీమణుల వత్సలత్వంబువలనను ప్రభువాల్లభ్యలక్ష్మీప్రసాదంబువలనను కృతకృత్యుండనైతిని. మఱియు లేఖకప్రమాదజనితంబులగు కొన్నియు ముద్రణప్రభూతంబులగు కొన్నియు దోషంబు లీగ్రంథంబున నచ్చటచ్చటఁ గాన్పించవచ్చును. వానినెల్ల వత్సలభావంబున సరిచూచి తెలిపినచో రెండవకూర్పునందైన సవరణఁజేసికొందునని కవితాపోషకులగు విద్వన్మహాజనులను వినయపూర్వకముగఁ బ్రార్థించుచు నింతటితో విరమించుచున్నాఁడను.

ఈనాటకమాడగోరువారికి హస్తమందలి ప్రస్తావనలో చుక్కలుగల భాగములను మానవచ్చును.

తుని
గోదావరిజిల్లా
18-మార్చి 1911 సం॥ రం.

ఇట్లు
విబుధజనవిధేయుఁడు
హోతా - వేంకటకృష్ణయ్య.

ఈ నాటకములో వచ్చు ముఖ్యపాత్రములు.

పురుషులు.

ప్రద్యుమ్నుఁడు—శ్రీకృష్ణునికుమారుఁడు. (కథానాయకుఁడు)

శ్రీకృష్ణుఁడు— ప్రద్యుమ్నునితండ్రి.

ఇంద్రుఁడు— నాకాధిపతి.

గదుఁడు
సాంబుఁడు. } ప్రద్యుమ్నునిసోదరులు.

వజ్రనాభుఁడు— రక్కసులఱేఁడు. (ప్రభావతితండ్రి)

రోమంధసుఁడు.
తామ్రాక్షుఁడు.
కఠోరదంష్ట్రుఁడు. } ఈముగ్వురు వజ్రనాభునిమంత్రులు.

యజ్ఞేశ్వరసోమయాజులు.
అగ్నిహోత్రచయనులు. } ఈ యిర్వురు బ్రాహ్మణులు.

భద్రుఁడు—అంతర్నాటికావేషుండగుప్రద్యుమ్నుఁడు.

అసితాంగుఁడు—అంతర్నాటికావేషుండగు శ్రీకృష్ణుఁడు.

అనేకాత్ముఁడు—అంతర్నాటికావేషుండగు నింద్రుఁడు.

స్త్రీలు.

ప్రభావతి—వజ్రనాభునికొమరిత (కథానాయకురాలు)

రాగవల్లరి—ప్రభావతిచెలికత్తియ.

శుచిముఖి— { దేవకార్యార్థినియును కామరూపిణియునగు హంసనారి (ప్రభావతిచెలికత్తియ)

శుద్ధపట్టిక.

ఈగ్రంథముఁ జదువుటకుఁ బూర్వ మీక్రిందిసవరణలు చేసికొనఁ జదువరులు ప్రార్థితులు.

పుట	పంక్తి	తప్పు.	ఒప్పు.
3	21	కమనీయంబగు... దివ్యతర	కమనీయోగ్రగదాయుధంబువర
11	15	అలరిశ్రీ... బనెడుసాధ్వి	పణతిశ్రీ... బయనుసాధ్వి
12	5	శ్రితచకోరికల	శ్రితచకోరముల
,,	7	కుమత... రము	కుమతి... రము
13	6	ద్రాంబాసతీరత్నముల్	ద్రశ్రీసతీరత్నమున్
,,	7	సతీమణులనన్	సతీమణియునా
16	23	భాగ్యోదయులన	భాగ్యోదయులగు
,,	24	దమోదళితైక	తమోదళనైక
17	7	మరీచీనీరాజిత	మరీచినీరాజిత
23	17	నాలోజించి	నాలోచించి
24	8	మొల్లములమల్లియల	మల్లికలమొల్లముల
26	14	అనేకసార్లు	పెక్కుసార్లు
32	6	నీనేమంటివి	నీవేమంటివి
41	8	యేణంబోలేకయేణాక్షి	యేణంబొక్కయేణాక్షి
43	9	జీవచిత్తురువెట్టిదో	జీవచిత్రమదెట్టిదో
53	27	కానరాఁడాతఁడెం	యతండిప్పుడెం
58	15	నీకువాదాచెలి	నీకువాదాచెలీ
,,	27	నిలికులవేణుల	నలికులవేణుల
60	26	కోలీ	కోమలీ
63	21	పు • ప్పమ్మెయయ్యెఁ	పు • ష్పమ్మెయయ్యెఁ
64	20	పలువిధ	బహువిధ
135	10	షోమశరణ్యుఁడన్	స్తోమశరణ్యుఁడన్
144	8	గావించితిని	గాంచితిని

గ్రంథకర్తయగు

బ్రహ్మశ్రీ, హోతా వేంకటకృష్ణయ్యగారు.

చ. వెరవరి హోతృవంశజుఁడు ♦ వేంకటరత్నతపఃఫలంబు న
బ్బురముఁగ వేంకమాంబకును ♦ బుట్టిన పుత్త్రుఁడు దిక్తటంబులన్
విరివిగఁ గీర్తిఁ గాంచినవి ♦ వేకియు వేంకటకృష్ణసత్కవీ
శ్వరుఁ డితఁ డెల్లచోఁ బొలుచు ♦ సారవచోవిభవాభిరాముఁడై.

శ్రీరస్తు.

శ్రీహయగ్రీవాయ నమః.

శుభమస్తు - అవిఘ్నమస్తు.

ప్రభావతీప్రద్యుమ్నము.

దేవతారాధనపూర్వకకృతిపతిప్రశంసనము.

శ్రీసంప్రాప్తికిఁ గూర్మమై నిలిపి యద్రిన్ క్షీరవార్ధిన్ సుధా
గ్రాసంబున్ గలిగించి సర్వవిబుధవ్రాతంబుఁ బాలింప ను
ల్లాసంబందు రమామనోహరుఁడు లీల న్వాత్సవాయాన్వయ
శ్రీసింహాద్రిజగత్పతీంద్రునకిడున్ శ్రీభోగభాగ్యోన్నతుల్.

మ. గిరిజార్ధాంగతటిద్ద్యుతిన్ శిరముపైఁ గ్రసించుగంగాఝరీ
స్ఫురితధ్వానవిశేషగర్జనలఁ బెంపుం జెందు శర్వాంబుదం
బురుకారుణ్యసువృష్టిసత్సనయనంశోద్భాసి సింహాద్రిభూ
వరువాంఛాంకురముల్ ఫలింప నిడు నైశ్వర్యంబు సత్కీర్తులన్.

మ. గరిమ న్నాలుగుమోముల న్నిగమ ముత్కంఠ స్మరింపంగ బం
గరపుబ్బోణియ మీటు భారతి నిజాంకంబందు నిల్వంగ స
త్కరుణన్ సర్వచరాచరప్రథితలోకస్ఫూర్తి నాబ్రహ్మ ను
స్థిరత న్వర్ధిల శ్రీజగత్పతి కిడున్ దీర్ఘాయురారోగ్యముల్.

సీ. చలిమలయల్లుని వలపించునాజగ
న్మోహను నలరించు ముద్దుగుమ్మ
నెత్తమ్మిగద్దియ నెలవైన నెఱజాణ
కడలినోములపంట గౌరిదంట

జాబిల్లి సైదోడు సరసంపుగోనముల
కలికి పూవిల్తునిఁ గన్నతల్లి
కలుషము లడఁగించు చెలి నల్వజనని
పున్నెములకు గనియైన నెలఁతమిన్న

గీ. కులుకుఁగ్రొమ్మించుజిగిడాలు గలవలంతి
రదనజితకుందపఙ్క్తి సంపదలదొంతి
యనిశమును వత్సవాయసింహాద్రిజగప
తీంద్రుసదనంబున న్వసియించుఁగాత.

సీ. తారకాసురునిసంహారార్థ మొనఁగూడె
నేదేవికిని గుమారోదయంబు
దగ్ధుఁడై నట్టిచిత్తజుజీవ మిడి రతీ
భామ కేదేవి సౌభాగ్య మొసఁగె
మహిషదానవనాథు మర్దించి యేదేవి
దేవతావళిబాధఁ దీర్పఁ గలిగె
కినియ గంగను శిరంబున నిల్పఁగా నిచ్చె
నేదేవి కర్థాంగ మీశ్వరుండు

గీ. అట్టిమృత్యుంజయునిరాణి యబ్జపాణి
దృగ్వినిర్జితచకితైణి దివ్య మధుర
వాణి యలివేణి సైకతశ్రోణి యెపుడు
జయము భద్రంబు మత్కృతిస్వామి కొసఁగు.

చ. అతుల కలాకలాపయుత యై విబుధప్రమదాప్తి వల్లకీ
గతుల ఘటింప రమ్యముగ గానము సల్పుచు నంచతత్తడిన్
గుతుకముతో మనోవిభునిఁ గూడి చరించెడుశారదాంబ యీ
కృతి ననవద్యలీల వెలయింపఁగ నా రసన న్వసించుతన్.

క. శాంతున్ దాంతున్ బుణ్యాసు
ఖాంతున్ సుజ్ఞానవిదళితాజ్ఞానోగ్ర

ధ్వాంతుఁ మత్కృతిపతికిఁ
జింతల నెడఁబాప నాదిశేషు భజింతున్.

చ. ప్రమథగణంబుతన్గొలువఁ బార్వతియుం బరమేశ్వరుండుఁ బా
ర్శ్వములనెసంగ ముద్దుగొలుపన్ రజతాచలమందు సర్వలో
కములకుశోభనమ్ములిడఁగా నటనమ్మొనరించుసామి యా
విమలగజాస్యుఁ డీకృతి నవిఘ్నము గా నెరవేర్చుఁ గావుతన్.

చ. పొలసులదిండి మబ్బులడఁపుంబెనుగాలిగ నబ్ధిదాటి దు
ర్లలితపులంకఁ జొచ్చి రఘురాముని ముద్రిక నిచ్చి సీతకున్
దెలివిఁ దొలంగ లక్ష్మణుమృతిం గనకుండఁగఁ జేసినట్టిని
ర్మలుఁడతిశాంతుఁడౌచు హనుమంతుఁడు మత్కృతిభర్త నేలుతన్.

క. జననీదాస్యము నీగఁగఁ
జని వజ్రిని గెలిచి యమృతసంగ్రహుఁ డై వి
ష్ణునివాహన మగుగరుడుని
ననయముఁ గృతిపతియఘంబు లడఁప భజింతున్.

క. ధీరోదారుం బార్వతి
గారాబుకుమారు శూరుఁ గ్రౌంచవిదారుం
దూరీకృతకల్మషవి
స్తారుం గృతిపతికిఁ బౌరుషం బిడఁ గొల్తున్.

మ. క్రమమై నందకముం సుదర్శనము సత్కౌమోదకీపాంచజ
న్యములుం శార్ఙ్గము నాగనొప్పు హరియుద్యత్ఖడ్గముం జక్రమున్
గమనీయంబగుకంబు దివ్యతరశంఖంబుం ధనుస్సుం సదా
ప్రమదంబొప్పఁగ సింహగోత్ర ధరణీపాలుం గృపం బ్రోచుతన్.

సీ. జలధికుమారి కుమ్యోల యన నురమందు
వనమాల యై గ్రాలు వైజయంతి
కౌస్తుభ వనమాలికల క్రింద సిరిబొట్టు
లా గొప్పు శ్రీవత్సలాంఛనంబు

బృందాటవిని గోపబృందంబు నలరింప
గారవించెడు మురళిరవంబు
నీలమేఘంబున గ్రాలుక్రొమ్మించన
హరిమేన మెఱయు పీతాంబరంబు

గీ. మానితంబుగ వర్షావసానమందు
తరణిరుచిఁగల్గు నాయింద్రధను వనంగ
నలరు వెన్నుని బర్హిబర్హంబు నోలి
నొసఁగుఁ గృతిపతికిని శుభాభ్యుదయములను.

ఉ. జీవనముం గ్రహింపుచును జీవనమిచ్చుచు జీవకోటికిన్
జీవనజంబులో వెలయు శ్రీఁ గృతిభర్తగృహంబునందు స
ద్భావముతో డనిల్ప దళితంబుగఁ జేయుచుఁ దన్కరందసం
భావన షట్పదంబులఁ గృపం దనియించు రవిం దలంచెదన్.

మ. భువనాహ్లాదకరుండు షోడశకళాపూర్ణుం డుమానాధమౌ
ళివిహారుండును దక్షపుత్రికలఁ బాలింగూడు బృందారక
ప్రవదాన్యుండు నపారదుగ్ధజలధిప్రాంచత్కుమారుండు కై
రవమిత్రుం డమృతాంశు మత్కృతిపతిం రంజిల్లఁగాఁ జేయుతన్.

గీ. సర్వభక్షకుఁ డయ్యు నిచ్చలును బరమ
శుచి యనఁ జరాచరముల విశుద్ధతేజ
మున వెలుఁగు భూతమయుఁడుఁ బావనుఁడుఁ గర్మ
సాక్షి మత్కృతిపతి పాపసమితి నేర్చు.

ఉ. భూనుతపావనుం డఖిలభూతమయుండు నదృశ్యమూర్తి స
న్మానితలీల జీవుల కనారతముం శరణంబు నా జగ
త్ప్రాణుఁడు వాయుదేవుఁడు మహాబలుఁడై తుని రాజ్యశోభితా
స్థానుని మత్కృతీశు జవసత్వసమన్వితుఁ గా నొనర్చుతన్.

క. పుణ్యుఁడు భువనారాధ్యుఁడు
ధన్యాత్ముఁడు దేవతావదాన్యుండగు ప

ర్జన్యుఁడు మత్కృతిపతికి న
గణ్యకృపావృష్టిఫలసుఖంబు లొసంగున్.

ఉ. దేవభిషగ్వరుల్పరమదివ్యచరిత్రులుఁ బుణ్యలోకసం
భావితమూర్తు లార్తజనబంధులు గుంతిసపత్నిమాద్రి మున్
భావనఁ జేయఁబుత్రులఁ గృపం దయచేసినపూజ్యు లశ్వినీ
దేవత లెప్డుశ్రీజగపతిన్ సుఖిఁగా విలసిల్లఁ జేయుతన్.

ఉ. వింతచికిత్సలం దనరి వేల్పులఁగావఁ బయోధిఁబుట్టి భూ
కాంతుఁ బరీక్షితుం గఱవఁగాఁజనుతక్షకు నాత్మనైపుణిన్
గొంతఁ గనంగఁ జేసినయకుంఠితవైద్యవిశారదుండు ధ
న్వంతరి మత్కృతిప్రభుని వైద్యమునం సహకారిగావుతన్.

శా. వేదోల్లాసులు సిద్ధసాధ్యులమరుల్ విద్యాధరుల్ కిన్నరుల్
మోదంబార మహర్షిసంఘముతపోముఖ్యుల్మునుల్యోగులున్
బ్రోదిన్వేంకటసింహగోత్రపతికిం బూర్ణప్రభావంబు సు
శ్రీదీర్ఘాయురభీష్టముల్ కలుగనాశీర్వాదముల్ సేయుతన్.

ఉ. ప్రాకటయోగదర్పణవిరాజితరామచరిత్రమెల్ల న
స్తోకమనీషసాంస్కృతికశోభితకావ్యముఁగా రచించి సు
శ్లోకతసృష్టిఁ జేసెను విశుద్ధగతిం గవితాకుమారివా
ల్మీకి నుతింతు సద్గుణసమేతుని నాదికవీంద్రు భక్తిమై.

క. వ్యాసుని యోగాభ్యుదయవి
లాసుఁ బురాణేతిహాసలక్షణకవితా
భ్యాసుని సద్బుధహృదయని
వాసు నవిద్యాంధకారభాస్కరుఁదలఁతున్.

ఉ. సారవచోవిశుద్ధికయి సంస్కృతసత్కవి భారతీవరుల్
భారవి మాఘు బాణు శివభద్రు మయూరునిఁ గాళిదాసునిన్
భూరిసుధీసమేతు భవభూతిని దండిని హీరు మల్హణున్
జోరుని శంకరాదుల విశుద్ధమనీషుల సంస్మరించెదన్.

ఉ. సన్నుతిఁ జేయుదుర్ గవనచాతురికాంధ్రకవీంద్రకోటి న
భ్యున్నతి సద్యశ స్తనుసముజ్జ్వలవర్తుల సచ్చరిత్రులన్
నన్నయ శంభుదాసు సిరినాథునిఁ దిక్కనసోమయాజిఁ బో
తన్నను సోమనాథుని ముదమ్మున భాస్కరమంత్రిముఖ్యులన్.

సీ. ధర నాంధ్రకవితాపితామహుం డను పేర
విలసిల్లునలసాన పెద్దనార్యు
శ్లేషార్థకలితవిశేషసత్కవితాప్ర
భావంబుచే మించుభట్టుమూర్తి
కిసలయమృదులసాంద్రసయుక్తసత్కావ్య
మహితుఁ డౌముక్కుతిమ్మనకవీంద్రుఁ
బాండురంగాధ్యక్షుపదభక్తి శోభిల్లి
కీర్తిఁగాంచినరామకృష్ణసుకవి

గీ. భూరిగుణధుర్యుఁ బింగళి సూరనార్యుఁ
బ్రౌఢకవి ధూర్జటిని రామభద్రుఁ గీర్తిఁ
గన్న పిల్లలమఱ్ఱిపినవీరన్న విశ్వ
నాథకవి నెంతు శేముషీసాధనముగ.

ఉ. పేరిమిగ్రంధగంధము వివేకము లేక పరార్థసంగ్రహా
స్ఫారకవిత్వవైఖరుల సల్పుచుఁ గబ్బము లేన్ని యేనహం
కారమునన్వివాదములఁ గల్పనఁ జేసికవీంద్రకోటికిన్
భూరియశంబుఁ బెంచు కుకవుల్పరమాప్తులటంచు నెంచెదన్.

క. దోషోదకే మేదుచు గుణ
శేషక్షీరంబుగొనుచు శేముషి భాషా
యోషామణి హితులైన మ
నీషాసత్కవిమరాళనికరముఁ దలఁతున్.

క. శాంతుఁడు ధీనిధి కరుణా
స్వాంతుండ సద్గురుండు సరసుఁ డవిద్యా

ధ్వాంతప్రభాకరుండగు
పంతుల శ్రీరామశాస్త్రి భక్తినుతింతున్.

క. అని యిష్టదేవతావం
దనము సుకవిలోకపూజనముఁ గుకవిజనం
బును నింద సలిపి గురుపద
వనజంబుల కెరఁగి భక్తిపరవశలీలన్.

వ. నే నొక్కనాఁడు సుఖాసీనుండనై యాత్మగతంబుగ.

ఉ. పాంచభౌతికంబు క్షణభంగురముం జలబుద్బుదంబు జీ
వించు నశాశ్వతంబుగ నశించును దేహ మొకప్పుడైనఁ బ్రా
గాంచి బుధుండు సత్కృతిముఖంబునఁ బొల్చినఁ గీర్తిచంద్రికా
భ్యంచితమూర్తియై నెగడు నంచుఁదలంచుచు నుండ నత్తఱిన్.

సీ. ఏదానఘనుకృపావృష్టిచే నాశ్రితా
భీష్టసస్యము ఫలియించుచుండు
నేత్యాగగుణిమహోదితోదయంబుచే
దారిద్ర్యఘోరసంతమసమడఁగు
నేవితరణచంద్రుఁ డావిర్భవించిన
దీనచకోరాళి తృప్తిఁ జెందు
నేవదాన్యసుకల్పవృక్షసమాశ్రయం
బునవనీపకశుకంబులు చెలంగు

గీ. నట్టిమహనీయధవళితాశాంతకీర్తి
చంద్రికాపుంజరంజితోజ్జ్వలవిహారి
యమలశ్రీవత్సవాయవంశాబ్ధిచంద్రుఁ
డైనసింహాద్రిజగపుఁడత్యాదరమున.

చ. వినుతమహీసురోత్తములు వేదవినోదులు శాస్త్రపండితుల్
గుణమణిహారులౌ నృపులుఁ గోవిదులౌ సచివుల్ కవీశ్వరుల్
ఘనులగు గాయకుల్ సఖులుఁ గాలవిదుల్ గణికల్ భిషగ్వరుల్

దనుఁగొలువన్సభాస్థలి ముఖ్యదంబునఁ గూర్చుని చిద్విలాసుఁడై.

వ. నన్ను సగౌరవంబుగ బిలువంబనిచి యర్ఘాసనంబునఁగూర్చుండ నియమించి యఖండవాల్లభ్యలక్ష్మీకటాక్షవీక్షణాసారంబుల నన్నుందేరల్చి సాదరవచోమృతంబు వర్షింపుచు సకలకలుషనివారణంబును శుభవిభవకారణంబును సర్వాభీష్టఫలావాప్తినిదానంబు నగు భవ్యకావ్యాధిపత్యసంపాదనకుతూహలాధీనమానసుండై యిట్లనియె.

ఉ. వీనులవిందుఁగొల్పుటకు శ్రీ వేంకటకృష్ణకవీంద్ర! సప్తసం
తానములందు నన్నుచితంబుఁగ శాశ్వతకీర్తిలక్ష్మికా
స్థానము భూరిభవ్యఫలదం బొకసత్కృతి యాటచేత నిం
పౌనొకనాటకంబును మదంకితసత్కథగా రచింపుఁడీ.

వ. మఱియు,

సీ. వరరోహిణీ సుధాకరవిజయమును సం
ప్రీతిమైమున్ను కల్పించితీవు
దివ్యమై ఖరిద్రాపదీస్వయంవరమును
బృథ్విపై వెలయ ఘటించితీవు
ప్రౌఢి శశికళాసుభద్రార్జునీయస
త్పృథునాటకముల నిర్మించితీవు
భవ్యప్రభావతీప్రద్యుమ్న నాటకం
బెలమిమత్కృతిగా రచింపవలయు.

గీ. లలితపల్లవమృదులపేశలమరంద
రససమంచితకవితా విరాజమాన
హరోత్పసద్వంశదుగ్ధపయోధిచంద్ర!
కీర్తిగుణధుర్య! వేంకటకృష్ణయార్య!

చ. అని కొనియాడి నాకు కనకాంబరకంకణరత్నహారవా
హనఘనసారచందనసమంచితవీటికలిచ్చి నెమ్మొగం
బునఁ జిఱునవ్వొలర్పఁగ నపూర్వకృపామతి గౌరవింపఁగా

కోనిముదితుండనై తమినిఁ గుడ్వఁగనిట్లనుకొంటి నాత్మలోన్.

ఉ. భద్రతగంటి వత్సవయవంశపయోబ్ధి సుధాకరుండు సిం
హాద్రిజగత్పతీంద్రుఁ డనఘాత్మకుఁ డర్థిసురద్రుమంబు ని
ర్నిద్రయశోవిహారుఁడు వరించెను నాకృతికన్య నింకసం
పద్రమణీయవైఖరుల వర్ధిలఁగల్గెడఁ దత్కృపాప్తిచేన్.

వ. అని యమందానందకందళితహృత్కుశేశయుండనై నందనందనప దారవిందవందనకృతార్థశీలుండగు శ్రీ రాజా వత్సవాయ వేఙ్కట సింహాద్రిజగత్పతి రాజాబహద్దరు మహారాజునకు నిరంతరాభ్యుదయ పరంపరాభివృద్ధికరంబుఁగాఁ దదీయవంశావతారం బాకించుక యభి వర్ణించెద.

సీ. శ్రీజానినాభిరాజీవమధ్యంబున
స్రష్ట పుట్టెను జగత్సృష్టికొరకు
విశ్వనిర్మాతకావిర్భవించె మరీచి
యతనికి కశ్యపుండవతరించెఁ
బ్రభవించెఁ గశ్యపబ్రహ్మకు బ్రహ్మాండ
భాండదీపకుఁడగు భాస్కరుండు
వారిజమిత్రుండు వైవస్వతుని గాంచెఁ
గనియె వైవస్వత మనువు సుతుల

గీ. దత్తు నిక్ష్వాకునృపుని దద్వంశమునను
బొడమిరి కకుత్స్థుఁడును రఘుపుంగవుండు
దశరథుఁడునాత్మతీయభూధవునకొదవె
రాముఁడు గుణాభిరాముఁ డుద్దామయశుఁడు.

వ. ఏతాదృశమహాపురుషభూషితంబైన సూర్యాన్వయంబున వత్సవాయ వంశంబు క్రమంబుగ సుప్రసిద్ధంబయ్యె నందు.

ఉ. శ్రీకమనీయసద్గుణవిశిష్టమహోన్నతవత్సవాయస
త్ప్రాకటవంశవార్ధిశశిభాసురసాధ్వి సీతయాంబ న

స్తోకతఁ బెండ్లియాడి పరిశుద్ధయశఃపటలప్రసాధితా
శాకలితుండునా నెగడెశక్రసమానుఁడు జోగి రాజిలన్

చ. వరగుణుఁడైన జోగి నరపాలున కుజ్జ్వలసీతయాంబకున్
స్ఫురదకళంకరూపజితపుష్పశరుండు కుమారరత్నమ
ట్టురముగఁబుట్టి సద్గుణవిభూతిఁదలిర్పఁగ నచ్చయాంబన
త్కరము గ్రహించియేలెను ముదంబున సూరపరాజు ధారుణిన్.

క. ఆవరదంపతులకు ల
క్ష్మీవిష్ణులకొదవినట్టి చిత్తజుఁడనఁగా
నావిర్భవించె జనులను
గావ జగన్నాధరాడ్జగపతీంద్రుఁ డిలన్.

సీ. సర్వసర్వంసహాధూర్వహోన్నతభుజో
త్సాహపాలితధర్మసంగ్రహుండు
ననుపమగుణరత్నహారభూషితతనూ
రమ్యసౌందర్యవిభ్రాజితుండు
పరగండభైరవస్ఫురసంగరాభీల
పటువిక్రమార్జితభద్రయశుఁడు
భోగభాగ్యోదయస్ఫూర్తిధిక్కృతపురం
దరవైభవశ్రీవిధానచణుఁడు

గీ. నిఖలభూతదయాన్వితనిత్యసత్య
వర్తనరతుండు శ్రీవత్సవాయవంశ
జలనిధిసుధాంశుఁ డీమహీచక్రమేలె
నందితాత్ముండు శ్రీజగన్నాధశౌరి

క. ఆధరణీజాని జగ
న్నాధనృపాగ్రణి ప్రియంబునన్ గైకొనె సా
ధ్వీధర్మలసితసుగుణా
రాధితరాజ్ఞానుభద్రరాడ్వంశమణిన్.

ఉ. శ్రీయుతు లాసతీపతులు ఽ చేరిరమాచ్యుతులో యనన్ రతీ
కాయజులట్లనిత్యమునఽఖండ పరస్పరరాగ పూర్ణులై
వేయివిధంబులన్మెలఁగి ఽ విశ్రుత సద్గుణవర్తి సూర్యనా
రాయణరాణ్మహీపతివి ఽ రాజితకీర్తిని గాంచి రింపుఁగన్,

మ. విభవప్రోద్దాముఁడు సద్వదాన్యుఁడుఁ గళా ఽ విస్ఫారతన్ భోజస
న్నిభకీర్తి ప్రభవిష్ణుఁడై యతుల నిఽర్నిద్రప్రభావాఢ్యుఁడై
సభలందున్నతికెక్కువత్సవయ రాఽజాసూర్యనారాయణ
ప్రభుఁ డీక్ష్మాతలమేలె నింద్రునిబలెన్ ఽ ప్రావీణ్య మేపారఁగన్.

మ. జగతిన్ బ్రస్తుతిగన్న సాధ్వియగు రాఽజాబుచ్చి సీతయ్య డం
బుగ శ్రీసూర్యనరాయణాధిపునిసఽమ్మోదంబున న్గాఁడుచున్
సుగుణోల్లాసినియై కనెన్ సుతులశ్రీఽజోగిజగన్నాధరా
డ్జగపున్వేంకటసింహాగోత్రధరణీఽజాని న్బహద్దర్మణిన్.

వ. అందు

గీ. ప్రబలి జోగిజగన్నాధఽరాజవాళి
యలరి శ్రీబుచ్చిరామయాంఽబనెడు సాధ్వి
వేంకటసుభద్రయాంబను ఽ పెండ్లియాడి
యేలి పదునాల్గునెల లిల ఽ నేగెదివికి.

సీ. అభ్యాగతులకు మృష్టాన్నసత్రములుంచి
ధరపై వెలయుసురఽసురభియనఁగ
హాళికులకుజీవఽనాధారమగుకృపా
ఖండవృష్టినొసంగు ఽ ఘనుఁడనంగ
విద్యార్థులకుఁ గలాఽవిఖ్యాతికై పాఠ
శాల నిల్పినకల్పఽసాలమనఁగ
దుష్టుల శిక్షించి ఽ శిష్టుల రక్షింపఁ
బృథ్వీరంజిలుమహాఽవిష్ణు వనఁగ

గీ. నక్షయఖ్యాతి గుణరీతి ఽ నతిశయించు

వత్సవయవంశదుగ్ధాబ్ధివనజవైరి
సత్యశీలుఁడు సింహాద్రిజగపతీంద్ర
రాజబిరుదాంకుఁడగు మహారాజశౌరి.

సీ. వత్సవాయాన్వయ వార్ధినుప్పొంగించి
శ్రితచకోరికల రక్షించి మించి
బంధుమానస కైరవము లెలర్పఁగఁజేసి
కుమతచిత్తాంధకారముఁ నడంచి
ఖలులహృదబ్జ వికాసంబుఁ దొలఁగించి
నతలోకదైన్యసంతాప ముడిపి
సకలజనాహ్లాదసంపాదన మొనర్చి
దిశలెల్లఁ గీర్తిచంద్రికల నించి

గీ. సత్పథంబున మెలఁగి నక్షత్రము లన
దనరు వేంకట శ్రీసుభద్రయ్యసాధ్వి
పరమకల్యాణి రాజా సుభద్రయాంబ
రమణ పెండ్లాడె సింహాద్రిరాడ్విధుండు

సీ. సింహాద్రిజగపతిఁ జేరినలక్ష్మినాఁ
దనరు వేంకటసుభద్రయ్యగారు
ఘనవత్సవాయ నందనకల్పకంబు నాఁ
దనరు వేంకటసుభద్రయ్యగారు
పూనికాశీయన్నపూర్ణ యిందుండెనాఁ
దనరు వేంకటసుభద్రయ్యగారు
దివినొప్పు కామధేనువు మహి నిల్చెనాఁ
దనరు వేంకటసుభద్రయ్యగారు

గీ. దివ్యగుణవల్లి పరమసాధ్వీమతల్లి
దంతులూరికులాబ్ధి నుద్భవముఁ జెంది
తునిమహారాజ్ఞియై కీర్తిఁగని వెలుంగు

ధరను వేంకటశ్రీసుభద్రయ్యగారు.

తే.గీ. పావనసుశీల రాజా సుభద్రయాంబ
యవని శ్రీవేంకటసుభద్రయాంబతోడ
ఛాయపోలిక సింహాద్రిజగపతిప్ర
తాపమార్తాండుఁగొలుచుచుఁ దనరుచుండు.

శా. రాజా వేంకట శ్రీసుభద్రయు సుభద్రాంబాసతీరత్నముల్
రాజీవాలయభూసతీమణు లనం రాజిల్ల వైకుంఠ వి
భ్రాజిష్ణుం డగువిష్ణువోలె ధనసంపత్పుత్రపౌత్రాప్తిచే
సౌజన్యోన్నతకీర్తి వర్ధిలు గృతీశస్వామి యెల్లప్పుడున్.

క. అని మత్కృతిపతివంశముఁ
గొనియాడి యొకింత శక్తికొలఁది నిఁకను నే
నొనరించెదఁ దద్విభునకు
జనులెల్ల నుతింపఁదగిన షష్ఠ్యంతంబుల్.

షష్ఠ్యంతములు.

క. ఏతాదృశగుణభాసికిన్
బూతచరిత్రునకుఁ బరమభూతదయాసం
జాతమహాఖ్యాతిజయో
పేతఖగస్థంభునకు సువృత్తరతునకున్.

క. అరినికరానిలదర్వీ
కరునకు నిజవితరణప్రకంపితశిబిభా
స్కరసుతదధీచిసురతరు
వరజీమూతునకుఁ బుణ్యవర్ధిష్ణునకున్.

క. పరధనపరదారోత్సవ
పరాఙ్ముఖున కఘతమఃప్రభాకరునకు మే
దురసత్యశీలునకును
స్థిరధర్మాత్మునకు బంధుచింతామణికిన్.

క. ఘోటకగజశిక్షణవి
స్ఫోటభిషక్శిల్పిరత్నశోధనముఖవి
ద్యాటోప చరితునకు నా
ఖేటవిహారోన్నతున కకిల్బిషమతికిన్.

క. అమితసదాచారునకున్
బ్రముదితకవికోటివినుతప్రావీణ్యునకున్
గమనీయగుణకదంబున
కమలశ్రీ కలితతుని మహారాజునకున్.

క. అద్రి సమధీరునకు ని
ర్నిద్రజయాభ్యుదయవర్ణనీయనృపున క
క్షుద్ర ప్రతాపనిధికి సు
భద్రాంతఃకరణనిత్యభావనఘృణికిన్.

క. శ్రీవత్సవాయవంశసు
ధావార్ధిపూర్ణిమాసుధాకరునకు స
ద్భావున కకుటిలకర్షక
జీవనసంధానసుప్రసిద్ధచణునకున్.

క. పంకవిదూరన కాశ్రిత
సంకటహరణునకు నిఖిలశరణాగతని
శ్శంకావనాంకునకు శ్రీ
వేంకటసింహాద్రిరాడ్పవిత్రయశునకున్.

వ. అభ్యుదయపరంపరాభివృద్ధియగునట్లుగా నా రచియింపంబూనిన ప్రభావతీప్రద్యుమ్నంబను నాటకరాజంబునకు నాందిప్రస్తావనాసమంచితంబగు కథాక్రమం బెట్టిదనిన.

—:o:—

శ్రీరస్తు.

శ్రీహయగ్రీవాయ నమః.

ప్రభావతీప్రద్యుమ్నము.

నాంది

శ్రీసల్లాపము లొప్పఁ బుణ్యజనులన్ జింతించి లోకంబుల
త్యాసక్తిన్వెలయించిమించి ముదమందన్ వత్సవాయాన్వయ
శ్రీసింహాద్రి జగత్పతీంద్రునకు నక్షీణాయురారోగ్యల
క్ష్మీసత్కీర్తులొసంగు శౌరి మిము రక్షించున్ గటాక్షంబునన్

మ. సుమనఃపుంజరతిన్వినోదగతులన్ శుద్ధాంతసీమంతినీ
విమలాంతఃకరణంబులం గలఁచుచున్విభ్రాంతుల న్బాంధలో
కముఁ దూలించి జగత్పతీంద్రునిహాసౌఖ్యశ్రేణి రంజించు ను
త్తముఁ బ్రద్యుమ్నునిగన్నతండ్రి హరి నిత్యంబున్మిమున్ బ్రోచుతన్.

(అని సభ్యులపైఁ బుష్పములు జల్లుచున్నాఁడు.)

ఇట్లు నాంది యైన తరువాత.

ప్రస్తావన.

సూత్ర:—(నల్వలంకులఁ గలయఁ జూచి సంతోషముతో) ఓహో! నేడీప్రదేశ మెంత మహోల్లాసకరంబుగ విరాజిల్లుచున్నయది!

* సీ. ఒకచెంత నతికాంతవికచకాచవిశేష
పాత్రలదీపికల్ ప్రజ్వలింప
నొకవంక సకలంకశుకపికకలకలం
బన సభాసదులభాషణము లొలయ

నొకచాయఁగమనీయ । సకలతంత్రి మృదంగ
గాయకగాయకీ ।గాన మెసఁగ
నొకయోరఁదనివారఁ । బ్రకటచిత్రితచిత్ర
వితతి నేపథ్యముల్ । వ్రేలుచుండ

* గీ. నెచటఁ గనుఁగొన మదిహర్ష । మినుమడింప
విపులకవిగురు బుధరాజ।వితతి తోడ
స్వర్గపతిపోలె సింహాద్రి । జగపతీంద్రుఁ
డలర రంగస్థలము దివి । యన వెలుంగు.

(అని సంభ్రమంబుగ) ఏమిచెపుదు ! నా ప్రియురాలు రమ్మనిచెప్పిన నింకను రాక యాలస్యము చేయుచున్నది. ఇంతదనుక నలంకరించుకొనుట కానేలేదు కాఁబోలు. సరిసరి, "చీరసింగారించుకొనేసరి కూరుమ్మూటుపడఁగె" నన్నటులఁ జేయునేమో కదా. కార్యార్థు లగుదురేని బరస్పరానురాగపూర్ణులైన నాయికానాయకులకు క్షణమాత్రవియోగంబైనను దుర్భరంబె.

మ. మతిచాంచల్యము గొల్పుధైర్య మణచు ।న్మానంబుఁ దూలించు సం
తతమున్ మైమఱుపొందఁజేయు నను వ్రే।ల్దన్ గూర్చుచు న్వేషముల్
రతిచేకూరఁగ కాలుగాలిన బిడా।లంబుంబలెన్ ద్రిప్పు న
ద్భుతలీలం గనుగప్పనే విబుధుఁ బ్ర।ద్యుమ్న ప్రభావం బహో!

(అని స్మృతినభినయించి) అన్నా ! నే ప్రియాసందర్శనాధీనమానసుండనై ప్రస్తుతకరణీయంబును మఱచితిని. సకలకలాకోవిదవిద్వజ్జనసందోహబంధురంబైన యీసభామందిరంబున.

* సీ. నిఖిలాగమామ్నాయ।నిపుణులై వెలయు భూ
త్రిదిశులౌపరమశ్రో।త్రియులతోడ
కువలయానందభా।గ్యోదయులనఁదమో
దళితైకరాజ బృం।దంబుతోడ
సకలకలారహ।స్యవిశారదానేక
కవిగురుపండిత।గణముతోడ

పూజ్యసామ్రాజ్యవిభూతి నిజామాత్య
ఘనభటభృత్యవర్గంబుతోడ
గీ. తారకావళిమధ్య సుధాకరుండు
వరలుకైవడి శ్రీ వత్సవాయవంశ
జలధిచంద్రుండు సింహాద్రిజగపతీంద్రుఁ
డొనరఁగూర్చుండెఁ దీర్చి పేరోలగంబు.

* కాని నిఖిలనరపాలమకుటమాణిక్యమరీచీనీరాజితపాదపంకేరుహుం డగు నీ మహారాజు మ్రోల,

ఉ. గౌరవగానకోవిదపికంబుల వేదసుధీమదాళులన్
సారమనీషులన్ సలిలజప్రకరంబుల నాటకాద్యలం
కారరసజ్ఞహంసలను గ్రాలు సభారమణీయదివ్యకా
సారమునందు నే నెటు విసారము నై విహరింపనేర్తునో.

* నే నిపు డే నాటక మిటఁ బ్రదర్శించి కోవిదులగు నీ యార్యమిశ్రులను రంజింపఁ గలుగుదునో తోచకున్నది. (అని యాకసమువంక తనకర్ణంబు నునిచి) ఆఁ! కుశీలవ! ఏమనుచుంటివి?

" నాటక ప్రదర్శనకలాకుశలుండవగు నీవలన నిదివరలో రోహిణీసుధాకరవిజయము, ద్రౌపదీస్వయంవరము, శశికళాసుదర్శనము, సుభద్రార్జునీయము మున్నగు శృంగారనాటకంబుల రచియించి వన్నెవాసిఁగని విరాజిల్లు సరసకవికృతంబును మృదుమధురసూక్తిముక్తాఫలగ్రథితంబునగు నాటకాలంకారంబునుఁ గన మహారాజుగారు త్వరపడుచున్నారు. కావున శీఘ్రము బద్దానిఁ బ్రదర్శింపుము "

అనియా? సరే. నేను నాప్రయత్నములోనే యున్నవాఁడను. (అని తనలో)

చ. కుముదినికి న్వికాసమునుఁ గూర్పఁగఁజాలునె చంద్రికాసహా
యమునను గాక చంద్రుఁ డనయంబును తావినిఁగూడిగాక పు
ష్పము జనపాళిచిత్తముల భాసిలఁ జేయునె నే నటీసహా
యమునను గాక సభ్యులగు నార్యుల నెట్లలరింతు నొంటిఁగన్.

(అని ప్రకాశముగా) నటీ! నటీ! నీవు శృంగారించుకొనుట యైనపక్షమున శీఘ్రముగ నిటురమ్ము.

[అంత నటి ప్రవేశించి]

నటి—(సూత్రధారుని సమీపించి) ఆర్యపుత్రా! నమస్కారము. (అని యభివందనం చరించి) మీరు న న్నెందుకొరకై పిలిచితిరి?

సూత్ర—ప్రియురాలా!

ఉ. ఆమని గండుకోయిల లహర్నిశముం బ్రియురాండ్రఁ బిల్వవే
కోమలి! ధీప్రసూన బుధకుంజముల న్విలసిల్లు నీ మహో
ద్దామసభావనంబున ముదంబు ఘటింపఁగ నే పికంబ నై
ప్రేమను నిన్నుఁబిల్చితిని ప్రేయసి! నాదగుకోర్కె తీరఁగన్.

* ముందుగ నీ వీ యతిరమణీయమగు సభాభవన మవలోకింపుము. అందు,

* ఉ. భద్రగుణప్రకీర్ణుఁ డనవద్యయశోమణిహారుఁ డర్థిక
ల్పద్రుమ మాశ్రితావనకృపాపరతంత్రుఁడు ధర్మమార్గని
ర్నిద్రరతుండు వత్సవయనిర్మలవంశవిభూషణుండు సిం
హాద్రిజగత్పతీంద్రుఁ డహహా! మహారా జదె వెల్గు చూచితే.

* నటి—(సహర్షయై) ఓహో! ప్రాణేశ్వరా! నేడుకదా మనముధన్యులమైతిమి.

* సీ. ఇతఁడె కోస్తాంరాజ్య మేలుచు నసమాన
భూతదయోన్నతఖ్యాతిఁ గాంచె
నీతండె రాజనం బింతైన లేకుండ
నార్తరక్షణపరాయణత మించె
నీతండె సౌజన్యహితుఁడౌచు నౌదార్య
కలన ధర్మనిరూఢిఁ ఘనతఁ జెందె
నీతండె కవికోటి నేపారఁబెంచుచుఁ
దనరు సన్మార్గవర్తన సతంబు.

గీ. చేతమలరంగఁ గర్షక జీవనప్ర
దాతయాఘనుఁ డితఁడె యీతండె నుతుల
వెలయుఁ బరధనపరదారవిముఖుఁ డనఁగ
రాజమాత్రుండె సింహాద్రిరాడ్వరుండు.

* మఱియు,

* చ. పవలును రేయిఁ బాంథజనసంపాళికి నన్నమిడంగ సత్రముం
చి వివిధపక్షిజాలము వసించిసుఖింపఁ గులాయకోటి చే
రువ ఫలవృక్షరాజిని సరోవరమున్ నెలకొల్పె వైద్యుఁడున్
భువిని సమస్తరోగజనసంపోషకుఁడున్ మహారాజె నాయకా.

* అట్టి నిరుపమానభూతదయాళచిత్తవృత్తుండును భువనైకవదాన్యుండు నగు మహారాజును నేడుకదా మనముకన్నులకఱవుతీరఁ జూడఁగల్గితిమి, ఇంతకన్న సార్థక్య మేమి కలదు? నాథా! ‡ ఆర్యమిశ్రుల యాజ్ఞ యెట్టిదియో సెలవిచ్చెదరా?

సూత్ర—ప్రియురాలా! సభాసదులయనుజ్ఞపై * సాంద్రతరయశశ్చంద్రికాప్రసాధితదిగ్విటంకుండగు శ్రీ వేంకట సింహాద్రిజగత్పతీంద్రు నలరింప;

‡ మ. క్షితి శ్రీ వేంకటకృష్ణసత్కవి రచించెన్ దేనినో దేనికిన్
గృతినాథుండు జగత్పతీంద్రుఁడో లతాంగీ! నైపుణిన్ దత్ప్రభా
వతిప్రద్యుమ్నమనంగనాటకము భాస్వత్పండితశ్రేణి రం
జితులై మెచ్చుచు మేల్భళీ యనఁ బ్రదర్శింపంగ నే నెంచితిన్.

నటి—(ఆశ్చర్యమభినయించుచు) ప్రాణేశ్వరా! ఎంతదుర్ఘటం బగుకార్యంబుఁ దలఁపెట్టితిరి.

గీ. విపులచంద్రామృతముఁ గ్రోలువిబుధవరుల
కెట్లు దగఁదీర్చుపల్వలంబు బిట్టిగ్రంథ
సూక్తి నెంతురె పింగళ సూరనార్యు
లలితకవితామృతముఁ గ్రోలులాక్షణికులు.

*సూత్ర—ఓసివెఱ్ఱిదానా! కవితాకన్యకనలంకరించు నలంకారమణులకు శాణమొనర్చి మెఱుఁగిడఁజాలువారు లాక్షణికులేసుమా. అదియునుఁగాక.

* చ. కవి కవితాప్రసక్తియును గాయకుగానము పండితాళి శా
స్త్రవివిధచర్చ శిల్పికళ రత్నపరీక్ష యనేకయంత్రతం
త్రవిధులు వేఁట నేర్పును తురంగగతి ద్విపఖేలనంబులున్
భువినలరారెడున్ దునివిభుండు కనుంగొనినన్ దలోదరీ.

* మఱియు,

*క. తేనియఁ గ్రోలఁగఁ దేటులు
నూనములన్ మూఁగురీతి సుమహితబుధులెం
దైనఁ గవీంద్రకవిత్వా
నూనామృతమానఁగోరు చుందురు కాదే.

*ఇంతకును నీ కట్టిసందియం బేలకలుగవలయును?

*ఉ. చేరి సశోణకాచమున జీవనజాప్తునిరశ్మి దాన శో
భారమణీయతన్ వివిధవర్ణములం బ్రభవించుకైవడిన్
భూరిసుధీమయూఖ మిలఁ బూర్ణవికాసఁ గవీంద్రసత్సహా
ప్రారముఁ జొచ్చినన్ బలుతెఱంగులరంగులఁ బ్రజ్వలింపదే.

* నటి—నాథా! ఈదృశరూపక ప్రదర్శనంబుచే నెట్టివారలనైన రంజింపవచ్చును గాని వాచక రౌచిక వివేకప్రముఖ సనాతనాధునాతనగీర్వాణాంధ్రకవిశిరోమణుల కవితామృతంబునఁ గడుపారఁ ద్రావియున్న సకలకళాకోవిదుండగు నీ మహారాజు నలరించు టెంతయు నసాధ్యంబుకదా. ఏమన,

* చ. తొగదొరచల్వఁ బేర్కొనిన తోరపుమంచుఁ గరంగఁ జేయఁగా
నగురవికి న్మినుంగురుల కౌనె సనాతనసత్కవీంద్రవా
గ్విగళితమామరందమునఁ బేర్కొనియున్న జగత్పతీంద్రునిన్
జగమున నెంచిచూడ మన శక్యమె రంజిలఁ జేయ నాయకా.

సూత్ర—ప్రియురాలా! నీవు ముద్దరాలవగుటచే నట్లు భయంపడుచుంటివే కాని,

చ. శుకపిక శారికానికరసూక్తులనన్ గడుముద్దుమాటలన్
బ్రకటరసప్రకీర్ణమృదుపల్లవకోమలశైలి నొప్పు నా
టకమునుఁ జూచి సభ్యులిచట న్మది రంజిలి మెచ్చకుందురే
వికచపయోరుహానన! వివేకులు సత్కృతిపద్మభృంగముల్.

* ఇదియునుఁ గాక,

గీ. ఎన్నిసారులు తెగుచున్న నీప్సితార్థి
యైనసాలీడు తనతంతు లలయ కలమి
మరల నేయుచుఁ దనకోర్కె నెఱపుఁ గాన
కృషివినా కార్యములను సాగింప వశమె?

†కావున మనకీర్తికోలందిఁ బ్రయత్నింతుముగాక.

* నటి—ప్రాణేశ్వరా! సర్వజ్ఞులగు మీకు నేఁ జెప్పెడుపాటిదానను కాను. మన మెంత నాటకప్రదర్శన కలావిదగ్ధులమైనను.

మ. లలితస్ఫారకలాకలాపయుతలీలాలోలుఁడై మించి రం
జిలుచున్ జారులఁ జోరుల న్విమతులన్ శిక్షించి యే యీతిబా
ధలు లేకుండఁగ రాజ్యమేలు బుధమందారుం డన న్సంతతం
బిల సింహాద్రిజగత్పతీంద్రమహారాజెన్నంగసామాన్యుఁడే.

* అట్టి నిరుపమానకలాపరిపూర్ణుండు నసదృశశౌర్యధైర్యగాంభీర్యసాహసోదారభుజబలప్రతాపధౌరేయుండు సుగుణరత్నాకరుండు సాధుజనసంరక్షణాయమానభుజపంజరుండు విశేషించి సదాచారసంపన్నుండు నగు నీ ధర్మప్రభుచెంగట మనము కృతార్థులమైనంగదా మన మనోరథంబులు సిద్ధించుట.

సూత్ర-ప్రియా! *ఎల్లవారల మనోరథంబులను సిద్ధింపఁజేయఁగృష్ణుఁడులేఁడా? అయినను.

గీ. కంటకవికీర్ణదుర్గమకాననాంత
రమునఁ బొదరింటితరుపుష్పరసముఁ గోలఁ
దివిరిమధుపంబు దానిఁ బొందెడువిధంబు
పూన్కిచేఁ గష్టతరకార్యములుఫలించు.

ఇంక నతివిస్తరమేల? కర్తవ్యమాచరింపఁ ద్వరపడవలయును.

నటి—నాథా! ముందుగ నేఁ జేయవలసినకార్య మెద్దియో నియోగింపుఁడు.

సూత్ర—ప్రేయసీ! మనము ప్రదర్శించునది శృంగారరసప్రధాననాటకంబు కావునఁ దద్రసపోషకంబును సకలభువనమనోల్లాసకరంబు నగు వసంతఋతువును నవ్యక్తమధురంబగు నీ కంఠమంజులనాదంబు తేటఁబడ గానానందరసంబు వెల్లిఁగొల్పుచు వర్ణించి యీ సభ్యులవీనులకు విం దొనరింపుము.

నటి—చిత్తము ఆలాగే చేసెదను.

హిందూస్తానీతోడి రాగము-చాపుతాళము.

ఈ వసంతకాలమహిమ యెంతవింతయౌఁగదా
భావమలర జీవకోటి పరమసుఖముఁ జెందఁగా॥ ఈ॥

కోయిల లుకుజాంతరములఁ గూయు మెక్కి చివురులన్
నూయురే యభిసారికాళి మానముల్గలంచుచున్ ॥ ఈ॥
చిలుకలు కలభాషణముల చెట్లపై నెసంగఁగాఁ
జలువ తెమ్మెరలను పుష్ప సౌరభంబు లోలయఁగా॥ ఈ॥
పాయకా ప్రసూనపాళి బంభరాళిపాటలన్
హాయి వత్సవాయిజగప తీయుదీర్ణుఁడలరఁగా॥ ... ఈ॥

మఱియు,

మ. తతసమ్మోదకరప్రభావతి వసంతశ్రీ యనంగన్ బిక
ప్రతతు ల్బాలరసాలపల్లవములన్ భక్షింపుచున్ బంచమ
స్థితి గానంబులు సల్పుచుండ నళిరాజిన్ గీరపాళిన్ సుమ
ద్యుతిఁ బ్రద్యుమ్నకుమారుఁడు న్వేడలు బాంథుర్మోహమున్ జెందఁగన్.

సూత్ర—ఓహో! ప్రియురాలా! తావకీనమనోహరగానకలాపాభివర్ణనముచే నీ వసంతాగమనం బినుమడుంగలఁ బ్రమదావహంబై యొప్పుచున్నయది. చూడుము.

చ. అలలుచలింపఁ బయ్యెరల నల్లకొలంకులనూఁగుహంస లా
దళితసరోజగర్భబిసతంతులలాగువిధంబు మానసం
బులగ్రహించి సభ్యుల వి మోహితచిత్తులఁ జేయ వారుమా
ర్మెలఁగక సుప్రసన్నులయి తెప్పలువాల్చక చూచుచుండరే.

* [అంత నేపథ్యంబున వైతాళికుఁడు.]

*మ. అలర న్బద్దపురిన్ దివి న్బరగణాలష్టాదశంబు న్మహో
జ్వలపూర్వాశజగత్పతీంద్రుఁ డుదితోత్సాహంబునన్ స్వచ్ఛకీ
ర్తులఁ బాలింపఁగఁ గోరి శౌరికృప సంతోషింపఁగా వచ్చు ని
శ్చలచిత్తుండయి ద్వారకాపురి కభీష్టప్రాప్తియా వానికిన్.

నటి—(ఆలకించి) ప్రాణేశ్వరా! అదిగో నాటకపాత్రములు రంగస్థలమునకు వచ్చుచున్నవి కాఁబోలు. మనమింక పోవుదము రండు.

సూత్ర—మంచిది. ప్రియా! రమ్ము.

(అని యిరువురు నిష్క్రమించుచున్నారు.)

ఇది ప్రస్తావన.

శ్రీరస్తు.

హయగ్రీవాయ నమః.

ప్రభావతీప్రద్యుమ్నము.

ప్రథమాంకము.

రంగము ద్వారకాపురపరిసరము.

[దేవేంద్రుఁడు మాతలిసహితుండై ధరాతలంబున కవతరించుచున్నాఁడు.]

మాత—(విమానమునుండి క్రిందకుడిగి) దేవా!

మత్తకోకిల

ఓపురందర! కంటిరే మనముర్విఁ జేరితిమింక నా
పాపకర్ముఁడు వజ్రనాభుని బారి మీరఁగఁగల్గెఁగా

ఇంద్రు—(తానుగూడ క్రిందకుడిగి)

ఏపుమీరిన దైత్యవల్లభుఁ డీల్గకుండఁగ నక్కటా!
ఈపరాభవదావవహ్ని సహింపశక్యమె మాతలీ.

(అని నిట్టూర్పువిడిచి తనలో) అన్నా! ఏమి యా దైత్యాధమునియాటోపము!

చ. విపులచమూసమేతుఁ డుగ్రవిక్రముఁ డా రజనీచరుండు పి
ట్టపిడుగులాగు పైఁబడి హతాత్ముఁగ స్వర్గమునాక్రమించి వే
లుపుగమిఁ దోలి నందనములోని సమస్తము మంటఁగల్పి గ
ద్దెపయిని గూరుచున్ననను దిబ్బున నేలఁబడంగఁద్రోసెఁగా.

ఈ పరాజయపరాభవదావానలంబు చల్లారు టెట్లు? కైలాసవాసుండగు నీశ్వరు నాశ్రయించినను కార్యంబు లేకపోయె. భగవతియగు పార్వతీదేవి యేవిధంబుచేనైన నా నక్తంచరునిఁ గీటడంచుటకుం దగినయుపాయంబు నాలోచించెదనని చెప్పుటచే నా మనంబున కొక్కింతయూరట కలిగినది. కాని యీశ్వరవరప్రసాదంబుచేఁ బెచ్చుపెరిగి యున్న యా ఘోరరాక్షసుని నిర్జింప నామెకు సాధ్యమగునో కాదో. నా కింక భగవం-

తుండగు శ్రీకృష్ణుఁడే శరణంబు! (ప్రకాశముగా) మాతలీ! మనము ద్వారకాపట్టణమును సమీపించితిమా?

మాత — దేవా! అదిగో చూడుఁడు.

లయగ్రాహి. అల్లదియె స్వర్గపురి నుల్లసములాడుచు న
టల్లహరిసంస్కృతిని నెల్లపుడుఁ బ్రాకా
రోల్లసితహర్మ్యములఁ గొల్లలగు ఘోటకము
తల్లుల మదావళుల నల్లలితనానా
వల్లి లవలీకుటజమొల్లముల మల్లియల
నుల్లమునఁ గౌతుకము వెల్లిగొలుపన్ రం
జిల్లు నదె ద్వారవతి ఫుల్లసరసీజనవ
హల్లకజలాశయము లెల్లెడలఁ గ్రాలన్.

ఇంద్రు — ఓహో! ఏమి యీపురలక్ష్మీవైభవము.

చ. విలసిలువజ్రదీధితులు వేవెలుఁగన్నినుఁ ద్రావాయు గోపురా
వళిఁ జెలువారుసౌధములు వన్నెసిడంబులు మౌక్తికాళిచే
నలరెడురంగవల్లికలు హారిహిరణ్మయకుట్టిమంబులున్
లలిరతనాలతోరణములిలం గనుపండువుఁగొల్పెడు న్బలే.

శ్రీమహాలక్ష్మీసహితుండగు శ్రీకృష్ణభగవానులు నివసించియుండుపురవరంబున కిట్టి మహావైభవము కలుగు టబ్బురమా. మాతలీ! లీలాలోలుండగు నా మహామహుండు నా కెట్లు దర్శనీయుండగునోకదా.

చ. సలలితమంజువాక్యములజాంబవతిం గరగించుచుండునో
యలరునొ సత్యభామగృహమందు నవీనవిలాస సన్మృదూ
క్తుల నల రుక్మిణీరమణితోఁడను బాచికలాడునేమొ దీ
నుల మొరలాలకింపుచు నసూనకృపామతిఁ దానపోయెనో.

మాత — (ఇటునటుఁజూచి హర్షముతో) దేవా! మీ కడపటియభిప్రాయమే సరియైనది. చూడుఁడు.

మ. సిరితోఁ బాచికలాడుచున్ గరిమొరల్చింతించిరక్షింప నా
తురుఁడై యేగిన దీనబంధుఁడు జగత్పూజ్యుండు నా ద్రౌపదీ

వరదుండున్ హరి వేణుగానరతుఁ డబ్జాక్షుండు కంసారి శౌ
రి రమామానసలోలుఁ డివ్యేడకు శ్రీకృష్ణుం డదే వచ్చెడున్.

ఇంద్రుఁడు.—(సహర్షంబుగ) ఓహో! ఆర్తజనశరణ్యుండగు శ్రీకృష్ణుండే నా భాగ్యవశంబున నిటు దయచేయుచుండె. ఏమి నాయదృష్టము! నే నింక చరితార్థుండ నయ్యెదను.

[అంత శ్రీకృష్ణుండు ప్రవేశింప నెదురుగఁజని కృతాంజలియై] లీలామానుషవిగ్రహుండవగు నో భగవానుఁడా! శ్రీకృష్ణా!

చ. శరణు కృపావిశాల! వర శార్ఙ్గగదాధర! నందనందనా!
శరణు మహీధరోద్ధరణ! సారసలోచన! కంసమర్దనా!
శరణు మురాసురాంతక! వ్రజస్ఫుటఖేలన! భక్తపాలనా!
శరణు రమామనోహరణ! సాకు నను న్శరణంబ వై హరీ.

శ్రీకృ.—(అచ్చెరుపాటునభినయించుచు) ఏమీ! సకలలోకజగజ్జేగీయమానసుధర్మాసనాధిష్ఠితత్రివిష్టపాధినాధుండే మనుష్యమాత్రుండనగు నన్నుశరణువేడవలసివచ్చెనా!

ఇంద్రుఁ.—దీనావనబిరుదాంకితుండవగు నోముకుందా! నాకాధిపత్యంబుకన్న దుఃఖభాజనంబగు దుస్థితి యొం డెద్దియైనం గలదే?

సీ. వృత్రాసురునిసంహారింపంగఁ బెక్కేండ్లు
తామరతూఁడులో దాఁగవలసె
తారకాసురునిచేఁ దరుమంగబడి షణ్ము
ఖోదయంబునుగోరి యుండవలసె
హేమకశిపుచేత నెన్నిసారులో చావుఁ
దొలఁగింప మూలల దూర వలసె
బలిదైత్యుచే నోడి పదవిని విడనాడి
పరులపంచలఁ జేరి బ్రతుక వలసె
గీ. రావణాసురుఁ డన నహోరాత్రములును
కరికి స్వప్నంబునందు సింగంబు దోఁచు
పగిది నడలంగవలసె నీ వజ్రనాభు
చేత నేఁ డివ్విధంబునఁ జేరవలసె.

శ్రీకృ.—(వెఱగునభినయించుచు) ఆఁ! వజ్రనాభుం డెవఁడు? వానిచే నీ కేమి యుపద్రవంబు సంభవించె ?

ఇంద్రు.—దానవాంతకా! సర్వజ్ఞుండవగు నీ వెఱుఁగరాని దీ రేడుజగంబుల నెందైనం గలుగ నేర్చునే? అయిన విన్నవించెద నవధరింపుఁడు. వజ్రనాభుం డను ఘోరనక్తంచరుం డీశ్వరునిఁగూర్చి యనేకసహస్రవర్షంబు లతినిష్ఠురతపం బొనరించి వరంబులు వడసి తద్వరప్రభావంబుచేఁ గ్రిందుమీఁదుఁగానక దేవతావళి బాధించుచుండుటయేఁగాక నన్ను నిర్జించి స్వర్గపురం బాక్రమించె. ఏ మని విన్నవింతును, వాని బారినుండి విడివడి వచ్చుటయే దుర్ఘటంబయ్యె.

శ్రీకృ.—(నివ్వెఱగందుచు) ఏ మేమీ!

చ. అమలతపఃప్రభావయుతు లౌ ఋషులందఱుఁ దన్నుఁ గొల్వ గో
త్రముల నడంచు వజ్రముఁ గరంబునఁ దాల్చి సుధర్మ నేలుచున్
బ్రమదముమీఱ వైభవపరంపరల న్విలసిల్లు శక్రుఁ డా
లమునఁ బరాజితుండయి పలాయితుఁ డయ్యెనె యొక్క దైత్యుచేన్.

మాత.—కంసమర్దనా! మున్ను వివిధావతారంబుల ననేకసార్లు రక్షోవీరుల సంహరించి త్రివిష్టపంబు నిలఁబెట్టితి వీవ కావె.

ఉ. రాముఁడవై రణస్థలిని రావణునిం దెగటార్చితీవు స్వ
ర్భూమిజయింప హేమకశిపు న్నరసింహుఁడవై వధింపవే
వామనమూర్తివై బలి నవారణలీల నడంచి తీవు సు
త్రామశరణ్య! నీ వెటు దురంబునఁ గూల్చెదో వజ్రనాభునిన్.

శ్రీకృ.—నగభేదీ! ఆరాత్రించరుం డిపు డెచ్చోట నున్నవాఁడు?

ఇంద్రు.—మేరుపర్వతంబునకు దక్షిణభాగంబున వజ్రపురం బను నొకపురంబును నిర్మించుకొని యున్నవాఁడు.

శ్రీకృ.—పాపము. స్వర్గమంతయు భీభత్సము చేసెఁగాఁబోలు.

ఇంద్రు.—చక్రహస్త! ఆ దోషాచరుం డొక్కమ్మడి సైన్యసమేతుండై స్వర్గపురంబుపైఁ బడి;

చ. నలినదళాక్ష! నందనవనంబునఁ గల్పమహీరుహంబుశా
ఖల వెసఁ ద్రుళ్చి హంసబకక్రౌంచము లెల్లఁ జెలంగునట్టియా

కొలఁకులనన్నిటింగలఁచికర్బూరవిచేష్టత నప్సరోంగనా
వలిఁజెరఁబట్టి వేల్పుగమిబంధనఁజేసి సుధర్మఁగైకొనెన్.

నే నచ్చోనిలువ నిరవుఁ గానక నిటువచ్చి,

చ. నిను శరణంబువేడితిని నీటనుముంచెదొ పాలముంచెదో
దనుజులనెల్లఁద్రుంచుటకు దాల్చినీవు దశావతారముల్
మునుత్రిదివంబుఁగాచితివి పూనిక నేడిటు వజ్రనాభునిన్
దునిమి నిలింపుల న్నను వినోదముల న్విలసిల్లఁజేసెదో.

శ్రీకృ.—బలశాసన ! ఈశ్వరకటాక్షంబుచే వజ్రనాభుఁడు గాంచినవరములెవ్వి?

ఇంద్రు.—ముకుందా ! వినుము.

మ. వరముల్గాంచె నతండు వజ్రపురి దేవవ్రాతముల్ మానవుల్
చొరఁగాశక్యముగాక యుండఁ బురి నేశూరుండునుం సాహస
స్ఫురణన్ జొచ్చిన నాక్షణంబతఁడు నచ్చోఁజావఁగా నాత్మదు
స్తరఖడ్గంబునఁగాక యొండువిధిఁ దాఁజావొందకుండన్ గటా.

అట్టివాని నిర్జించుటకుం దగినసాధనంబు నాలోజించి నన్ను రక్షింపవలెను.

శ్రీకృ.—శతక్రతు ! పూజ్యులైన మా తండ్రిగారు రాకక్రతు వొనరింప సంకల్పించి యుండుటచే నే తత్కార్యనిర్వాహణార్థమై పనితొందరలో మునింగి యుంటిని. వజ్రనాభు నోర్చుటకు వెరవు సావకాశంబుగ నాలోజించెదను. నీ విప్పటికి వీడ్కొనుము. నే పనివినియెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు)

ఇంద్రు.—మాతలీ! నా డెందంబునంగల కొందలంబు డిందునెడదయ్యె. కట్టా!

ఉ. ఊరట కల్గదయ్యె జలజోదరుఁ డాగతిఁ బల్కియుంటఁ బొం
గారుపరాభవానలము కాల్చుచునుండెమనం బదెట్లు చ
ల్లారునొ వజ్రనాభుని ముకుందాంతకుఁడేక్రియ సంహరించునో
తీరనికష్ట మెప్పటికిఁ దీరునొ హా ! విధి యెట్టులుండెనో.

మాత.—మహేంద్రా! ఏల దైన్యము నొందెదరు?

ఉ. పాడియె యీపరాభవము బాయుదొకో విపరీతకాలమం

దోడిననేమి శౌరికృపకోయుండిన నోడలుబండ్లవచ్చు బం
డ్లోడలవచ్చుగాన సమయోచితభంగిని ధైర్యసారమున్
వీడకసంచరింపఁ దటికో విక్రమలీల జయింపనౌ రిపున్.

(అంత తెరలో) హా! హా! రక్షింపుఁడు. రక్షింపుఁడు.

ఇంద్రు.—(ఆలకించి) మాతలీ! ఈచెంత నొకకాంతామణియార్తాలాపంబు వినవచ్చు చున్నయది. నీవు పోయి కారణ మరసిరమ్ము.

మాత.—చిత్తము.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

[అంత శుచిముఖి ప్రవేశించి]

శుచి.—(ఇంద్రునిఁజూచి) జే పురందరమహారాజా! (అని నమస్కరించిలేచి యంజలిఘటియించి)

చ. జయజయ వజ్రపాణి! బలశాసన! రమ్యత్రివిష్టపాధిపా!
జయజయ గోత్రభంజన! లసన్మణిభూషణ! సత్యభాషణా!
జయజయ వృత్రవైరి! జలజప్రతిమాన సహస్రలోచనా!
జయజయ యోశచీరమణ! సర్వసుపర్వవినోదభాజనా!

ఇంద్రు.—కాంతామణీ! నీవెవ్వతెవు? ఏమికతంబున నీ విట్లేకతంబ చనుదెంచు చుంటివి?

శుచి.—నాకాధిపా! దేవరవారినందనవనంబునం గల మానససరోవరమందు విహరించెడు రాజహంసలలో నే నొకదానను. కామరూపసంచారిణినగుటచే నే నిట్లు స్త్రీరూపంబున నంచరింపుచుంటిని. మఱియు,

ఉ. నాకపురీశ!నందనవనంబున రాజిలు మానసైక సీ
రాకరవీచికాంతరవిహారములన్న లినీబిసంబులన్
గైకొనిమెక్కుహంసలను కట్టిడిదైత్యుఁడు వజ్రనాభుఁ డ
ట్లాకులమందఁజేయ నిటులయ్యెను మాబ్రతుకేమిచెప్పుదున్.

ఇంద్రు.—అన్నా! పాపము.బ్రహ్మలోకంబున నలువరాణిమన్ననలఁ జెన్నుమీరి త్రిదివంబున కేతెంచి నందనవనంబునంగల సురుచిరకల్హారరేజమ్మృణాళనాళక బళగ్రాసాసక్తంబులై యుత్తుంగతరంగంబుల దంపతీయుక్తంబుగఁ దూఁగుటుయ్యేలల నూఁగుచుఁ గలరుతంబుల నలరు కలహంసనికురుంబమ్ముల కెట్టి దుస్థితి

సంప్రాప్తంబయ్యె. కాలవైపరీత్యంబున కేమనవచ్చు. బాలామణీ! నీ వేయభిధానంబుచే స్త్రీరూపంబునఁ బ్రవర్తిల్లుచుంటివి? నీ యాగమనం బపేక్షించు ప్రదేశ మెద్ది?

శుచి.—దేవతాచక్రవర్తి! నే శుచిముఖియనం బరగుచుందు. మేరుసానూపకంఠంబున వజ్రనాభునిచే నిర్మింపఁబడిన వజ్రపురంబునుండి ద్వారకాపురంబులోని కేగుచుంటిని.

ఇంద్రు.—(నివ్వెఱగందుచు) ఏమేమీ! ఆవజ్రపురంబు దేవతలకు మానవులకు దుర్గమంబని వింటిమే. నీ వెట్లు చొరఁగల్గితివి?

శుచి.—దేవేంద్రా! ఆ రజనీచరుండు త్రిదివంబున నిజభటభృత్యామాత్యవర్గపరివృతుండై పేరోలగంబుండఁ గామరూపిణి నగుటచే నే నొక యెలపాయంపు జవ్వనినై మోహనాకారంబున వానియెదుటకుం జని;

సీ. కనుబొమ లెగుచుచుꠋ నునుబల్కులను బైఁట
కొంగును సవరించిꠋ కొంత సేపు
జిలిబిలిముద్దుపాటల నోరచూపులఁ
గుతుకంబుఁ గలిగించిꠋ కొంత సేపు
ననవి ల్తుకందుకంబన నృత్యములు సల్పి
కోరికలూరించిꠋ కొంత సేపు
చిఱునగవ్రులయంగꠋ సఱమోడ్చి నేత్రముల్
కంతురంతులుజూపిꠋ కొంత సేపు

గీ. సమ్ముదమునింపఁ దనయెడల్ꠋ జల్లుమనఁగ
మయి గగుర్పాటుఁజెంద సామాన్యబుద్ధి
నన్ను చేసన్న దఱిఁజీరిꠋ సన్నుతించి
తనపురికివచ్చి యలరింపుꠋ మనుచు బలికె.

ఇట్లావజ్రనాభునియనుమతి వడసియే వజ్రపురి కేగితిని. దేవా! ఆజ్ఞ యెట్టిదియో సెలవిందు.

ఇంద్రు.—మేలు, కాంతామణి! మేలు. బహుచక్కని యుపాయ మాలోచించితివి.

మ. మును క్షీరాబ్ధిని ద్రచ్చి కొన్నయమృతంబుꠋ బ్రావఁగాఁగోరు నా
దనుజానీకముఁ గన్నుగప్పి సురలꠋ దన్వైన్యహావిష్ణు వ

ల్లన దివ్యాద్భుతమోహనాంగియయి బాలా! నీవు నాలాగు నీ
దనుజు న్మోహనిమగ్నుఁ జేసితివి వింతతో నీ చరిత్రం బహో.

నీవంటి జాణల నే నెన్నండును విని కని యెఱుంగను. శుచిముఖీ! ఇంక నీ మూ
లమున నే దేవతల మనోరథంబు సిద్ధింపవలయు.

శుచి.—దేవరయాజ్ఞ శిరసా వహించెదను.

ఇంద్రు.—లలనామణీ! నీవు వజ్రపురంబున కేగి యా యుగ్రదానవు నలరించితివా?

శుచి.—సురేంద్రా! నే నా వజ్రనాభుని సభాస్థానంబున కేగి బహువిధంబులగు లాస్య
గానాభినయంబుల నా దైత్యనాథు నలరించి వానిచే ననేకసత్కృతుల నందితిని.

ఇంద్రు.—నిన్నా రజనీచరుండు వేల్పుమిన్నయని నన్నచూపు చూచెనా లేక సముచిత
మర్యాదల బహుమానించెనా?

శుచి.—దేవా! అరక్కసుల ఱేఁడు వేల్పులసూఁడయ్యు నన్ననేకవిధంబుల బహూకా
రించుటయేఁ గాక నా కలావైశారద్యంబుల కలరి నిజకుమారీమణియగు ప్రభావతీ
కన్యకకు నాడిగంపుచేడియగ నియమించి యంతిపురంబున కనిపె.

ఇంద్రు.—(సహర్షంబుగ) ఏమేమీ! వాని యంతిపురంబులోనికిఁ గూడ నీకు ప్రవేశము
కలిగెనుగా? అక్కడివిశేషము లెట్టివియో యెఱింగింపుము.

శుచి.—సహస్రాక్షా! ఆ శుద్ధాంత వైభవ మిట్టిదని కొనియాడ నలవికాదు. వినుండదు,

చ. విమలమణిప్రభాంచితనవీనవితానము వజ్రపఙ్క్తి ది
గ్భ్రమగలిగింపుచున్నది ధగద్ధగితంబుగఁ గ్రాలు నిల్వుటె
ద్దములు పటంబులంతట ముదంబుఘటింప సఖీద్వితీయయా
రమణిఁ బ్రభావతిన్ దనుజరాజసుతన్ గను గొంటినచ్చటన్.

అప్పు డాతన్వంగి,

చ. తనకుడిచెక్కుటద్దమున దక్షిణపాణిసరోజ మాని జ
వ్వనియొకచిత్రపుంబటము వామకరాబ్జమునందు నిల్పి వా
ల్కనులనుమెచ్చి నెచ్చెలిఁ బ్రకంపితమూ బొమవింటఁజూచి మో
మున దరహాసముప్పతిలఁ బొల్పుచునుండె నోయూరమొప్పఁగన్.

ఇంద్రు.—ఆచిత్రపటముయొక్క వృత్తాంత మేమైన నీ వెఱింగితివా?

శుచి.—దేవా! ప్రభావతి మొగంబునఁ జిఱునగవు మొలకలెత్త నా చిత్రపటంబును
గూర్చి నెచ్చెలియతో ముచ్చటించిన విషయం బొక్కింత వింటిని.

ఇంద్రు.—ఏమని?

శుచి.—అనవలామిన్న చిత్రపటంబు చెలికత్తియకుఁ జూపుచు,

"ఉ. హాళినిఁ గేళికావనమునందు జరింపుచుఁ బుష్పమంచమున్
వ్రాలినతుమ్మెదన్ గని విరాళిని జెందితి నెందుచేతనో
'లోలవిశాలనేత్ర! కలలో నితఁడే యగు నీకు భర్త శో
భాలలితుం' డటంచును భవాని యొసంగిన చిత్రమెంచుచున్.

చ. విలసితరాగసంపద నవీనముగా వికసించుపుష్పమున్
దెలిసి ప్రియంబున న్నాదమతేఁటి మరందముఁ గ్రోల వ్రాలినన్
లలితప్రసూనకాంతు సఫలత్వముఁ జెందెడు నట్టిభాగ్య మి
చ్చలుగననట్టిజన్మ మొకజన్మమె కర్మముగాక నెచ్చెలీ."

అని కాంక్షదోఁపఁ బలుకసాగెను.

ఇంద్రు.—(తనలో) భగవతియగు పార్వతీదేవి తనవాగ్దానము నెఱపుచుండెను కాఁ
బోలు.

శుచి.—దేవా! అట్లు నెచ్చెలియతో ముచ్చటించుచు దీనవదనయైన ప్రభావతీహృదయం
బు తెఱం గెఱుంగ నే నిట్లంటి.

ఇంద్రు.—ఎట్లు?

శుచి.—దేవా! వినుండు. నే నాసుదతీమణి చెంతకుం జని చిత్రపటం బవలోకించి.

"చ. కులుకుహొరంగుమైజిగియుఁ గోకనదంబులఁ గేరు నేత్రముల్
నెలతెలిడాలుఁ బోలుఁ లవలీదరహాసముఖంబు నద్దపుం
బలకలజగ్గునిగ్గులన భాసిలు చెక్కులు సోగముక్కు ను
జ్జ్వలతరదీర్ఘబాహులు విశాలపువక్షము సింహమధ్యమున్
గలుగుప్రసన్నమూర్తి రతికాంతుఁ డితం డతఁడే విచిత్రమా."

అని యాసఁగొలుప వచించితిని.

ఇంద్రు.—అందుపై యా దనుజరాజతనూజ యే మనియె?

శుచి.—దేవా వినుండు నే నాలాగని యచ్చెర వొందుచుండ ప్రభావతి సంభ్రమంబు
న దిగ్గున లేచి నన్నుఁ గౌఁగిలించుకొని లోనివలపు రెట్టింపఁ దన యంతరంగంబు
నఁ బ్రభవిల్లిన యమందానందవాహినీలహరులు పై కుబుకుచుండెనో యనఁ బుల
కితంబగు నెమ్మేన లేజెమ్మటలు గ్రమ్మఁ బద్మదళంబులు ముత్యములు ప్రసవించు

చుండెనో యన విశాలనేత్రంబులనుండి యానందబాష్పబిందువులు దొరుఁగ నక్ష త్రరాజినా విరాజిల్లు రదనాంశుకచ్ఛవి బాలచంద్రికారుచిఁ బరిహసింప మంద స్మితసుందరవదనారవిందయై ప్రక్కకంటిచూపుల సుప్రసన్నతఁదోఁప "ప్రాణసఖీ! ఈ చిత్రపటంబున లిఖింపఁబడిన మోహనాకారుని నీ వెచ్చోట గంటివే?" అని యడిగెను.

ఇంద్రు—అందుకు నీ వేమంటివి?

శుచి.—పిమ్మట నే నొక్కింత యాలోచించి "నే మరలఁజూచివచ్చినంగాని నా మనో గతం బెఱింగింప" నని చెప్పి తదనుమతివడసి నే నిచ్చోటికి వచ్చితిని.

ఇంద్రు—నీ వాచిత్రపటాంతర్గతాకారంబున కనురూపంబైన రూపం బెచ్చోటనైనఁ గనియుంటివా?

శుచి.—దేవా! ఈద్వారకాపురవరంబున శ్రీకృష్ణకుమారుం డగుప్రద్యుమ్నుం డొక్కింత యా చిత్రప్రతిమంబునుఁ బోలియున్నట్లుఁ దోఁచెడు. అయిన నే నిశ్చయముగఁ జెప్పఁజాలను.

ఇంద్రు—(తనలో) శుచిముఖి యుదంతంబును బట్టి చూడఁగాఁ బ్రభావతికిఁ జిత్రపటాం తర్గతుం డగుపురుషవతంసునిపై మోహము మిక్కుటముగఁ గలిగియుండుట నిశ్చ యము. ఆ చిత్రలిఖితపురుషుండు శ్రీకృష్ణకుమారుండగుప్రద్యుమ్నుండే యగుట నిక్కువం బయ్యెనేని మన్మనోరథసిద్ధి సుకరంబగు ఎట్లనఁ గాత్యాయనీప్రభా వంబుచే,

మ. సతినిర్మితుఁడై భర్తయంచుమది నెంచన్ గోర్కెఁదీర్పన్ బ్రభా
వతిఁ బ్రద్యుమ్నుఁడు చిత్రలీలలను జేపట్టంగఁ దా విన్నచో
దితిజాధీశుఁడు వజ్రనాభుఁ డెద నుద్దీపింపఁ గోపంబు దు
ర్మతియైచచ్చు నిజాసిచే నతని జంపంబూని ఘోరాజిలోన్.

ఇంతకును భగవత్సంకల్ప మెట్లున్నదో తెలియరాదు. (ప్రకాశముగా) శుచి ముఖీ! నీ యభిప్రాయము సరియైనదే కావచ్చును. అయిన నింకొకసారి నీ పు రంబులోనికిం జని ప్రద్యుమ్నకుమారుని బాగుగవీక్షించి యాతండే యా కన్ని యకు దేవీనిర్మితుండైనవరుండని నీకు రూఢిగాఁ దోఁచినపక్షమందు నీవు సర్వ విధములచేతను వా ఏఘూవరులకుఁ బరస్పరసంఘటనం బొనర్పఁ బ్రయత్నింప వలయును.

శుచి.—(తనలో) మృగయాప్రసక్తిఁ బ్రద్యుమ్నకుమారుం డనుజాలతో నీ పరిసరారణ్యంబునకు వచ్చునని వినియుంటిని. ఈ దేవతానేతయగు పురందరుం గని యొంటిఁగ సంభాషింప ననువగుటకై యొక వ్యాజంబుఁ గల్పించి మాతలిని నిష్క్రమింపఁజేసితిని. అతం డింకను మరలి రాఁడయ్యె. కారణ మేమొకదా. (ప్రకాశముఁగా) దేవా! దేవరయాజ్ఞ శిరసా వహించెదను.

ఇంద్రు.—ఇది మన కెంతయు నవశ్యకర్తవ్యంబు సుమీ. ఈవిషయంబున నీ నైపుణ్యమంతయు వినియోగపరిచి నా మనోరథంబు సఫలంబుఁ జేయవలయును. పిమ్మట నీకు మేలుకలుగును. (అని యిటునటుఁ జూచి) అదిగో! నా రథసారథి యగు మాతలి తిరుగవచ్చుచుండె. నీవు నీ పనిమీదనే యుండుము. నే నేగెదను. (అని దేవేంద్రుఁడు నిష్క్రమించుచున్నాఁడు.)

శుచి.—(స్వగతము) స్వర్గాధినాథుండగు శక్రుండు దుర్ఘటంబగు కార్యంబు నిర్వహింపుమని నా కాజ్ఞనొసంగె. నే నందుకు వల్లెయని,

క. తలనిడి సాధ్యాసాధ్యం
బులనెంచకఁ బూనుకొంటిఁ బోలునె నగమున్
దోలఁగింపఁ దగరునకు నె
వ్వాలనగుఁ బ్రద్యుమ్నునకుఁ బ్రభావతిఁ గూర్పన్.

ఆకన్నియ రాక్షసరాజతనూజ. ప్రద్యుమ్నుఁడు రాక్షసాంతకుండగు కంసాంతకునికుమారుఁడు. ఇట్టి దారుణశాత్రవాపత్యంబులకు దాంపత్యంబు సమకూర్చుట యెట్లు? మఱియు,

చ. అసురవిభుం డొకండు నసురాంతకుఁ డొక్కఁడు వారు వీరు సం
తసమున వియ్యమంది సతతంబును నెయ్య మెలర్పఁ గూడుటల్
భసలకులంబుఁ జంపకకులంబును వియ్యము లందుటే కదా
అసదృశమైనయీఘటన కేమదిర! యేక్రియ నిర్వహింతునో.

ఇదియునుగాక వజ్రపురంబు లాతులకుఁ జొర నశక్యంబు. ఎట్లోగదా (అని కొంచెమాలోచించి) అయిన నే తద్విషయమై సర్వవిధముల చేతను బ్రయత్నించెదను. పిమ్మట కార్యంబు సఫలంబుఁ గాకపోయినను, "యత్నే కృతే యది న సిధ్యతి కోఽత్ర దోషః" అని పెద్దలు చెప్పుదురు. కావున నాయందు దోషముండదు. నే నిప్పుడు ప్రద్యుమ్ను నిరీక్షించి వాని హృదయంబుఁ బ్రభావతిపైఁ దగులునట్లు చే

యఁ బ్రయత్నింపవలయును. ఆతం డిపు డెచ్చోటనుండునో కదా. (అని నల
లంకులఁ జూచి సంతోషముతో) వహ్వా! అదిగో,

చ. తురగఖురప్రహారముల౯ ధూళి సముద్ధతి రోదసీదరం
బురుగతిఁ గ్రమ్మ వల్గితము౯ఖోచితధారల వేఁటలాడ నీ
సరసకుఁ దమ్ములైన గద౯సాంబులు తన్గొలువ౯ ప్రభావతీ
వరుఁడదె కాననంబునకు౯ వచ్చుచునుండెఁ గృతార్థనయ్యెదన్.

నే నిపుడే మాయాకురంగరూపమును ధరించి మృగయావిహారలోలుండగు ప్రద్యుమ్నకుమారుని గహనాంతరంబునఁ బథభ్రష్టునిఁ గావించి యొంటిపాట కల్పించి వానితో మదీయవ్యవసాయనంబు తెఱం గెఱింగించెదను.

(అని నిష్క్రమించుచున్నది.)

గద్య.

ఇది శ్రీమద్వేంకటరమణకరుణాకటాక్షవీక్షణాసారసమాసాదిత రస
బంధురకవిత్వవైఖరీప్రవీణాపస్తంబసూత్ర శాండిల్యసగోత్రప
విత్ర హోతృకులకలశార్ణవరాకాకైరవమిత్ర వేంకటరత్నను
పుత్ర వేంకమాంబాగర్భశుక్తిముక్తాఫల వివిధవిద్వజ్జన
విధేయ వేంకటకృష్ణనామధేయప్రణీతంబైన ప్ర
భావతీప్రద్యుమ్నంబను నాటకరాజంబున

ప్రథమాంకము.

శ్రీరస్తు

ప్రభావతీప్రద్యుమ్నము

ద్వితీయాంకము.

రంగము:—ద్వారకానగర పరిసరారణ్యము.

[సహోదరులైన గదసాంబులతోఁ బ్రద్యుమ్నుండశ్వారూఢుండై ప్రవేశించుచున్నాఁడు]

ప్రద్యు—సోదరులారా! మృగయావిహారంబు సలుప నీమహోగ్రకాంతారం బతికాంతంబై యొప్పుచున్నయది. చూడుఁడు.

తురగవల్గనరగడ.

ఉరుములురుము కరణిపులుల । మ్రోండ్రగింపు లిందెసంగ
కరులఘీంకృతులును హరుల । గర్జనధ్వనుల్ చెలంగ
తురఁగములు చెలంగి హేష । తుములమున నటింపఁగలయ
గురుతరకిటిసంచయముల । ఘుర్ఘురనినదంబులొలయ.
గదు—ఇరులసరణి భల్లుకంబు । లెల్లయెడల సంచరింపఁ
దరులనీడ దుప్పిగములు । దవిలి బడలికన్ హరింప
సాంబు—కస్సుమనుచు ఖడ్గమృగము । గండుమిగిలి తోడువడల
బుస్సుమనుచుఁ బడగలెత్తి । భుజగముల్మెలంగఁబొదల
ప్రద్యు—కసవుమెసవునోటనుండి । గడ్డిపరకలూడుచుండ
కసిమసంగి పఱచు లేఁడి । గములు వెన్కఁ జూడకుండ
గదు—పలలముఁదినుచున్నహార । వముల నెసఁగ జంబుకములు
చిలుకలునుజశాఖలందుఁ । జేయఁగిలకిలార్భటములు.
సాంబు—కొలఁకులనగములలతాని । కుంజములఁదనర్చువినుము
వెలయుకాననమున నిపుడు । వేఁటలాడవలయు మనము.

(అని విజృంభించుచున్నారు)

ప్రద్యు—తమ్ములారా! ఈ గహనాంతరం బెంత మనోహరంబుగానున్నది! బళీ!!

సీ. మత్తదంతావళీ మస్తమస్తిష్కవి
  హారసంచార కంఠీరవములు
 ప్రకటదిగ్భ్రమమహా చక్రితైణతతివధో
  ద్యోగసంభరిత శార్దూలచయము
 మహితోగ్రఖేలన మత్కూటమమికవ
  ల్మీకంబులగు యుభల్లూకవితతి
 బధిరీకృతశ్రవఃపటలవిదారణ
  దారుణఘూక ఝిల్లీరవంబు

గీ. భీకరాభోగభోగదర్వీకరములు
 చుంబితనభోంతరాళవృక్షంబు లలర
 భానుకరదుర్గమంబయి పరిఢవిల్లు
 కాననం బిందు వేటాడు కలిమికలిగె.

గదు.—ఓహో! ఈమహోగ్రకాంతారంబున,

బంధురవృత్తము.

గురుతరవనమిది గుహాలవెడలునా ఘోరమదద్విప కోటి నహా!
తరిమెదుమారులను దఱుచుపులుల మొత్తముల జింకలతండములన్
బోరిఁబోరిఁబఱచు ఏకపులకిటులను దుష్టమరీమృగపుంజములన్
దురగమునిలుపుముతోడిగిశరముప్రద్యుమ్న సహోదర! త్రుంతుమిటన్.

సాంబు—అన్నలారా!

పంచచామరము.

 హాళాహాళింగడంగి భీకరార్భటుల్ ప్రచండ కా
 హాళధ్వను ల్నభంబు భూ మహాద్రిగహ్వరాంతరం
 బులంబ్రతిధ్వనుల్చెలంగ భూరిసత్వజాతులన్
 భళాభళీయనంగఁద్రుంచి ప్రాభవంబుఁజూపెదన్.

ప్రద్యు—తమ్ములారా!

మ. ఇదె మీరిచ్చటఁ జూచుచుండుఁడల మత్తేభేంద్రయూథంబులన్
 దుదముట్టించెద భూరిసింహములఁ ద్రుంతున్ ఖడ్గ శార్దూల దు

ర్మదభల్లూకములన్వధింతు మహితారణ్యంబునన్ శౌర్యసం
పదవెంపారఁగఁ గ్రూరసత్త్వములఁ దీవ్రస్ఫూర్తి వేఁటాడెదన్.

(అని నల్దెసల బాణంబులం బఱపి) బలె! తమ్ములారా! చూడుఁడు.

ఉ. అల్లదె సింహ మొక్కనిశితాంబకసంహతిఁ గూలె దుష్టులన్
భల్లుకము ల్వడిన్ గలయఁ బాఱెడుభీతిని నాదు తీవ్రపుం
భల్లములంటఁ దాఁక శరభంబులు వ్యాఘ్రము లంతమొందెడున్
డొల్లెడు నేదుపందులు పరుల్ హరిణంబులు చూడుమెల్లెడన్.

సాంబు—అన్నలారా! వేఁటతమకంబుచే నైమఱచి శరీరక్లేశంబు గమనింపకయ నిరర్గళ భుజార్గళవిజృంభణం బతిశయిల్ల నుపవనవిహారంబులీల నీ భయదకాంతారంబునఁ గ్రుమ్మరుచుండుటచే నతిశ్రాంతులమైతిమి. కావున మన మించుకవడి నీ వటవిటపిపటలావృతబాలతృణాంకురశీతలప్రదేశంబున విశ్రమింతుమురండు.

ప్రద్యు.—తమ్ముఁడా! నా చేచాయను జూడుము. అదిగో! ఆజింక నాహృదయమును తద్దయు నాకర్షించుచున్నయది. కావున,

చ. చెవులను నిక్కబెట్టుచును చేతికిఁజిక్కక చంగుచంగునన్
వివిధగతుల్ జరించుచును భీతినిఁజూచుచు నల్వలంకులన్
దవుదవు దాటుచుండు హరిణంబును డగ్గరి నాదుబాణలా
ఘవపటిమంబుఁ దేటఁబడఁ గా నొకవ్రేల్మిడిఁ గూల్చివచ్చెదన్.

(అని యాహరిణంబువెంటఁ బరుగిడుచున్నాఁడు.)

గదు—(సాంబునితో) తమ్ముఁడా!

కవిరాజవిరాజితము.

హరిణముఁగంటె మహాద్భుతలీల శితాశుగసంహతి కందక సో
దరునలయించుచుఁ దవ్వుల కెగుచుఁ దాఁగుఁడుమూతవిధంబుఁదనున్
దరిసిన దాటుచుఁ దాఁగుచునుండెను దానివధింపఁగఁ దత్పరుఁడై
యరుగఁదొడంగెఁగదా మనయన్న నహా కలియున్ జన నౌమనకున్.

సాంబు—అన్నయ్యా! మన యన్నగారీఘోరారణ్యమధ్యంబునఁ బథభ్రష్టులైనచో వారికి మార్గప్రదర్శకు లెవరు? మనము ముఖ్యముగఁ బోవుదమురండు.

(అంత తెరలో.)

హా! హా! రక్షింపుఁడు. అకటా! ఈ మోహనాంగుండు దక్షిణాశ కేలవచ్చెనో కదా.

గదు — (వెలుగుదోఁప సాంబునితో) తమ్ముఁడా! ఈ తట్టునుండి యొకయార్తాలాపము వినవచ్చుచున్నయది. వింటివే?

సాంబు — (దీనవదనుఁడై) విన్నా నన్నయ్యా. ఆమోహనాంగుండు మనయన్నగారే యై యుండరుకదా.

(మరల తెరలో) హా! హా! ఏమి యీవైపరీత్యము.

మ. కలలోఁ గన్నులఁ గట్టినట్లయి మతిన్ధ్యానంగ రూపుండు ను
జ్జ్వలభాగ్యోన్నతి వ్రాలెఁ జిత్రగతిఁ దోఁపన్ ధ్యానరూపుండుటన్
గలఁతం జెంది తపించి వ్రాలఁ దుదకుం గాంతుం దరిం జేరి భ్రాం
తుల నా భీతవిలోలలోచనకుఁ బ్రద్యుమ్నుండు చిక్కెన్ గదా.

గదు. — (భయము నభినయించుచు సాశంకముగా) ఏమేమీ! నిజప్రతాపప్రభాపటల పరంతపుండు నసదృశధనుర్విద్యావిశారదుండు నిరుపమాన శౌర్య ధైర్య గాంభీర్యబాహువిక్రమసాహసోదారుండు నగు మా యన్నగారొక్క సురంగ శాబకంబున కెట్లు చిక్కె? అయినఁ గాలవైపరీత్య మెట్టిదియో సంగతిఁ గనుంగొన దక్షిణాశ కరుగుటయే శ్రేయంబు. తమ్ముఁడా! పోవుదము రమ్ము.

(అని యిరువురు నిష్క్రమించుచున్నారు.)

[అంత శుచిముఖి ప్రవేశించి]

శుచి. — (స్వగతము) ఓహో! నే లేడిరూపమును ధరించుటచే నాప్రయత్న మింతవరకుఁ గొనసాగినదికదా. ఈ ఘోరారణ్యంబునఁ బ్రద్యుమ్నకుమారుం డుత్తరదిశ ననతిదూరంబున నుండ వార్తాలాపకైతవంబున గదసాంబులను దక్షిణాశ కనిపితిని. ఇంక నే నొంటిపాటుగ నాయుద్యమం బాపురుషవతంసునకు నివేదింప ననువగు. ఆహాహా! ఏమివాని మోహనాకారము.

క. అలచిత్రఫలకమందున
నెలమిఁ గొలుపు మోహనాంగుఁ డితఁడే యగు ము
ద్దుల మూట గట్టినట్టుల
లలి విలసిల్లెడు సమానలక్షణములతోన్.

బాపురే!

క. మనసిజుఁడో చిత్రపటంబునఁ గలలక్షణముఁ బుణికిపుచ్చుకొని యెవ్వో
యనదివ్యమోహనాకృతిఁ గనుపండువు సేయుచుండెఁ గానితఁడహహా.

ఇట్టి సుందరాకారునిఁ జూచి యేకాంత మోహింపదు. ఆ చిత్రపటాంతర్గతుం
డగు పురుషరత్నం బీప్రద్యుమ్నకుమారుండే యనుటకు సందేహ మిసుమంతయును
లేదు. (అని యిటునటుఁ జూచి) అదిగో! ఆతండును మరలివచ్చుచున్నాఁడు. నే
నదృశ్యరూపంబును గైకొని వానికి సమయోచితంబుగఁ బ్రత్యక్షమయ్యెదను. (అ
ని తిరస్కరిణీముద్రను ధరియించుచున్నది).

[అంత ప్రద్యుమ్నుండు తిరుగఁ బ్రవేశించి]

ప్రద్యు.—(స్వగతము) అహ్హా! నే నెంతగుఱీఁగాఁ దఱిమిన నా హరిణంబును మరణం
బు నొందింపఁ జాలనైతిని. ఏమి దానిపలాయనప్రభావము! పురబాహ్యమరుప్ర
దేశంబుల నాకస్మికంబుగఁ బ్రజ్వలించు కొఱవిదయ్యంబులకైవడి భూరిమారుత
ఘూర్ణితంబగు రంధ్రాన్వితపాత్రంబులోని దీపకళికకాన్పించుకరణి నామాయా
కురంగము నాకు దృశ్యాదృశ్యంబుగఁ గాన్పించుచు గతాగతవిలాస విభ్రమం
బుల నడియాసఁ గొలుపుచు నలయించి నన్ను భ్రమింపఁజేసియుఁ జివరకుఁ గ
న్మొఱంగె. ఏమి చెపుమా! నా దక్షిణనేత్రం బదరుచున్నయది. నానావిధవృ
క్షలతానికుంజనీరంధ్రంబగు ఘోరకాంతారంబున దట్టంపు టిరులమధ్యఁ జంద్రో
దయంబునాఁ గొదమతుమ్మెదలబారుఁ గేరుచు నల్లగిల్లాడు శిరోజంబు లాపా
దమస్తకంబుగఁ బ్రేలనొకచంచలాక్షి రాజాననంబు దృగ్గోచరంబైనట్లుదోఁచె. కాని,

ఉ. కాటుక కప్పుచందమునఁ గ్రమ్మినసాంద్ర ఘనాఘనమ్ములన్
దీటుగ వెల్గు నా మెఱుపుతీవయనంగఁ దమిస్రపుంజమున్
దూటొనరింపఁ బొల్చెడుమిటారినుంగురునా వనవాటిఁ [illegible]కిన్
ప్రేటుగఁ దేజరిల్లియు మిఱింగిన మోహనరూపమే మొకో.

ఏమి నా మతిచాంచల్యము! నే నాదినే యొకహరిణాక్షిం జూచి హరిణంబని యను
కొంటినో లేక హరిణంబునే జూచి హరిణాక్షియనియే భ్రమించితినో తెలియ
రాదు. ఎట్లైననేమి? నిరర్థకప్రయత్నుండనై తిరుగవచ్చితినిగదా. ఇట్టి పరాభవ
మునుఁ బొంది నాతమ్ముల మొగము నే నెట్లుచూడఁగలుగుదును.

శుచి.—(అదృశ్యతఁ బ్రద్యుమ్నునకు వినంబడఁ బ్రకాశముగా).

మ. భ్రమఁ గొల్పన్ మదిలోనఁ జిత్రగతిఁ జేరంరామిక్రుమారుండవై
తమి వెంపొంద శిలీముఖంబులను గుంఠదం జేయఁగాఁ దూఁలె ధ
ర్మముఁ బూనందగు నావిలోలనయనన్ రంజిల్లెదా నీదు దై
న్యముఁ బ్రద్యుమ్న కుమార! చేకొనఁగ నీకిలా నీకు నిప్పట్టునన్.

ప్రద్యు.—(విని వెఱఁగందుచు) ఏమియీయాయద్భుతము! నాకిట్లదృశ్యరూపంబునఁ గర్ణరసాయనం బొనరించినవా రెవ్వరోకదా. ఆ కంఠకలనాదంబు విన నొకయెలనాఁగ యిం దెచ్చటనో కన్మొఱంగి యట్లు వచించెనని తోఁచుచున్నయది. కాని నాయందుఁ గ్రూరత్వ మారోపించి "ధర్మముఁబూనందగు" ననుటచే వ్యంగ్యాభిప్రాయంబు స్ఫురించుచున్నయది. అయిన నాచతురిక యెవ్వరో తెలిసికొనియెదను.

చ. నెలఁత! యదృశ్యరూపమున నీ విటు రాఁ గతమేమి? వచ్చి నా
తలఁపు నెఱింగి "లేఁడిఁగొను ధర్మముఁబూను" మటంచుఁ బల్కు తా
పలుకులభావ మేమి? తెలుపఁగనుపింపుము నీవు దేవతా
లలనవొ కృత్రిమంపు నబలామణివో వచియింపుమింపుగన్.

శుచి —(మరల ప్రద్యుమ్నునకు వినంబడ నదృశ్యంబుగా).

మ. అలప్రద్యుమ్న కరాంబకాహతులచే నత్యంతముం దూలుచుం
జలితస్వాంతముతోఁడ దిగ్భ్రమల నానాస్థలం బొందుచుం
బలిమిం బట్టఁదలంచు వానికిఁ దుదిం బ్రాప్తించు నాకోర్కెను
త్కలికం దీర్పఁగ నీకు గడ్డిఁ గఱవంగా నయ్యెనే యేణమా.

కురంగమా! నీ వింకభయపడవలసిన యవసరము లేదు. వినుము.

చ. శరములదాఁకి కోడి విలసన్నవకుంజములందు దూరి వెం
దరువులనీడసోలి మదిఁ దన్మయతన్గొన నేలప్రాలి యా
యువలను చిక్కనేల మృగి యుండు దయామయుఁ డింక నిల్వుమా
మరలకు మాతఁడీతఁడె సుమా చకితైణమ భ్రాంతిపీడుమా.

ప్రద్యు—(ఆశ్చర్యమభినయించుచు) ఏమి యీయాయద్భుతము! ఆ కురంగ మెంత వెదకిన నెచ్చోటను గానరాదు. ఈవిధంబుగ నా మృగమును సంబోధించి పల్కువా రెవ్వరోకదా. ఈ మాయాంగన పలుకులు భావగర్భితములై యనుమానముం గలిగించుచున్నవి. "ఆతఁడీతఁడెసుమా" అనుటచే భావార్థము వెల్లడిగాకున్నయది. ఒకవేళ చకితైణసాదృశ్యంబుచే నన్ను వలచి తపించుచుండు నొకయెల జవ్వని విరహావస్థ నిట్లు వ్యంగ్యముగాఁ దెల్పుచుండెను కాఁబోలు. అయిన నీలేమయభిప్రాయం బెఱుంగ మరల నిట్లనియెదను. ఓయదృశ్యకాంతామణీ!.

చ. అడవి మదీయబాణహతి కందక యేణము కన్గొనంగ "ని
య్యెడ నిశితాశుగంబులకు నెంతయు నోడి తపించి తూలుచున్
బడలికవాయ సోమ్మసిలి పచ్చికనేలఁ బరుండెఁ జేతిలోఁ
బడునిఁక నా కురంగ" మనిపల్కెదు నీదగు నవమే మొకో.

మఱియు,

మ. మృగతృష్ణాంబులఁగోరు పాంథునిక్రియ న్మిథ్యామనోభ్రాంతిచే
నగడొందన్ హరిణంబు చిక్కెనని మాయాలాపము ల్పల్కుచుం
డఁగ నేలా? కనిపించిచెప్పు మది యేణంబో లేక యేణాక్షియో
మగువా! దాని గ్రహింప నెట్లగునో ప్రేమ న్నన్ను రంజింపుమీ.

శుచి.—(మరల నదృశ్యంబుగఁ బ్రద్యుమ్ను నకు వినంబడఁ బ్రకాశముగా).

చ. ఇనసమ తేజ! వజ్రపురికేగిన నందు మృణాళపద్మముల్
దనరుటఁ జంద్రుతో ముకుళితంబులుగా విను వానిమాటునన్
గను మొఱఁగెన్ కురంగ మటఁ గన్గొననోఁ దడవేల నీవు వే
జని ముకుళీకృతాబ్జశశిసంగతిఁ బాపి గ్రహింపు మేణమున్.

ప్రద్యు.—(ఆశ్చర్యముతో) ఏమిది! ఈ మాయాంగనపలుకు లంతకంతకు మఱియుం భావగర్భితము లగుచున్నవి. చంద్రసంయోగంబుచే మృణాళపద్మంబులు ముకుళించె ననుటవలన మృణాలసదృశంబులగు భుజంబులను మోడ్చి నిరుపమానలావణ్యప్రభాభాసితంబగు రాకాపూర్ణచంద్రాననంబున నిద్దంపుచెక్కులఁ గరతలంబులఁ జేర్చియుండుట స్ఫురింపఁజేసి వజ్రపురమందలి కొండొకమోహనాంగి విరహపరితాపంబును నర్మగర్భంబుగ సూచింపుచున్నది. ఆసుందరాంగి యెవ్వరోకదా.

ఉ. జీవనజాక్షి! నన్నుఁ బెనుచీకటి ఘోరవనాంతరంబునన్
ద్రోవఁదొలంగుపాంథువలెఁ దూలఁగఁ జేసెదె? భావగర్భితం
బౌవిధిఁబల్కెదేల? తెలుపంగదె యేలలితాంగిపంపునన్
నీవిటువచ్చినావు రనుణీమణి నేనటుఁ జూడ నేర్తునో.

శుచి.—(మరల నటులనే యదృశ్యంబుగ) ఓ మోహనాకారా! వజ్రపురంబున.

చ. వలపులదొంతి మేలిజిగి పైడిహారంగులపూలబంతి పూ
విలుతునిచేకటారిమొన వేదురి కుంది కృశించి యాపురిన్

బొలుచుప్రభావతీతిలకముం గని నీ వహహా ప్రమోదర
జ్జులఁ దగుల న్వలింబడఁగఁ జూతువె చేకొనకుండ దానినిన్.

కావున,

చ. సరసకుఁ జేరరాగ నిను సమ్మతిఁ గోరెడు దాని నేడు నీ
శరములబారిఁ జిక్కి వివశత్వముఁ జెందినదాని నీదు స
త్కరుణఁ జెలంగుదానిఁ గరకంజమునన్బడనున్నదాని స
త్వరముగ సద్గుణప్రథిత ధర్మనిరూఢి గ్రహింపరాదొకో.

ప్రద్యు.—(సహర్షంబుగఁ) ఏమి! ఈమాయాంగన నన్ను "మోహనాకారా" యని సంబోధించుచున్నది. తాను వజ్రపురమందలి కొండొకవిలాసినీమణిపంపున దూతికగా వచ్చెనట. వజ్రపురనివాసిని చూడకయే నన్నెట్లువరించు? ఇది కడునాశ్చర్యముగ నున్నయది. ఆతరుణీమణిసోయగ మెట్టిదియోఁ దెలుపకయే నన్ను రమ్మనుచున్నది. ఇది యేమిమాయయో, తెలియరాకున్నది. అన్నా! ఏమిఁక. నా హృదయం బనురాగసదనం బగుచున్నయది. అయిన మరలఁ నిట్లనియెదను. (ప్రకాశముగా) ఓమాయలాడి!

ఉ. దూతికవయ్యుఁ గన్నొఱఁగి తొయ్యలిరూపవిశేషమేమొ యే
రీతిని నన్నెటన్నని వరించెనొ చెప్పక నామనంబు ని
ర్భీతిఁ గలంచెదేల? పృథివిన్ జెలి యంతమనోహరాంగియే!
లాతులు లేరె యాచెలివిలాసము మించిన మోహినీమణుల్.

శుచి.—(మరల నదేప్రకారము ప్రద్యుమ్నునకు వినంబడ ప్రకాశముఁగా) ప్రద్యుమ్నకుమారా!

మ. చనునే లాతుల నెన్న షోడశకలాస్ఫారుండునై క్రాలు చం
ద్రునితో సాటియొకో మినుంగురులు నే రూపించి వర్ణింప నెం
తని యీచిత్రపటంబుఁ గైకొనుము స్థూలారుంధతీన్యాయరీ
తినిఁ గన్గొందగు నందొకింత తరుణీదివ్యస్వరూపోన్నతుల్.

(అని ప్రభావతిచిత్రపటంబుఁ బ్రద్యుమ్నునియొద్దఁ బడవేయుచున్నది.)

ప్రద్యు.—(చిత్రపటం బెత్తిచూచి హర్షపరవశుండై) ఓహో! ఏమి యీసౌందర్యము!

సీ. లేతవెన్నెలగాయు శీతాంశురుచి కాని
మొలకనవ్వులముద్దు మొగము కాదు

నిలుకడఁజెందుచంచలవికాసము కాని
మెయిఁదీవ బంగరుమిసిమి కాదు
అళివికీర్ణములైన దళితాబ్జములు కాని
యాయతంబగు కన్నుదోయి కాదు
లావణ్యసరసి కల్హారసమితి కాని
రమణీయకరచరణములు కావు
గీ. దొండపండు గాని తొగరువాతెఱ కాదు
కంబుకలిమిగాని గళము కాదు
చిత్రమిదియు జీవచిత్తరు వెట్టిదో
చూచుటెట్లొ నాదుచూడ్కు లలర.

ఓదూతికాతిలకమా !

మ. సకియా ! నా మృగయావినోదసమరోత్సాహంబు తన్వంగిఁ గో
రికదా వేడుకఁజెంది చిత్రపురణోర్వి న్సర్వగా నియ్యెడన్
ప్రకటానూనవిమోహశృంఖలములన్ బంధించితో యేగతిన్
వికచాబ్జాక్షి జయింప వజ్రపురికిన్ వేవేగఁ బోనేర్తునో.

అకటా ! ఏమిది !

శా. ధాటిం గంబళిపుర్వు పెద్దదయి లూతాతంతులం జిక్కి యా
రాటం బొందుచు నాకు చిల్కయయి పర్వంజూడమే యట్లు యి
చ్చోటన్ జిత్రవిలోకనంబు లను రజ్జుశ్రేణిచేఁ జిక్కి చే
డ్పాటుంజెందుచు మాఱితిన్ భ్రమరకీటన్యాయరీతిన్ సఖీ.

శుచి:—(తనలో) వహ్వా! ఈతండు ప్రభావతీచిత్తరువును జూచి హర్షించి యా లేపుపై మరులుగొని మోహాక్రాంతుండై యున్నవాఁడు. వీనిమనంబుఁ దన్మయంబుఁగాఁ జేయ నిదియే మంచిసమయము. ఏమన.

ఉ. పాదునఁ బాతి గింజమొలువం జలపోషణవృద్ధిఁజేసి స
మ్మోదమెలర్పఁబుష్పఫలభూతినిఁ జెందమె వీనిఁజెందవుం
బాదున మోహబీజ మిటు పైదలిచిత్తరుకివి మొల్చె నే
సాదరలీల దానిఫలసంపద నెచ్చెలి కింపుఁగొల్పెదన్.

(అని ప్రత్యక్షంబుగ నెదుటనిలువంబడి ప్రకాశముగా) శ్రీకృష్ణాత్మజా! వేఁట తమకంబుచే బడలికఁ జెందియుంటివి కాఁబోలు. హరిణంబుచిక్కెనా ?

ప్రద్యు.—కాంతామణీ! నీవెవ్వతెవు? ఏమికతంబున నీ విశ్లేకతంబ చనుదెంచుచుంటివి?

నాతోఁ బరోక్షంబుగ నదృశ్యవై నర్మగర్భంబుఁగ మాట్లాడినది నీవేనా ?

శుచి.—అవును. నేనే. నావృత్తాంత మొక్కింత దెల్పెద వినుము.

గీ. నందనవనంబులోని మానససరస్సు
నందు విహరించుకలహంసబృందమునను
శుచిముఖినామమును గల్గి సుదతినగుచుఁ
దిరుగుచుందును సకలదిగ్దేశములును.

నే నుత్తరదిక్తటంబునఁ బరిభ్రమించుచుండ నం దొక్కచో మించుతీవను గేరు నొకచంచలాక్షి చెక్కిట నొక చెయ్యిఁ జేర్చి మందహాససుందరవదనారవిందయై,

చ. కలుముల నీను చిత్రఫలకంబుఁ గరాబ్జమునందు నిల్పి యు
త్కలికను జూచుచుండఁ గని తత్ఫలకంబునఁ గ్రాలునట్టి యా
చెలువముతో సమానమగు చెల్వము నీయెడఁ గానుపింప నే
నలరుచు నీమనం బెఱుఁగనట్లు వచించితిఁ గృష్ణనందనా.

ప్రద్యు.—(తనలో) ఆవాల్గంటి యీ చిత్రపటాంతర్గతయగు మోహినీమణియే గాఁబోలు. (ప్రకాశముగా) దూతికాతిలకమా! ఆ మందయాన యెవ్వతె ?

శుచి.—(నవ్వుచు) శ్రీకృష్ణకుమారా!

చ. అమితనిశాటకంటకమహాటవి నాశ్రయహీనమైన యు
త్తమమగునూత్నవల్లి యు ముదంబునఁ దేనియలానఁ దేఁటితోం
డముస్పృశియించనట్టినునునంబుఁ బికంబు శుకంబుఁ జంచులన్
భ్రమఁగొని మోపనట్టి వరపల్లవముగా ఫల మద్దియేఁజుమీ.

మఱియు,

ఉ. కమ్మనితావిఁ గొల్పెడు చొకాటపుబంగరుబొమ్మలాగు మే
ల్తమ్మికి నుద్దియా కరతలమ్మునఁ జిత్రపటంబమర్చి పొం
కమ్ముగ వాతెఱన్గఱచి కన్నులమెచ్చుచుఁ జూచుచుండు నా
కొమ్మనుగాంచి నేను భ్రమఁ గొంటిని మోహనిమగ్ననాటచేన్.

ప్రద్యు.—శుచిముఖీ! ఆవాల్గంటిసోయగ మెట్టిది?

శుచి.—వసుదేవపౌత్రా! వినుము.

క. నెలయో నెమ్మొగమో వె
న్నెలయో దరహాసరుచియొ నేనెఱుఁగ నహా
లలనామణిఁ గనినంతనె
జిలుఁగుపులకలెసఁగ మేనఁ జేడ్పడితిఁజుమీ.

మఱియు,

చ. అలికులవేణికన్బొమ శరాసనలీలఁగ దృగ్లతావళిన్
విలసిలునారిగా భృకుటి నిల్వడిఁగాఁ గొనిముష్టి నాసికాం
చలమునకల్లలాగి వెలుచం దిలకం బొకముల్కిగాఁగఁ బాం
థులహృదయంబులెల్లపుడుఁ దూలఁగఁజేయు మరుం డుదగ్రుఁడై.

ప్రద్యు.—శుచిముఖీ! ఆ కొమ్మనుజూచి నీ వేమని భ్రమించితివి?

శుచి.—వినుము.

చ. కులుకుమెఱుంగుముత్తియపుకోవలునా నలరారు దంతప
జ్క్తులరుచివిద్రుమోష్ఠములశోభనుగూడుచుఁ దళ్కుగుల్కుచె
క్కులను గులాబివన్నియలుగూర్ప సరోజదళాయతాక్షి పూ
విలుతునిరాణికాఁగఁ బ్రభవించెనటంచు భ్రమించితిన్మదిన్.

ప్రద్యు.—(తనలో) ఓహో! ఏమి యా మోహినీమణిసౌందర్యము! (అని చిత్రపటంబుఁ జూచి) బలె! ఈ నారీశిరోమణి నిశ్చయముగా జగన్మోహినియే. మఱియు,

చ. ఇరులు సరోజముల్ సలలితేక్షువు వెన్నెల చంపకంబు వి
స్ఫురదకళంకమౌక్తికవిభూతియుఁ గైకొని బ్రహ్మ మున్ను మే
ల్తరగతి చంద్రు షోడశకలల్గొని కన్య కురుల్కను ల్బొమల్
తరళితహాసనాసముల దంతముల న్ముఖమున్ సృజించెఁగా.

శుచి.—ప్రద్యుమ్నకుమారా! ఆకన్యామణిసౌందర్య మెంతనికొనియాడుదును. చూచి తీరవలయు నేగాని వర్ణింపనశక్యంబు.

శా. ఔరా యాతలఁ జుట్టివచ్చుకను లాహా యాకుచద్వంద్వ మ
య్యారే యాజిగికెంపుమోవి యరెరే యామందహాసంబు మ

ర్ఘూరే యాఁగళమంగళంబు భళిరే యీ మోహనాకార మెం
దే రామామణియైనఁ గల్గునొకొ యా యేణాక్షితోఁ బోల్పఁగన్.

ప్రద్యు.—ఓహో! శుచిముఖీ! ఆ మోహనాంగిసౌందర్య మంతయొప్పుచుండెనుగా?

శుచి.—సందేహమేమి? మఱియు నా కోమలాంగిసౌందర్యమే బాధనీయమై యామె నెమ్మనమ్మున కూరటఁ గలుగనీయకున్నది. ఏమన,

చ. వదనమునందు వ్రాలు మధుపమ్ములఁ దోలుచు బాహుయుగ్మమున్
గదియుమరాళరాజి నెడఁగా బెదరించుచుఁ గేశపాశమం
దొదవినవేడ్కఁ గూడెడు మయూరములం దఱిమించి మోవి స
మ్మదమునఁ జేరఁగోరు శుకమున్ బికము న్వెడలించుచుండెడున్.

ప్రద్యు.—(తనలో) ఓహో! ఏమి యా తరుణీమణిసోయగము! వర్ణనచేతనే సాత్త్వికభావంబుల మోహపరవశుండ నగుచుంటిని. ఆయన్నులమిన్నను గన్నులారఁ జూచినచో నే నెంతవివశుండ నగుదునో కదా (ప్రకాశముగా) శుచిముఖీ!

ఉ. ఏలొకొ యీవిధంబుగ నహీనవిలాసిని నుగ్గడింపుచున్
జాలము సేయుచుంటివిఁక చాలు స్మరాగ్ని రగిల్చితీవహో
తాలిమిఁ దూలెఁ బెన్వలపుఁ దార్కొనె వజ్రపురంబులోని కే
లీలఁ జొరంగనౌనొ కమలేక్షణ నేక్రియఁ జూచువాఁడనో.

శుచి.—రుక్మిణీతనయా! తహతహఁ జెందకుము. ఆ లేమయభిప్రాయం బెఱుంగకయే విరాళిఁ జెందవచ్చునా? దైత్యాంతకుండవగు నీవు వరప్రభావుఁడైన దైత్యరాజుపురంబులో నెట్లు ప్రవేశించెదవు ?

(అంత తెరలో)

హా! సోదరా! ప్రద్యుమ్న! నీ యనుంగుతమ్ములగు గదసాంబులను మఱచితివా ?

స్రగ్ధర. హా రాజీవాక్ష! నీవాహరిణమునకు! లోనై తివా యన్న! మాకున్
ఘోరారణ్యంబునందున్ గుహలఁ బొదలలోఁ గూలఁ జేకూడెనయ్యో
దూరంబెళ్లగితే యార్తులమయితిమి ప్రద్యుమ్న! నిర్దోషులామ
మ్మేరీతిన్ బాసితే యింక దేవరు శరణ మో యీశ్వరా! యింక మాకున్.

ప్రద్యు.—(విని సంభ్రమించుచు) అయ్యో! నా తమ్ములైన గదసాంబులు నాకై యరయుచుఁ బథభ్రష్టులై పరితపించుచుండిరి కాఁబోలు. ఓ తమ్ములారా! ఇదిగో వచ్చుచుంటిని.

(అని పటాక్షేపంబుఁగ నిష్క్రమించుచున్నాఁడు.)

శుచి.—(స్వగతము) ఇప్పటికి నాప్రయత్నము కొంతవఱకు నెరవేరినదికదా. కొదువ కర్జంబుఁగూడ శీఘ్రకాలములోనే నెరవేరును. ఇప్పుడు ప్రద్యుమ్నకుమారుం డనుజులతోఁ గూడి ద్వారకాపురవరంబున కేగినను చిత్రపటంబు చెంత నున్నంతవఱకు ప్రభావతీకన్యను మఱువఁజాలఁడు. కానిమ్ము. అనంతరకార్యమునకై ప్రయత్నించెదను. ఇప్పుడు దిగ్విజయంబుఁ జేయుఁబూని వజ్రనాభదైత్యుండు యోధవరులతోఁ గొలువుకూటంబుఁ జేరియుండును. కావున నే నిప్పుడు తిరుగ వజ్రపురంబునకే పోయెదను.

(అని నిష్క్రమించుచున్నది.)

గద్య.

ఇది శ్రీమద్వేంకటరమణకరుణాకటాక్షవీక్షణాసారసమాసాదిత రసబం
ధురకవిత్వవైఖరీప్రవీణాపస్తంబసూత్ర శాండిల్యసగోత్రపవిత్ర
హోతృకుల కలశార్ణవరాకాకైరవమిత్ర వేంకటరత్నసు
పుత్ర వేంకమాంబాగర్భశుక్తిముక్తాఫల వివిధ
విద్వజ్జనవిధేయ వేంకటకృష్ణనామధేయ
ప్రణీతంబైన ప్రభావతీప్రద్యు
మ్నంబను నాటకరాజంబున
ద్వితీయాంకము.

శ్రీరస్తు.

హయగ్రీవాయ నమః.

ప్రభావతీప్రద్యుమ్నము.

తృతీయాంకము.

రంగము: వజ్రపురము.

[ఆత్మీయసచివులగు సోమంధస తామ్రాక్ష కఠోరదంష్ట్రిలతో వజ్రనాభుం డోలగమునఁ బ్రవేశించుచున్నాఁడు.]

వజ్ర.—అరే ప్రధానులారా! అరే మంత్రులారా!

మ. ఖలుఁడై యింద్రుఁడు క్రిందుమీఁదెఱుఁగకే గర్వించి నాతోడఁ దో
ర్బలముం జూపఁ గడంగి యాహవమునన్ బాఱె న్సురల్భీతిచే
నిలువన్ లేక మదీయదుర్భరకృధాగ్నిజ్వాలకున్ గాందిశీ
కులుఁగా నద్దెసలం ద్రివిష్టపముఁ గైకొంటిన్ గదా నేర్పునన్.

ఇంక మన మా యమ వరుణ కుబేరుల నిర్జించి వారిగర్వముఁ గూడ నీలాగున నే యడంపఁ బ్రయత్నింపవలయును.

సోమం.—ఆఁ! దేవా! దేవరయాజ్ఞకు వేచియున్నారము. మఱియు,

క. తుంటరితనమున మును ము
క్కంటిత్రిశూలమున గోఁడికాల్గ్యాలఁదిఁ జనెన్
గంటువడియున్నయముఁ డడు
గంటఁడె మిముఁ జూచినంతనే యసురవరేణ్యా.

తామ్రా.—ఆఁ! దేవా! అసదృశనిర్వక్రవిక్రమప్రతాపప్రభాపటలపరంతపులగు తవ కీపాటి స్వల్పకార్యమునకుఁ బ్రయత్నింపవలయునా?

క. అప్పుల నిడఁ జాలుదు నని
గొప్పలుపదివేలు చెప్పికొను వరుణుం డే

చొప్పునఁ గడంగుమీతోఁ
దెప్పరమే వానిఁ గెలువ దితిజాధీశా.

కర్కో.—ఆఁ! దేవా! నవనిధులుఁ గలవనియు శంకరునిసఖుండ ననియు విఱ్ఱవీఁగు నా కుబేరుండు మున్నొక్క మానవునిచే నిర్జింపఁబడిన నిజసహోదరుండగు దశకంఠునితోఁ బోరి యోహటించి తన పుష్పకంబుఁ గోలుపోవుట యెఱుంగరే? ధనమదాంధతచే దుర్గర్వాహతకుండగుటయేఁ గాక యబలుండగు నా గంధర్వరాజును నిర్జించుట మీవంటి వీరాధివీరున కొక లెక్కయే? ఇంతయేల,

క. అక్షీణబాహుదర్పవి
పక్షులశిక్షించు మీప్రభావముఁ గని హా
ర్యక్షముఁ గనుకలభమువలె
యక్షేశుఁడు పరవకున్నె యసురాధ్యక్షా.

వజ్ర.—అరే మంత్రులారా! అఖర్వబాహాపరిస్ఫోటితనిర్వక్రవిక్రమప్రచారుండనగు నాతో నెవ్వరైనఁ బోరి జయింపఁగలుగుదురే? అరే యాప్తులారా!

చ. ఉరుతరఘోరవిక్రమమహోగ్రుఁడనై చెలరేఁగి యిప్పుడే
తిరముగ నాజిబాహువులతీఁట యడంగఁగ నేనజాండమున్
సరసి మదేభలీల రవిచంద్ర ముఖ ద్వివిధ వీతిహోత్ర కి
న్నర సుర సిద్ధ మానవ మృగౌఘముల న్వికలింప నెంచితిన్.

రోమం.—ఆఁ! దేవా! ఏలినవారు మనంబునఁ దలంపుగొని కోపదృష్టితోఁ జూచినమాత్రాన నతల వితల సుతల రసాతల తలాతల మహాతల పాతాళలోకంబులును—భూలోక భువర్లోక సువర్లోక జనోలోక తపోలోక సత్యలోక బ్రహ్మలోకంబులును వానివానియందుగల సమస్తచరాచరజంతువస్తుసంతానంబులతో నిమేషమాత్రంబున భస్మీభూతంబులయ్యెడు. ఇంక తుచ్ఛులగు నీ రవిచంద్రాదులనెంత?

తామ్రా.—ఆఁ! దేవా! దేవరవారి ప్రాభవంబుఁ దలంచిరేని యజమానులైన గడగడవడంకుచుందురు. అట్లగుటచే,

చ. మహితభవద్భుజాహిఁ గని మారుతుఁడేక్రియ సంచరించు స
ప్తహయుఁడు దూపుమాసి పరితాపముఁ బొందఁడె చంద్రుఁ డీల్గఁడే
దహనుఁడు నీటఁగూలఁడె విధాత వడంకఁడె మీపరాక్రమ
స్పృహ సుర సిద్ధ కిన్నరులకే పెరటఁగల్గు నరుండు లెక్కయే?

కఠో—ఆఁ! దేవా! మీ నిరుపమాననిరర్గళభుజార్గళవిజృంభితప్రతాపప్రభాపటలమహోగ్రజ్వాలాభీలంబైన బ్రహ్మాండకటాహంబున,

ఉ. మానిరి జన్నముల్ ఋషులు మానిరి హవ్యములం గొనన్ సురల్
మానిరి తాపసుల్ తపము మానిరి మానులు సద్వ్రతంబులన్
మానిరి హోమధేనువుల మానిత వేదముల న్మహీసురుల్
మానిరి యన్నపానములు మర్త్యు లమర్త్యులు భీతచిత్తులై.

వజ్ర.—అరే కఠోరదంష్ట్రి! అరే తామ్రాక్ష! అరే రోమంధన! దురాత్ముండగు పురందరుండు మున్ను నాచేఁ బరాజితుండై యపగతగర్వుం డగుట యెఱింగియుండియు మదాంధచేతస్కులగు నా యమ వరుణ కుబేరాదులు నన్ను శరణు వేడరైరి. ఆఁ! ఏమి వారిపోతరము! హుం! (అని యాడుఁగఱచి పండ్లు పెటపెటఁ గొఱుకుచు) ఇప్పుడే వారిమదముఁగూడ నదమనముఁ జేయఁ గడంగవలయును. కావున మీ రందఱు యుద్ధసన్నద్ధులరై జైత్రయాత్రకుఁ బయనంబుఁగా మన వీరభటనికాయ్యంబునుఁ గట్టాయితంబుఁ గావించి రండు. నేను సర్వసిద్ధుండనై వచ్చెదను. పొండు.

రోమం—చిత్తము మహారాజా! (అని దైత్యామాత్యులు నిష్క్రమించుచున్నారు.)

వజ్ర—(నల్వలంకులఁ గలయఁజూచి) ఏమిచెపుమా! రాగవల్లరి యీలాగున వచ్చుచున్నది. ఎట్టైన నిది మంచిశకునము. నే నింక తడవుసేయ నేల ?

(అని వజ్రనాభుఁడు నిష్క్రమించుచున్నాఁడు)

[అంత రాగవల్లరి ప్రవేశించి]

రాగ—(తనలో) ఆహా! ఎట్టికాలవైపరీత్యము లొదవుచుండె !

ఉ. పాయదు సౌధతల్పముఁ బ్రభావతి రేఁబవ లట్లు కన్నుల
న్మ్రాయదు స్వప్నము ల్శకునముల్ గ్రహచారము లెల్ల కాకతా
ళీయముగాఁ దటస్థమగు లేమకుఁ బార్వతి స్వప్నమందు "నీ
కీయకళంకమూర్తి యెనుమీ పతి" యంచుఁ బటం బొసంగునే.

అసాధారణంబుగ నొదవు తోఁకచుక్కవలె సంఘటించిన యీ దేపిదత్తచిత్రపటంబువలన రాక్షసకులంబున కుపద్రవమే సంభవించునో శ్రేయముకలుగునో తెలియరాదు. నే నిప్పు డమంగళము లూహింప నేల ? కానున్నది కాకమానదు. ప్రభావతీకన్యయాజ్ఞాప్రకారము శుచిముఖి నారయవచ్చితిని. ఆమె యెచ్చోటను గాన రాదయ్యె.

ఆచిత్రపటాంతర్గతుండగు మోహనాంగునిజాడ లెఱింగి వజ్రపురంబున కేతెంచెనో లేదో. ఏమిచేయుదును. మరల నంతఃపురంబునకేఁ బోయెదను. ఆఁ! ఏమిచెప్పుదు యా కలకలము !

(అంత తెరలో) 7/149

క. లేదే యంతికమున నిది
కాదా మృదుహంసతూలికాతల మిటఁ జం
ద్రోదయమున నలరుచుఁ గన
రాదు ప్రభావతి యెటేగెఁ రయమునఁ గనుఁడీ.

రాగ—(ఆలకించి వెఱఁగందుచు) ఏమిది! చిత్రలిఖితపురుషునిపై మరులుగొని విరహవేదనా దందహ్యమానమానసయై శుద్ధాంతంబునఁ గేళికాతల్పంబుపైనుండు ప్రభావతీకన్య కానరాకుండుట కేమిహేతువొకదా. ఒకవేళ శత్రువులెవ్వరైన నెత్తికొని పోయియుందురా ? అట్లైన జరుగు? మఱియు,

క. ఈ వజ్రపురములోనికి
రా వశమే యజునకైనఁ రా మృతిఁజెందున్
భావింపఁగ నంతఃపుర
మేవిధిఁ బరులకుఁ జొరంగ నిక శక్యంబౌ.

ఆ కన్యామణి శుచిముఖి నారయుటకై తానే బయలు వెడలెను కాఁబోలు.

(మరల తెరలో)

మ. అకళంకాకృతిఁ గేళికావనములో నా చంద్రకాంతోపల
ప్రకటంబౌ మణిమంటపంబుపయి శోభస్ఫూర్తిఁ బున్నాగ చం
పక వల్లీయుత కుంజమధ్యమున నభ్రంబందు విద్యుల్లతో
త్సుకతఁ బొల్చుఁ బ్రభావతీరమణి సంతోషంబు గల్గంగదా.

రాగ—(సహర్షంబుగ) ఇప్పుడు నాప్రాణములు కుదుటఁబడినవి. నే నింక రయంబున నా కనఁబడెడు కేళికోద్యానవనంబున కేగి మాప్రభావతినిఁ గలిసికొనియెదను.

(అని నిష్క్రమించుచున్నది)

ఇది విష్కంభము.

[అంత శృంగారవనంబున లతామంటపంబుపైఁ బ్రభావతి ప్రవేశించి]

ప్రభా—(సుమాళంబున దేవీదత్తంబగు చిత్రపటం బవలోకింపుచు) ఓహో! ఈమోహనాకార మెంతరమణీయముగా నున్నది!

కవిరాజవిరాజితము.

కలకలలాడుమొగంబునుఁగాంచినకన్నులపండువుగా నహహా
యలరువజీరొహిమాంశుఁడొగాకజయాతుఁడొయీతఁడటంచునునే
దలఁచుచునామదిఁదన్మయతన్గొనితాలిమిదూలనదాతమిచేఁ
బలుమరు మారునిబారికిఁజిక్కుచుబాధలకిమ్మెయిఁబాల్పడితిన్.

ఆహాహా! చూచినకొలంది యీ మోహనాంగుని సుస్వరూపము కన్నులకు మిటమిట్లు గొలుపుచున్నయది. బళె!

మత్తకోకిల.

ఈ నిగారపుచెక్కుటద్దము లీ ప్రసన్నముఖంబు నా
జానులంబితబాహుయుగ్మముఁ జక్కనౌ మెలిమీసముల్
మానితంబగు సింగపుంగొదమట్ హసించెడు మధ్యముల్
గాన నిట్టి విలాసలీల జగంబునం దెట గల్గునో.

వహ్వా! దేవీనిర్దిష్టుండైన యీ నవమన్మథుండే నాకుఁ గాంతుండైనచో నాభాగ్య మేమనవచ్చు.

మ. తరుణాబ్జు న్నిరసించునెమ్మొగము ముత్యంపు న్సరాళ్గేరు ప
ల్వరుస ల్పద్మము నేలు కన్గవ విశాలంబౌ నురంబు న్మనో
హరమౌ తీవియుఁ దళ్కుమేల్బసిఁడిచాయన్వొల్చు దేహంబు న
ద్దిర! యీ యుగ్గులుదేరుముంగురులు నుద్దీపించు లోఁగోరికల్.

నావంటి మందభాగ్యురాలి కిట్టిసుందరాంగుండు లభించునా?

సీ. కోరి యీ మన్మథాకారుండు నాచెంత
కరుగుదెంచెడుభాగ్య మబ్బునొక్కొ
నాచెంత కేతెంచి నాయందు దయయుంచి
నన్నుఁగైకొనుకల్మి యున్నదొక్కొ
కైకొని వెల్లుబ్బు కాంక్షలన్నియుఁ దీర్చి

మెలయించువైభవం బెసఁగునొక్కొ
ఎలయించి ప్రేమ నం దిలకించి తమిమీర
ముద్దాడుసిరి నాకుఁ బొసఁగునొక్కొ
గీ. ముద్దుగొని నాదుకురులను దిద్దునొక్కొ
కురులుదిద్దుచు ముచ్చటల్ గొలుపునొక్కొ
కాంతునిం గూడ సౌఖ్యంబు గలుగకున్న
బ్రానుగానని లతమాడ్కిఁ జానఁ బతుకు.

అకటా! ఏమిచేయుదును.

క. జనకుని యాజ్ఞాశృంఖల
వినిబద్ధశుకంబ నగుచు వెతలొందెదు నే
ననయము సుమశరకీలల
నెనసి మడియకుండ నాకు నెటు విభుఁడబ్బున్.

దేవీకీర్తితుండైన యీ మహాపురుషుని ప్రభావ మెట్టిదియో తెలియదు. ఆహా!

మ. అరవిందంబులఁ గేరునేత్రముల రక్తాశోకభూజాంగసుం
దరతన్ జూతనవీనపల్లవసమాకారంబైన కెమ్మోవిఁ గుం
దరదభ్రాజితరాజి నుత్పలవినోదం బందు మందస్మిత
స్ఫురదబ్జాననశోభఁ జిత్త మిటు నన్మూర్ఛిల్లఁ గాఁ జేసెడున్.

ఓభవానీ! నే నా యంతిపురంబున హంసతూలికాతల్పంబుపై శయనించి నిద్రింపుమండ నీ వట్లు నిశ్చైతుకజాయమానకటాక్షవీక్షణంబుల నాకు సాక్షాత్కరించినది నా మేలుకొరకా కీడుకొరకా ?

శా. ఏలాచిత్రపటంబు నా కొసఁగితో "ఈతండె నీకాంతుఁడో
బాలా" యంచును కూర్మిచే నతని నెబ్భంగి న్విలోకింపఁగా
వీలా నా నవమన్మథుం గనఁగ నువ్విళ్ళూరుచుంటిన్ గదా
తాళంజాల విరాళి నావరునిఁ జెంతన్ జేర్పుమీ పార్వతీ.

మ. నను నెక్కించితి వమ్మ చెట్టుపయికిన్ నన్నేలఁ గూల్పంగ ని
చ్చెనఁ దీయంగ మకింపకమ్మ యిటు నాచిత్తం బెలర్పంగ మో
హనమూర్తి న్వరుఁ డంచుఁ దెల్పితివి యేమమ్మా కానరాఁడాతఁ డిం

ANDHRA ... VEMIYA NILAYAM

దునరాజిల్లునో తెల్పుమమ్మ యటుఁ బోకదు న్నాథునిం గూడఁగన్.

అకటా! ఈ చిత్రపటంబున విరాజిల్లు నామనఃకాంతుని మోహనాకారముఁ జూడంజూడ నా యంతరంగంబున నపారపారావారవీచికాపరంపరలవడువునఁ గోర్కె లుప్పతిల్లుచుండె. వాని నెట్లడంపనగు? హా! దేవీ! భవానీ!

హిందూస్థాని తోడిరాగము-అటతాళము.

వసుధావృత్తము.

గిరిజా! సతీ! శాంకరి! పార్వతి! నే
శరణంటిని నన్గరుణింపఁ గదే ॥గిరి॥
జననీ! యిటు లందని మ్రాన్ఫలమున్
గనఁ జేసితి నేమని చెప్పుదునో ॥గిరి॥
తనివొందునె యింకను నావరు నే
గన నీతఁడు నాకమనము న్గానెనో ॥గిరి॥
మరుబారికి నేమరుఁజిక్కితి నీ
విరహాగ్నికి నాకంతరమే నిలువన్. ॥గిరి॥

(అని నిట్టూర్పువిడిచి) అయ్యో! ఏమిచెపుమా! చెలికత్తెయు నింకను రారైరి.

[అంత రాగవల్లరి ప్రవేశించి]

రాగ—(తనలో) నా నెచ్చెలియగు ప్రభావతినిఁ గలిసికొనుటకై యీయారామమంతయు వెదకితిని. ఆ కన్నియ యెచ్చోటను గానరాదయ్యె. ఏమి చేయుదును. (అని నల్వంకులఁ గలయఁజూచి) ఓహో! ఏమి నాభాగ్యము!

చ. వికసితపుష్పగుచ్ఛములకున్ వ్రేలెడు చంపక పారిజాత కిం
శుక సురసాల కేతకి యశోక కుజావృతమౌచు నూత్నవ
ల్లికలలరన్ వితానములకేలిల తెలర్చు నికుంజమందు వే
దికపయి మా ప్రభావతి యదే కనుపండువుఁ గొల్పెడున్ బలే.

అబ్బా! హిమకరుం డుగ్రుండై తనయుష్ణకిరణంబులఁ బాంథజనుల వేఁపఁదొడఁ

గె. ఈ వెన్నెలకాక మానెచ్చెలి యెట్లు సహించునోకదా.

చ. చెలి వరియింప దేవి మును చిత్రపటంబున వ్రాసినట్టి యా
చెలువుని నామెపై నిపుడు చిత్తజుఁ డుగ్రశరాగ్నికీలలన్

జలమునఁ గ్రుమ్మనోయనఁగ స్వాంతమునన్ విరహము ల్తపింపఁగా
నలినరిపుండు తీవ్రకిరణంబులఁ బైఁ బ్రసరింపసాగెఁగా.

నే నిప్పు డచ్చోటికేగి మా ప్రభావతినిఁ గలిసికొనియెదను. (అని పరిక్రమించుచున్నది)

ప్రభా—(తనలో) ఓసమస్తదేవతలారా! నామనోభీష్టంబు నెరవేర్ప మీరైనఁ దోడ్పడుఁడు. మీకు నమస్కరించెదను. (అని యంజలిఘటియించి.)

సీ. కమలబాంధవ! నీదు కరములఁ గొని తెమ్ము, చిత్తజాకారు నా చిత్తచోరు
సౌరభ్యహార! నాదు సరసకు విసరుము, చిత్తజాకారు నా చిత్తచోరు
సాహసోదార వలాహకా! తోడ్తెమ్ము, చిత్తజాకారు నా చిత్తచోరు
భూరిసత్కృప వేల్పులారా తోడ్కొనిరండు, చిత్తజాకారు నా చిత్తచోరు

గీ. భ్రమరశుకపిక శారిక ప్రముఖులార!
మారునిశరాగ్ని కీలల మ్రగ్గుచుంటిఁ
జెలఁగి మీరైన నా చెంతఁ జేర్పరాదె
చిత్తజాకారుఁ డైన నా చిత్తచోరు.

కట్టా! నే నీ మన్మథార్తి నెట్లుసహింపఁగలుగుదును.

చ. కలతజనించె మేనువణఁకందొడఁగెన్ జలిలేక యెండలోఁ
బులకలెసంగెఁ జెమ్మటలపూర్వముగా విరబారు నెల్లెడన్
దలఁపులు హెచ్చె లోన తనుతాపముచే స్మృతితప్పుచుండె ని
ప్పులపయిఁ గూరుచున్నగతిఁ బుష్పొడిసెజ్జయుఁ దోఁచె నక్కటా.

హా భవానీ! (అని మూర్ఛిల్లుచున్నది)

(అంత రాగవల్లరి సమీపించి.)

రాగ—సఖీ! ప్రభావతీ!

చ. పరఁగ నిదేమిచిత్రమొ ప్రభావతి! నీ సఖినైన రాగవ
ల్లరి నిదె వచ్చియుంటిఁ గనులం గనరాదటె పెన్విరాళి మై
మఱచితె యెంత నిన్ను బ్రతిమాలినఁ బల్కవిదేమి పాపమే
కరుణ యొకింత నాపయినిఁ గల్గదె కోపమటే సఖీమణీ.

అన్నా! ఈతరుణీమణి మూర్ఛిల్లియుండెనుకదా. ఏమిచేయుదును.

(అని చెంతఁగూర్చుండి విసరుచున్నది)

ప్రభా—(కన్నులు తెఱచిచూచి) ఓహో వచ్చితివా! నన్నొక్కసారి బిగియఁ గౌఁగలింపు
ము. (అని లేచికూర్చొనుచున్నది.)

రాగ—సఖీ! ఇంతకన్న నాకు సంతోషదాయక మేది కలదు? (అని యట్లుచేసి) ప్రియ
సఖీ! నన్నెవ్వరనిభావించితివి? నీ నెచ్చెలినగు రాగవల్లరినిసుమీ. నీ వెంతప్ర
మాదపుపనిజేసితివి!

మ. చనునే నీవు భయంబు లేకిటుల నిచ్చాలీల నీవివ్వనం
బున వర్తింపఁగ చంబుఁ బల్కులు ముఖంబుం గన్గవం గాంచి మీ
రిన సైరింతువె కేకిసీ పిక చకోరీ షట్పదంబుల్ కటా
ఘనవేణీ! కలవాణి! చంద్రవదనా! కంజాక్షి! నీకేతగున్.

నెచ్చెలీ! నేడు నీకింతచొరవ కలిగినదేమి?

చ. చలువలొసంగు తెమ్మెఱలు సహ్యములంచును గమ్మతావులన్
గొలుపు సుమంబులెల్ల ములుకుల్వలె దోఁచునటంచుఁ దేఁటి పా
టలువిన సూదిపోటులగుటం జెవిఁ దూఁటొనరించు నంచు ని
చ్చలు మును వంతికంబునను శయ్యఁ దొలంగ విశేల వచ్చితే.

ప్రభా—(తనలో) కటకటా! ఈ దుస్తరమదనానలంబు సహించుటెట్లు?

మ. కుదురై నిల్వదు మానసం బురువడిం గోలాహలస్ఫూర్తిఁ బా
యదుగా మన్మథ జృంభణంబు నిక నేరమైనన్ సరే నాకుతీ
రదు చెప్పం జెలితోఁడ సిగ్గు పయికిన్ రానీయదిం కేమి సే
యుదు నే కుత్తుకబంటికాఁగ వలపెట్లోర్తున్గదే పార్వతీ.

రాగ—ప్రియసఖీ! కుసుమసుకుమారివైన నీవీ హిమకరుని యుష్ణకిరణంబుల కెట్లోర్వ
చుంటివే?

సీ. సింగారముం గారు బంగారు రంగారు
తనువల్లి రేయెండఁ దాళఁగలదె
నెలఁబోలు తెలిడాలు కలమేలు జిగినేలు
వదనమీ యెండ కోర్వంగఁగలదె
బిసతంతు పసవింత మిసిమింతఁ గొను బాహు
లతిక లీయెండలోఁ బ్రతుకఁగలవె

ననలూన మనలేని కొనబైన నునుపాద
తలము లీ యెండలో నిలువఁగలవె
గీ. మిలమిలను గ్రాలు కలువ జేకులనుఁబోలు
లీల వాలారు నిడువాలు మీలుకన్ను
లెట్టు లీ యెండఁ జూచి సహింపఁ గలవె
ఎంతపనిఁ జేసితివె సాహసించి యబల.

ప్రభా—చెలీ! రాగవల్లరీ! భవాని కరుణారస పూరితయై నా కొసంగిన యీ చిత్రపటంబును నీవు చూచియే యుంటివిక దా.

గీ. నూదిగంట త్రాయిఁ జూచినంతనె నొక
నున్నయినుము చేరకున్నె దానిఁ
జిత్రపటముఁ జూడఁ జిత్తమీ దేహంబుఁ
బాసిపోయెఁ దత్స్వభావమునను.

రాగ—ప్రియసఖీ! ఏల నీ విట్లు మిథ్యామనోభ్రాంతులం దవిలి వగలపా లయ్యెదవు?

మ. చనునే చిత్రపటంబులోఁ బ్రతిమ నాకన క్కివ్వరింప న్మనుక్
గననైన న్గనలేదు వానినెచటన్నా కెన్నఁ డెవ్వారిచే
విననైన న్వినలేదు వానికథ నుల్లాసంగానేల యో
వనజాక్షీ! మృగతృష్ణ వారిఁ గొనఁగా భావింతువే మోకదా.

ప్రభా—అయ్యో! వెట్టిదానా! అట్లనియెద వేమే?

చ. ఉఱుము ముఱుముగ మేఘుఁగన నుత్సుకత న్నెమళుల్కలాపమున్
విరియఁగఁ జేసి నృత్యములు వేమరుసల్పవె సైకతంబులన్
మురియుచుఁ జిత్రదర్శనవిభూతినిఁ దల్లిఖితప్రపూరుషున్
నరునిఁగఁగోరి వెన్వెలపు పైకొన నుల్లాసులూరు టబ్రమే.

కావున, (అని చిత్రపటంబు రాగవల్లరికిఁ జూపుచు).

క్రౌంచపదవృత్తము.

బాలరో నేనీ వారిజనేత్రున్ వరునిఁగ మనమున వలచితిఁగానన్
జాలిఁదోలంగన్ జాలక యుంటిన్ సకియరో! విభుఁడెటు సరసకున చ్చున్

గోలఁగఁ బత్తు౯ల్గూయుచునుండెన్ ౯గుదుర్గొదవదుములు ౯కులవలెనొంపన్
దాళఁగలేనే౯తామరసాక్షీ! ౯తమినిలుపఁగ నికఁ ౯ దరమనౌనాకున్.

రాగ—చెలీ! మహావైభవసమన్వితురాలవై యుండియు నీ విట్లు విరాళిఁజెందవచ్చునటే!

ప్రభా—ఓసి తెలివితక్కువదానా!

మ. చెలియా! యీ నవమోహనాంగునతనికై ౯చెల్వారుభాగ్యంబు రా
గిల సంప్రాప్తముఁగానిచో ధనదు ని౯క్షేపంబు నా కబ్బినన్
ఫలమే? యామని గుజ్జుమావిపయి ని౯ల్వంగోరుచున్నట్టి కో
యిల బంగారపుపంజరాంతరమునం ౯ దేలీల రంజిల్లునే?

రాగ—సఖీ! ప్రభావతీ! దేవీప్రభావంబుచే నీ కిట్టి దుర్భరమనోజవిరాళి యంకురించెఁ గాఁబోలు. నెచ్చెలీ! విరహిణీజనరిపు సంకీర్ణం బగు నీ యుపవనంబున కేకతంబ నీ వేలవచ్చితివే?

మ. నవలా! యొంటిగఁ గేళికావనములో౯న న్సంచరింపంగ ని
ట్లవునే? చంద్రమయూఖసంహతులకె౯ట్లాసైచెదే యక్కటా!
దవుల న్నన్నిటుఁద్రోయఁజూచితివె పం౯తాన న్మనున్నన్నుఁబా
యవు రా నియ్యెడకు న్భయంబు మది లే౯దా నీకు వాదా చెలి.

ప్రభా—సఖీ! రాగవల్లరి.

ఉ. ఊరకవత్తునొక్కొమృగ౯యుం డెరఁ జూపుచుఁ గన్నొఅంగి కాం
తారమునందుఁ బెన్నెకముఁ ౯ దద్దయుఁగ్రైకొనులాగు మోహనా
కారముఁజూపి నాకెరఁగి ౯కంతుఁడె నామనమన్మృగంబు నీ
తీరున దొంగిలించెఁ బడఁ౯తీ! వినవే యికనేమిసేయుదున్.

రాగ—(నవ్వుచు) చెలీ! నీ వా పూవింటిదొరనే వరించితివా యేమి?

ప్రభా—చెలీ! నా మనోహరుని చిత్రలిఖితమోహనాకారము నీవు చూచియుండియు నట్లడిగెదవేమే? మరల నొకసారి చూడుము. (అని చిత్రపటముఁ జూపుచు).

సీ. తరుణార్కబింబంబుఁ౯బురుడించునెమ్మోము
చక్రస్తనులకు నా౯సక్తిఁగొలుప
జలజదళాయత౯చారునేత్రంబులు
నిలికులవేణుల౯ వలరఁజేయ

చంద్రికారుచిఁ గేరుచుఁ జక్కనిచిఱునవ్వు
ధరఁ జకోరాళులఁ దనుపుచుండ
మృదుపల్లవంబుల మించినయధరంబు
పికవాణులకు నతిప్రియమెలర్ప

గీ. సంబుదముఁబోలు కేశబంధంబు నీల
కంఠకంఠుల రంజింపఁ గడువెలుంగు
మోహనాకృతిముద్దులమూటయనఁగ
మారునకుఁ గాక నితరులకెవ్వారి కబ్బు ?

రాగ—అవునే. ప్రియసఖీ! ఈ మోహనాంగుండు నిశ్చయముగ మన్మథుండే కావల యు. ఏమన.

చ. శివునితపంబు భంగపఱచె న్మను నెట్టిశితాశుగంబులన్
బవరమునందు శంబరునిఁ బట్టి వధించెనో యేశరంబులన్
భువనముల న్విమోహగతిఁ బొందఁగఁ జేయునో వేనిచేత నా
యవితథబాణజాలమున నాతనిచూడ్కులు తోఁచుచుండెనే.

ప్రభా—(నిట్టూర్పు విడుచుచు) హా! ప్రియసఖీ!

ఉ. బాలరో! సోకుదయ్యె మొకపట్టున నావహిలంగఁ జంద్రుఁడున్
కేల దవాగ్నిపైఁ గురియ వృక్షలతాంతములన్ శుకాళి నీ
నాలుగురీతుల న్వినుము నాలుగుప్రాణములూడె నాదు హృ
ల్లోలునిఁజూడ నై దవది లోలమృగాక్షి! తపించుచుండెనే.

హా! హా! మనోహరా! (అని మూర్ఛిల్లుచున్నది.)

రాగ—(సంభ్రమించుచు) అయ్యో! మా నెచ్చెలి మరల మూర్ఛిల్లినది. ఈమె మదనా నలం బెట్టుచల్లారునో కదా. ఏమిచేయుదును.

క. మదనా! చిత్రరణోద్ధతి
కదనా? బొమవింట నిర్దయన్ జూడ్కులె తు
మ్మెదనారిగ సోయగము
ల్కదనాటఁగఁ జేసి చెలియ నేచుటతగునా ?

ఓదోషాకరా !

ఉ. దండితనంబుచే నమృతధాముఁడనంచును గౌరవృత్తి రే
యెండనుగాచి పాంథజనబృందము వేచెదె చందమామ! మా
యండజవేణిపైనిఁ జలమా మలయానిల! చాలుచాలు పో
పొండు కృతఘ్నులై పలుకఁబూనక కీరములార! మీరిటన్.

ప్రభా—(మూర్ఛ తెలసిలేచి) చెలీ! నేజీవింపఁగలనా?

రాగ—ప్రియసఖీ ! భయపడకుము. నీ విపుడు విరహజ్వరపీడితవై యున్నదానవు. కావున మన మిప్పుడా వికసితారవిందసుందరంబులగు పద్మాకరకూలంకషసైకతప్రదేశంబుల విహరించి వత్తము రమ్ము. అచ్చోటి చల్లనిపిల్లగాడ్పులవలన నీ విరహతాపం బొకించుక యుపశమించును. సందేహించెదవేల ? రమ్ము. అయ్యో ! ఇదేమే ?

మత్తకోకిల.

కోమలాంగిరో! కోపమేలనెక్రమ్మరందగ దేవనిన్,
నీమనంబునఁ గల్గుకోరిక నే నెఱుంగనిదానసే ?

ప్రభా—ఏమికారణమే దవానలమేర్చుచుండెను నామదిన్ ?
భామినీమణి! నిల్వకుండెనె ప్రాణము ల్మెయి నక్కటా!

రాగ—రమ్మురమ్ము లతాంగి! యంతిపురమ్ములోనికిఁ బోదమే,
కమ్మవిల్తు వశమ్ముకాదటె కాంత! యీ వనమంతయున్.

ప్రభా—తెమ్మె ఱల్వొయిపీవఁ బుప్పొడి తేనెవాకలు దాఁటి నే
నెమ్మెయి న్నిను మంతికంబునకేగఁజాలుదునే చెలీ?

రాగ—కాంత వీణియమీటి హాయిగ గానము న్సలుపంగదే,
చింత లేలనె నీమది న్వలసిల్లరాదటె వేడ్కలన్.

ప్రభా—ఇంతి! చిత్రపటంబులోని యహీనమోహనమూర్తి యే
చెంతనుండెనొ తెల్పిన న్వలసిల్లఁగల్గెదనే చెలీ.

రాగ—చిత్రపుంబటమందురాజిలు చెల్వుఁడెవ్వఁడొ వాని చా
రిత్రమెట్టిదొ నాకెటుల్ వివరింపశక్యమె కోలీ.

ప్రభా—నేత్రపర్వముకాఁగ నా కమనీయవిగ్రహుఁ జూడకే
గాత్రమెట్టుల నిల్పనేర్తునె ॥ కంజలోచన! నే నికన్.

రాగ—ప్రియసఖీ! నీ మనోహరుండగు చిత్రలిఖితపురుషుని జూడ నరయ నేనుఁగూడఁ బోయివత్తునా ?

ప్రభా—(ప్రసన్నవదనయై) చెలీ! ఇంతకన్న నీవు నాకుఁ జేయఁగల మే లెయ్యది?

గీ. ఖరకరుని యుష్ణకిరణాళిఁ ॥ గ్రాఁగు పాంథ
గణము కెడి చల్వ మేఘుండు ॥ ఘనతఁ జెందె.
మారనిశితాస్త్రకీలల ॥ గ్రుఁగునన్నుఁ
దనుప నాథునిఁ దోడ్తెచ్చి ॥ ఘనతఁగాంచు.

రాగ—మంచిది. (అని యటునిటుఁ జూచి సహర్షంబుగ) వహ్వా! సఖీ! అదిగో చూడుము. (అని యంగుళిచేఁ జూపుచు.)

వృషగతిరగడ.

సకియరో! మనసారఁగను మా ॥ సరగ శుచిముఖి ॥ సరసఁ జేరును
వికలతన్గొని ॥ వెతలఁ జెందెడు ॥ విధముఁ జూచిన ॥ వెలది కేరును.

ప్రభా—(సోత్కంఠయై లేచి సంభ్రమించుచు) ఏమేమీ!
వనితరో! చెలి ॥ వచ్చుచుండెనె? ॥ వడిగఁగొని రా ॥ వల దెకూరిమి
మనసిజాగ్నిని ॥ గ్రుఁగుచుండ దె ॥ మదవతిరో నా ॥ మనము పేరిమి.

రాగ—కలికిరో! నీ ॥ కాంతుజాడలు ॥ కన్గొనందగుఁ ॥ గడుముదంబున
నెలమితో నెదు ॥ రేగెదను నే ॥ నిందువదనరో ॥ యీ నెపంబున.

ప్రభా—ఏమె శుచిముఖి ॥ యిటకు నా హృద ॥ యేశుఁ దెచ్చునె ॥ యింపుమీరఁగ
(అని యూదిక్కు నుపలక్షించి విచారముతో)
కామినీమణి! ॥ కాంతునిప్పుడు ॥ గాంచ లేనో కొ ॥ కన్నులలరఁగ.
(అని నిట్టూర్పు విడుచుచున్నది)

[అంతశుచిముఖిప్రవేశించి]

శుచి—(తనలో) ఈ ప్రభావతిలక్షణంబుఁ జూడ నీమె చిత్రపటాంతర్గతాకారుండగు ప్రద్యుమ్నకుమారునిపై మరులుగొని విరహార్తిఁ జెందుచుండుట విశదమగుచున్నది.

ఏమన,

చ. ప్రమదము మీఱఁ జెన్వలపు పైకొనుటం జెలి కిప్డు పాండిమం
బమరెనుగండపాళి హృదయంబునఁ గోర్కు లమంద మౌట మాం
ద్యముఁగనె యానము ల్విరతి దైన్యము భీరుతసంబు లెచ్చెఁ గా
యముఁ గృశియించెఁ జిత్రఫలకాంతరమూర్తి వరించెగావునన్.

నా ప్రయత్నమునకు భగవతీభగవంతులుఁగూడఁ దోడ్పడుచుండిరి కాఁబోలు. ఈ లలనామణిపైఁ బ్రద్యుమ్నకుమారుండును బద్ధానురాగుండయే యున్నవాఁడు. కావున వీరిద్దఱికి దాంపత్యంబు సమకూర్చుట నా కింక సుకరంబయ్యెడు. (ప్రకాశముగా.)

సీసపద్యము.

నెలత! నీముక్కెరసీలమా?

ప్రభా— కాదు సం.దియమేల యాణిముత్తియమె చెలియ

శుచి—పడఁతి! నీసందిళ్లబాహుపుర్లెలె?

రాగ— కావు మితిఁజూడనిడినయూర్మికలెకలికి.

శుచి—కాంత! నీపాలిండ్లఁ గస్తురియలె?

రాగ— కాదు కనుదోయికాటుకకప్పె సకియ.

శుచి—రమణి! కర్ణికల వజ్రముఁదాల్చితివె?

రాగ— కాదు ప్రాఁగెంపుతునుకలరంగె ప్రోఁడ.

శుచి—గీ. పరగునిటులేమె మనప్రభావతివిధంబు?

రాగ— కంబుగళ! యూర్పువేడిమి కార్శ్యమహిమ
బాష్పములు గండపాండిమపరిణతియును
నెక్కొనుట కింతి కమ్మెయి నీకుఁదోఁచె.

శుచి—(తనలో) ఏరికైన విరహాతిశయంబుచే నిట్టియవస్థలు కలుగుట సహజమే. (ప్రకాశముగా) సఖీ! ప్రభావతీ! నీవు మాట్లాడక యూరకుంటివేమి?

ప్రభా—ఆయ్యో! శుచిముఖీ! నా మనోభీష్టం బెఱింగినదానవయ్యు గాలయాపనము చేన న్నేల జాలిం దూలించెదవు?

మ. రమణీ! జాలముసేయకే వలపునోర్వన్ జాల నీ వావరో
త్తముజాడ ల్గుఱుతించిరాఁ జనఁగ నోతన్వంగి నే నిన్ని నా

ళ్లమితానంగదవానలక్షుభితనై యత్యంతమున్ స్రుక్కి దీ
ర్ఘ్యమం గార్చిచ్చునం జిక్కుపక్షివలె నీకై వేచియుంటిన్ సఖీ.

ఇంత యేల,

క. పిడికిటనిడికొనియసువులం
బడంతీ! నినుఁజూడఁగోరి పరితాపముచే
నడలుచునుంటిని సమ్ముద
మిడఁ దెలుపవె నాథుఁడెవరొ యెందున్నాఁడో.

రాగ—సఖీమణీ! (అని శుచిముఖికరంబుఁ బట్టుకొని)

క. చెలియరో! నీచే నున్నది
కలికి బ్రతుకు నామెకోరు కాంతునిజాడల్
దెలియఁగఁ బలికి సుమాస్త్రా
నలమును జల్లార్పరాదె నళినదళాక్షీ.

మఱియు,

గీ. అవనిఁ దల్లికై నరకనక్కచెల్లెండ్రకు
నైనఁ డాఁచు లోకరహస్యములను
స్మరవికారసరణి నెఱిఁగించునెచ్చెలి
కనువులిడినఁ దీరు దప్పనిజము.

శుచి—(తనలో) ఈ కాంత తనమనఃకాంతుండగు ప్రద్యుమ్నుండు శ్రీకృష్ణునికొమరుండని యెఱిఁగినచో నతండు రాకుసాంతకునిపుత్రుండని నిరసించునో లేక వానినే వరించునో తెలిసికొనవలయును. (ప్రకాశముగా) చెల్లి! ప్రభావతీ!

గీ. కమ్మతావినొసంగు పుష్పసమ్మెయయ్యుఁ
జంపకసుమంబు పైవ్రాలఁజనునె తేఁటి?
చిత్తజాకారుఁడైన నీచిత్రలిఖితు
దైత్యరిపుపుత్రు వరియింపఁదగునె నీకు?

ప్రభా—(తనలో) నా మనోహరుండు దైత్యాంతకునిపుత్రుండట. ఇప్పుడు నే నేమిచేయుదును?

చ. ఎలమినిఁ జిత్రలోచనశితేక్షణపజ్క్తుల నల్లినట్టి పై

న్వాలవలరాజు పన్నఁగ నపారరసౌఘమునందు చేపవై
యలరుచుఁ జిక్కియుంటివిక నీ దాఁ చలియింపకు వట్టికట్టెకున్
గలుగునె బంధుబాధ్యతలు నీ కష్టముసౌఖ్యమొ గాక డెందమా.

అయినను నా కొక్క ధైర్యము కలదు. ఏమన,

గీ. కంటకవికీర్ణ భూరుహాగ్రంబునందుఁ
దనరు దళితప్రసూనామృతమును గ్రోలఁ
గోరు ప్రమదాళి నృత్యంబుఁ గూల్చునొక్క
వలచువిరి మేలు నేను దలఁచియున్న.

(ప్రకాశముగా) సఖీ! నన్ను బెదరింపుచుంటివా ?

చ. దినకరుఁ డుగ్రుఁడైనఁ దనతీవ్రకరంబుల నీరసస్థితిన్
జనుదహియింపనన్న సరసంబుగఁ బద్మిని వానిఁ గోరదే
నెనరున రాగవాహిని మునింగిన దానను గానఁ గోరెదన్
మనమున రాక్షసాంతకుకుమారుఁడె యైనను వానిఁ గూర్పుమీ.

రాగ—నెచ్చెలీ! శుచిముఖీ! మనయమునంగునకియును నీ వేల నిరుత్సాహురాలిని గాఁ జేయఁ బ్రయత్నించెదవు? నీ వా సుందరాకారుని జాడ లెఱింగివచ్చెదనని యేగినది మొదలు నేటివఱకు లేమ పొందెడు విరహపరితాపం బేమని చెప్పుదును. వినుము,

సీ. వికసితసుమగర్భమకరందమును గ్రోల సంభ్రమించుమధువ్రాళిసంకులంబు
తరుణరసాలనూతనపల్లవంబుల భక్షించుపికరుతపాటవంబు
జలధరదర్శనోత్సాహవిస్తృతబర్హబర్హినృత్యకలాపవైభవంబు
పలువిధభూరుహఫలభారనమ్రశాఖలశుకశారికాకలకలంబు

గీ. విస్మృతి భయంబుఁ దమిఁ జిత్తవికలతయును
బొరిఁబొరిఁని బెంప నాత్మీయమోహనాంగు
నెపుడు శుచిముఖి తోడ్కొనియేగుదెంచు
ననుచు నీకయి యెదురు కన్గొనుచునుండె.

మఱియు,

క. తెమ్మెరకూనలు, పుష్పద
ళమ్ములఁ జలియింపఁ బతికలండని జని యం

దెమ్మెయిఁ గనరాకుండిన
సొమ్మసిలుచు నేల వ్రాలు శోకభరమునన్.

శుచి—(తనలో) ఏమి! ఈలేమ రాక్షసరాజతనూజ యయ్యు రాక్షసాంతకు కుమారునే వరియించునా! అయినఁ దన్ను బెదరించుట కే నిట్లంటినని భావించెనేమో సంగతి తెలియ మరల నిట్లనియెదను. (ప్రకాశముగా) సఖీ! ప్రభావతీ!

చ. కణకణలాడునిప్పు మదిఁ గాతుక మంది యొడిం గ్రహింతువే?
మణి కలదంచు సర్పమును మచ్చికఁ జేఁ గొని ముద్దులాడెదే?
గుణముల నెంచకుండ నిటు గూడునె పై మెఱుఁగెంచి దైత్యస
ద్గణరిపుఁడైనవాని నిజ కాంతుఁడటంచు వరింపఁజెల్లునే?

ప్రభా—సఖీ! ఏమట్లనియెదవు?

చ. బిసరుహనేత్ర! కైఁగొనఁగ వేదనఁగొల్పిన ముండ్లు కేతకీ
కుసుమము జాళువాతళుకు గుల్కుచుఁ గమ్మనితావినిచ్చునం
చసమునఁ గామినుల్ శిరములందు ధరింపరె? యెట్టికంటక
ప్రసవము శ్లాఘనీయమన భాసిలదే గుణరూపవైఖరిన్.

వేయేల,

ఉ. వారిధు లింకనిమ్ము బడబానలమారఁగనిమ్ము తారకల్
ధారుణి వ్రాలనిమ్ము హిమధామదివాకరు లాత్మసద్గతుల్
మారఁగనిమ్ము చిత్రగత మంజులమోహనగాత్రుఁ జిత్తజా
కారుని నామనోహరునిఁ గాంతరొ వీడను వీడ నెమ్మెయిన్.

రాగ.—(తనలో) ఈశుచిముఖి మానెచ్చెలి హృదయదార్ఢ్యమెఱుంగ బహుక తినపరీక్ష సేయుచున్నది. హా! దేవీ! సర్వమంగళా! ఈపరిశుద్ధదాంపత్యం బెట్లుకొనసాగఁజేసెదవో నీదేభారము.

శుచి—(తనలో) వహ్వా! నా ప్రయత్న మింకిట నశ్రమంబుగ నెరవేరుట నిశ్చయము.

చ. ఉరుగతిఁ బారుచుండి గిరి యున్నతభాగమునుండి క్రిందకున్
గురుతరకంటకంబులను గొబ్బునఁ ద్రోయు ప్రవాహమట్లు లీ
తరుణికిఁ జిత్రమున్ గన నెదన్ బ్రభవిల్లిన రాగవాహినీ
వరమిక రుక్మిణీతనయ వార్ధిమునుంగక నాఁగ దెమ్మెయిన్.

అయిన మరల నే నిట్లనియెదను. (ప్రకాశముగా) సఖీ! నీవు రాక్షసరాజతనూజవగుటచే నీవువరించిన యాపురుషుఁడు ని న్నొల్లనన్న నీ వేమిచేసెదవు?

ప్రభా—(దుఃఖాక్రాంతయై కన్నుల నశ్రులుగ్రమ్మ) అయ్యో! శుచిముఖీ!

ఉ. అంగన! మున్నవాని హృదయంబనుపాదునఁ జిత్రరూపదృ
క్సంగతి మోహమన్నలక సంభవమందఁగఁ జేయ నిత్యము
పొంగుచుఁ దోఁటమాలియయి పూవిలుతుం డురుదోహదంబు లం
దం గొమరొప్పఁ బెంచినలతన్ మొదలంటఁగఁ ద్రుంపఁజూచెదే.

చేటీ! నీ వనినయట్లు నాపాలిటి భాగ్యదైవంబైన యామహానుభావుండే న న్నొల్లనన్నచో,

క. లేవే వజ్రపుతునుకలు
లేవే రజ్జువులు వెదుక లేవే నూఁతుల్
లేవే పాషాణాగ్నులు
లేవే కత్తులుకటార్లు లేమరో నాకున్.

రాగ—(భయమునభినయించుచు)అయ్యో! ప్రభావతీ! ఏమే నీసాహసము!(అని ప్రభావతినిగాఁగలించుకొని) ఓసీ! శుచిముఖి!

ఉ. హా! యిటుమర్మములచ్చెదర నాడుచుఁ జంపఁదలంచితే చెలిన్?
బోయవె? యాడుతోఁడునను బుట్టవె? మారునివేఁడికోలలన్
గాయముదూఁల నీవునిటు గాసిలఁ జేసెదె పల్కుములుకులన్?
ఈయును రేలబోసికొనె దింతిరో కావవె మాప్రభావతిన్.

శుచి—(నవ్వుచు) సఖీ! ప్రభావతీ! పరిహాసమున కట్లంటినేగాని నీ మోహనాకారమును జూచినపురుషుండు నీ కటాక్షం బర్థింపకుండునే? అయిన నీవరునిపేర నొకలేఖవ్రాయుము. అద్దానిఁ గొనిపోయి వాని కిచ్చివచ్చెదను.

ప్రభా—మంచిది. (అని యొకలేఖవ్రాసి శుచిముఖిచేతి కిచ్చుచున్నది)

(అంత తెరలో)

అహహో! రక్షోవీరులారా!

మ. ఉదితానంతబలప్రతాపభుజగర్వోత్సాహదుర్వారుఁడై
యెదిరింపన్నవవజ్రనాథమహారాజేంద్రుదున్ బలెన్ యతఁడు

ర్మదగంధర్వుల గెల్చి వజ్రపురిఁ జేరన్వచ్చె మీ రీ జయా
భ్యుదయంబున్ బ్రకటింప నెల్లెడల నత్యుత్కంఠఁ గైసేయుఁడీ.

శుచి——సఖులారా! వింటిరా! వజ్రనాభమహారాజుగారు దిగ్విజయము చేసి వచ్చియున్నారట. చెలీ! ప్రభావతీ! నిన్నుఁ జూడ నభిలషింతురేమో. మన మంతిపురంబున కేగుదమురండు.

ప్రభా——మంచిది. (అని యందఱు నిష్క్రమించుచున్నారు).

గద్య.

ఇది శ్రీమద్వేంకటరమణకరుణాకటాక్షవీక్షణాసారసమాసాదితరస
బంధురకవిత్వవైఖరీప్రవీణాపస్తంబసూత్ర శాండిల్యసగోత్రప
విత్ర హోతృకులకలశార్ణవరాకాకైరవమిత్ర- వేంకటరత్నసుపు
త్ర వేంకమాంబాగర్భశుక్తిముక్తాఫల వివిధవిద్వజ్జనవిధే
య వేంకటకృష్ణనామధేయప్రణీతంబైన ప్రభా
వతీప్రద్యుమ్నంబను నాటకరాజంబున
తృతీయాంకము.

HYDERABAD-DN. 1923 ANDHRA BHASHA NILAYAM

శ్రీరస్తు.

హయగ్రీవాయనమః.

ప్రభావతీప్రద్యుమ్నము.

చతుర్థాంకము.

రంగము: ద్వారకాపురపరిసరము.

[అగ్నిహోత్రచయనులు ప్రవేశించును.]

అగ్ని—(స్వగతము) ద్వారకాపురవరంబున వసుదేవమహారాజుగారొనరించు యజ్ఞవైభవముఁ గన్నులారఁ జూచి జన్మసాఫల్యంబుఁ జెందితిని. ఓహో! ఆ మఖవాటిక యందు,

సీ. ఒకచోట బ్రహ్మయుత్సుకతఁ ద్రేతాగ్నుల
విస్ఫుటంబుగఁ బ్రణయింపఁ జేయ
నొకవంక నధ్వర్యుఁ డకలంకతన్మంత్ర
యోగసామీచీన్యయుక్తినెఱప
నొకయోర నుద్గాత ప్రకటితప్రౌఢిమై
సామగానములహెచ్చరికఁ బాడ
నొకచేవ హోత సర్వ్వకలాకలాపుఁడై
వలయు దత్తత్క్రియల్ దెలుపుచుండఁ

గీ. దక్కఁగలవారలెల్ల నత్యంతనిష్ఠ
వేదనాదంబులను మఖవిధులొనర్ప
నెమ్మితో దేవకియు సోమిదమ్మ కాఁగ
సొంపుమీరెను వసుదేవసోమయాజి.

మఱియు, నే నా క్రతువైభవ మెంతని కొనియాడుదును.

ఉ. భోరున నాజ్యహోమములఁ బుష్కలదానములన్ బ్రశాంతికై
గారెలు బూరె లిడ్డెనలుఁ గమ్మనిపప్పులుఁ గూరగాయలున్
జేరలనిండ నేతులును జిక్కనిపాల్పెరుగుల్ చెలంగ నో
రూరెడుపాయసాన్నముల నోలి జనంబులఁ దన్పునిచ్చలున్.

(అని యిటునటుఁ జూచి)అదిగో! యజ్ఞేశ్వరసోమయాజులుగా రిటులనే వచ్చుచున్నారు.

[అంత యజ్ఞేశ్వరసోమయాజులుగారు ప్రవేశించి].

యజ్ఞే — ఎవరండీ యిక్కడ? మీ రియ్యెడ నెక్కడైనఁ బ్రద్యుమ్నకుమారునిఁ జూచితిరా? వసుదేవమహారాజుగారి యజ్ఞవైభవమును శ్లాఘింపుచుండిరి కాఁబోలు.

అగ్ని — యజ్ఞేశ్వరసోమయాజులుగారూ! నన్ను మీ రెఱుఁగరయ్యా? నాపే రగ్నిహోత్రచయనులు. ఆ క్రతువైభవము మీకుమాత్రము శ్లాఘనీయమని తోఁచలేదా?

యజ్ఞే — (ముఖమెత్తి కనుఱెప్పలపైఁ బాణితలంబుఁ జేర్చి చూచి) ఓహో! మీరా? అగ్నిహోత్రచయనులుగారేనా? పెద్దవాఁడ నగుటచేఁ జత్వారమువలన నే మి మ్మానవాలుపట్టలేకపోతినిషుమండీ. సర్వలోకశ్లాఘ్యంబైన యీ యధ్వరము నా కొక్కని కేల వర్ణనీయము గాకుండును.

శుద్ధవిరాటీవృత్తము.

ఆహా! యద్భుత మామఖంబునన్
స్వాహారావ మవారితంబుఁగా
మోహంబంది విభూతి నే నటన్
దేహం బేమఱితి న్ముదంబునన్.

కాని నే నొక్కరుండను మాత్రము దరిద్రదేవతాపరుండ నగుటచే నిర్భాగ్యుండనైతిని.

అగ్ని — సోమయాజులు గారూ! మీరు కేవలము వేదస్వరూపులుషుమండీ. మఖవైభవమునుగూడ వేదస్వరముతోనే వర్ణించితిరి. ఏమయా మీప్రభావము! అట్టిదాని యెడల మీ రేల విముఖులైతిరి? యజ్ఞసంభావన ముట్టలేదా యేమిషి?

యజ్ఞే — నా కొక్కనికిమాత్ర మది యేతత్సామగాయమే.

అగ్ని — ఏమి! ఇది కడు నాశ్చర్యముగనున్నయది.

శా. శ్రౌతస్మార్తవిశారదు ల్విబుధు లచ్ఛావాక్ప్రతిస్థాత స
ద్ధోతోల్లాసు లగణ్యపుణ్యులగు గ్రావస్తుత్ప్రస్తోత వి

ఖ్యాతుండౌ ప్రతిహర్త ధీకలితుఁడౌ నా బ్రాహ్మణాచ్ఛంసి యు
న్నేతాగ్నీధ్రుఁడు నేష్టముఖ్యు లలర న్నీ కేల యిట్లయ్యెనో.

యజ్ఞే—అగ్నిహోత్రచయనులుగారూ! ఏమని చెప్పుదును. పాపాత్ములైన వర్తకాధములు నాపాలిటిదరిద్రదేవతాస్వరూపులైరి. సమయమునకుఁ బరమధర్మాత్ముఁడైన ప్రద్యుమ్నకుమారుం డడ్డుపడకుండిన నాశిరస్సు భిన్నమై యీసరికే నేను—(అని చేయాడించుచున్నాఁడు)

అగ్ని—పాపము. మీరు మంచిబ్రాహ్మణులయ్యా. మరల ప్రద్యుమ్నకుమారునిఁ జూడలేక పోయినారా?

యజ్ఞే—అందుకొరకేగా మహయ్యా. నే నీలాగు తిరుగుచున్నాను. మీరు బహుపుణ్యాత్ములు. అగ్నిహోత్రచయనులుగా రనఁగ సామాన్యులా.

హాలముఖీవృత్తము.

వేదపూజితులరు కదా
మోదమయ్యెనుమిముఁగనన్
సాదరంబుఁగను దనుపన్
రాద బ్రాహ్మణుఁడనగుటన్.

అగ్ని—అబ్బ-అబ్బ-మీరు పెద్దలు. మీముందర నే నెంతవాఁడను! మీయాశీర్వచనము నే గోరుచున్నానుమండీ. ఇవే మీకు పదివేలవందనములు. (అని నమస్కరించుచున్నాఁడు)

యజ్ఞే—దీర్ఘాయుష్మాన్భవ-వర్ధస్వ. వేదపురుషప్రసాదసిద్ధిరస్తు. మనోవాంఛాఫలసిద్ధిరస్తు. ధనకనకవస్తువాహనసమృద్ధిరస్తు. ప్రాతరేవాశివస్సంతు. రాజద్వారేసిరంతరా ఖండలక్ష్మీప్రసాదసిద్ధిరస్తు. (అని యాశీర్వదించి) ఆప్రద్యుమ్నకుమారుని మీ రిం దెయ్యెడనైనఁ జూచియుంటిరా?

అగ్ని—ఆఁ! చూచితిని. అదిగో చూడుము. ఆ తటాకముచెంతఁగూర్చుండియున్నాఁడు. మీ రచ్చోటి కేగుఁడు. నేఁ బోయెదను. (అని నిష్క్రమించును)

యజ్ఞే—ఆహా! మీ రెంతధర్మాత్ములండీ. నే నిప్పుడచ్చోటికేగెదను.

(అంత తెరలో)

బ్రాహ్మణోత్తములారా! యజ్ఞసంభావనముట్టనివారు వసుదేవమహారాజుగారి మందిరంబునకు రం డోహోయి

యజ్ఞే—(ఆలకించి సంతోషముతో) ఓహో! ఏమినాభాగ్యము! నే వసుదేవునిమందిరంబునకేగెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

[అంతశుచిముఖి ప్రవేశించి]

శుచి—(తనలో) యజ్ఞసంభావనార్థమై ప్రద్యుమ్నునిఁ దోడ్కొనిపోకుండ నాబ్రాహ్మణుని వసుదేవునిమందిరంబున కనిపితిని. ప్రభావతీకన్యపై మోహాతిరేకంబుననే కదా ప్రద్యుమ్నకుమారుం డాతటాకముచెంత గుజ్జుమావిగున్నక్రింద నేకతంబ విరాళిఁజెందుచుఁ గూర్చుండియున్నాఁడు. నే నిప్పుడు వానిచెంత కేగి యదృశ్యనైయుండి సమయసముచితంబుగ వాని కిలేఖ నొసంగి వానిచిత్తంబు మోహాయత్తం బగునటు లొనరించి వజ్రపురంబునకుఁ గొనిపోయెదను. (అని తిరస్కరిణీముద్రధరియించి పరిక్రమించుచున్నది)

[అంత నొకతటాకముచెంతఁ బ్రద్యుమ్నుం డేకతంబ ప్రవేశించి.]

ప్రద్యు—అన్నా! ఏమి యీచిత్రము.

చ. హరిణముపై మనంబు హరిణాక్షిపయిం దగులంగఁ గాననాం
తరమున నాకొసంగె వనితామణి చిత్రపటంబుఁ దీని సుం
దరతనుకాంతి పూర్ణహిమభాముని గేరుముఖంబుఁ జూడ దు
ర్భరవిరహాగ్నికీల లెదఁ బర్వుచు సన్తపియింపఁ జేసెడున్.

అకటా! నా యనుంగుచెలిమ్ముల వార్తాలాపంబు వినినతోడనే యొడలెఱుంగక హస్తగతంబైన పెన్నిధానంబునుఁ గాఱడవిని విడిచివచ్చితిని. ఆదూతికాతిలకంబును మరల నే నెట్లు చూడఁగలుగుదును? ఓశుచిముఖీ!

శా. ఏలాచిత్రపటంబు నాకొసఁగితే యీమోహవారాశి నే
నేలాయీఁదితరింపఁగల్గుదునె యీయేణాక్షిదృగ్జాలికా
జాలస్ఫూర్తి నెసంగుభాగ్య మెటులన్ సందర్భమా నే ననున్
జాలిందూలఁగఁ జేయఁజూపితివె యీచానన్ సరోజాననన్.

హా! నన్నెట్టియవస్థలపాలు చేసితివే.

సీ. నెత్తమ్మికొలఁకులనీరు కాంతామణి
వదనలావణ్యసంపద యటంచుఁ
గమనీయసాంధ్యరాగము తరుణీమణి
లేఁగెంపుచెక్కులలీల యనుచుఁ

చిలుకలకలకలంబులు మంజుభాషిణి
లలితకోమలవాగ్విలాస మనుచుఁ
దారకాంచితనిశీథంబు బంభరవేణి
సుమవికీర్ణశిరోజశోభ యనుచు
గీ. నలరుగుత్తులుగల తీవియలు లతాంగి
పృథులవక్షోజయుతతనూవిభవ మనుచు
దలఁచి భ్రమియించి దిగ్భ్రమఁ గలఁత జెంది
గడియ యుగముగ రేయెల్లఁ గడిపియుంటి.

ఇంకెంతకాలము వేచియుండవలయునో కదా. అబ్బా! ఈ విరహవేదన నెట్లు సహింపఁగలిగెదను.

సీ. లోనున్న మలయానిలుఁడు నిర్దయుండౌచుఁ
దడిపోచ గొంతుక దఱుగుచుండు
వెలికిరా నాపైని వినువీథిజాబిల్లి
క్రూరుఁడై రేయెండఁ గ్రుమ్మరించు
విహరింతుమన్నచో విటపిసంఘంబుల
శుకపికప్రసవము ల్సోలయఁజేయుఁ
బువ్వుటీరములకుఁ బోవుదమన్నచో
నళికులంబులు మదిఁ గలఁతఁబెంచు
గీ. సైకతవినోదములకు నాసక్తిగొనిన
నిలువనియ్యవు కేకినుల్కలరుతముల
నలర జలకేళిసేయనియ్యదు మరాళి
చిక్కియుంటిని యిం దేమిసేయువాఁడ.

ఔరా! ఈ శుకపికశారికానికురుంబంబు లెట్లుగర్వించి చెలరేగుచున్నవి. నా మనోహారిణితో నొకింత సాదృశ్యముఁ గనియుండుటచేత నేకాఁబోలు.

చ. లలితరసాలపల్లవములం గడుపారఁగ మెక్కిముద్దుగాఁ
బలికినయంతనీవు కలభాషిణివౌదువె యో పికాంగనా!

కలకలలాడుచున్నలుకఁ గాఁ శుకశారికలాపులార! యు
క్తాలికనుచిత్రదర్శితలతాంగులెమీరలు మిన్నకుండుఁడీ.

ఆఁ! ఏమి మీపాతకము!

సీ. తన్వీసల్లాపామృతముఁ గోరినందుకా
చులకనై తినిమీకు చిలుకలార!
వనజోణిమందయానముఁ గోరినందుకా
యలతినై తిని మీకు హంసలార!
కలికిక్రొన్నెరులసంగతి గోరినందుకా
తేలికై తినిమీకు తేఁటులార!
కోమలికుచపాళిఁ గోరినందుక నీర
సంబునై తిని రథాంగంబులార!

గీ. పంతమా యింతమీకు సామంత మేల
చేతనై యున్ననన్ను రంజింప మీరు
గరితకెటుఁ గింపుఁడీ చేతఁగాక యున్న
నూరకుండుఁడి మీకదే యుచితమిపుడు.

ఉ. ఏమిరపాపి నీ గురునకే మునుఁబెట్టవె పంగనామముల్
హైమవతీకళత్రుఁడు రథాంగము క్రింద నడంగఁద్రొక్కెనన్
బాములవాఁతఁగూలినను బాంధులపాలిటి మృత్యువౌచుఁ జం
ద్రా! మినుముట్టుచుంటివి విధాత కిదే తలఁగొట్టు టెంతయున్.

అహ్హా! ఈ కొదమతేఁటి యెట్లు రొద చేయుచున్నది!

ఉ. పంపెనె నిన్నయుండు మధుపానప్రమత్తతఁ బాంథలోకమున్
జంపఁగ జుమ్మటంచు ననిశంబును దూఁటొనరించికర్ణముల్
చంపకనాస నా హృదయసద్మమున న్వసియించియుండె గ
ర్వింపఁగఁజెల్ల దీవు వినవే మదపట్పదమా ముదంబునన్.

అకటకటా! ఈవనంబున,

గీ. రామరామా! శుకాళియార్భాటమెచ్చె
హరిహరీ! చల్వతెమ్మెర లతిశయించె

హంస లుద్ధతి రేఁగ జలజలాశయముల
ఘనకచకటాక్షు మెపుడు నేఁ గాంతునొక్కొ.

ఏమి నా కీవెట్టి. నే దైత్యాంతకకుమారుండు నగుటచే నన్నాలేమ వరించునో వరింపదో. ఈవిషయములో నామాతికాతిలకంబును నాకుఁ దగినంత ధైర్యముఁ గలిగింప దయ్యె. మఱియు,

చ. ఎలమిని నేను వజ్రపురిఁ జేరుటయెట్లొకొ యేఁగఁగల్గినన్
గలికినిఁగాంచువైభవము గల్గుటయెట్లొకొ కాంచఁగల్గినన్
జిలుకలకొల్కి లేనగవుఁ జిల్కుచుఁబల్కునొ పల్కుకున్న ని
ర్మలకృప నాదరించునొ పరాఙ్ముఖియౌనొ యదృష్టమెట్టిదో.

(అని పరిభ్రమించుచుఁ గ్రిందఁబడియున్న లేఖను పైకిఁదీసి చూచి) ఓహో ! ఇది యొక యబలాలిఖితంబగు నుత్తరంబు. ఇం దేమివ్రాయంబడి యున్నదో చూచెదఁ గాక. (అని యుత్తరము విప్పి చదువుచున్నాఁడు.)

"ఓ యభినవమన్మథాకారా! అతులనిజరూపజితబాలభాస్కరా! అస్తన్ననోధన చిత్రకైతవతస్కరా! ప్రాణేశ్వరా!

భవత్పాదారవింద నిష్యందమకరందతుందిలేందిందిరాయమానమానసనయి త్రికరణశుద్ధి నిన్నే యాత్మభర్తఁగవరించి నెక్కొనుతమకంబున నీపై మరులుగొని రేయింబవళ్లు విరహార్తిచే క్రుగ్గు దీనురాలగు ప్రభావతిచేయు వినయపూర్వకమైన విజ్ఞాపనము.

జీవితేశ్వరా.

చ. సుమశరమన్ గలంబుఁగొని సుక్కెడు దేహమునందుఁగల్గు ర
క్తమునను ముంచి నీ హృదయకంజమటంచు నవీనమైనప
త్రమున మరుండుచెప్పినవిధంబుఁగ విస్మృతి లేఖవ్రాసితిన్
మిముఁబతిభక్తిఁగోరుచు క్షమింపరె యిందునఁ గల్గు తప్పులన్.

సీ. రాక్షసకులవారి రాశిమత్స్యంబనై
చిత్రంపుటెత్తెలఁ జిక్కియుంటి
బాలభానూదయభాగ్యంబుఁగోనఁ జక్ర
వాకినై పతికాంక్ష వనరుచుంటి
నినుఁగోరి వర్జించి నిదుర నాహారంబుఁ
దొంగవింటిబంతినై త్రుళ్లుచుంటి

జనకునాజ్ఞాశూల సంవృతపంజరాం
    తరబద్ధకీరమై నవయుచుంటిఁ

గీ. బువ్వువిల్తునిశరలోహ పుం బెనమునఁ
జలువకరువలిరవులు వెన్నెలల వేఁడిఁ
బెటుకు పెటుకునఁ బేలెడు వేలగింజ
సంచున విరాళిచేఁ దపియించుచుంటి.

మనోనాయకా! కరుణామయుండవైన నిన్ను నేఁ బ్రార్థించునదేమన,

సీ. అలరారులేఁత వెన్నెలకల్మిచేఁగాక
    నీలోత్పలంబులు నెగడఁగలవె?
పారిజాతస్కంధపాటవంబునఁగాక
    వల్లీమతల్లి శోభిల్లఁగలదె?
జీవనజాప్తసంభావనచేఁగాక
    జీవనజంబు భాసిల్లఁగలదె?
మౌక్తికరాజిసంబంధంబుచేఁగాక
    విద్రుమంబులు రక్తి వెలయ గలవె?

గీ. పృథివి నీ మందహాసంబుఁ బీనవక్ష
మానన రదాంశుకావాప్తిఁ గానకున్న
నా కనుంగవ తను వానసంబు మోవి
రాజిలునె? రమ్ము నన్ను నీరాణిఁ జేయ.

గీ. దానవాంగనయని నిరాదరణసేయ
కేను నీదానఁజుమి హృదయేశ ! నీవ
నాదుపతివంచుఁ దెల్పి స్వప్నమున గౌరి
చిత్రితభవత్సదాకృతిఁ జెల్మినొసఁగె.

కావున,

చ. అసురకులాంగనన్బరిణయంబగు టర్హముఁ గాదటంచు మా
నసమున నెంచఁబోకు మల నాగకులాంగన నే కిరీటి సం
తసమునఁ జెట్టపట్టినవిధంబుఁ దలంపుము సద్గుణాళి నే
రసికమణుల్ గ్రహింతు రనురక్తులవంశగుణంబుఁ గాంతురే.

చ. జలగతహేయపంకమున జన్మమునొందిన దంచుఁ బద్మమున్
విలసిలనేలకుండెనె రవి ప్రమదంబున? దోషసంగతిన్
వెలయునిశాటుఁడంచు శశి నీశ్వరుఁ డౌదలఁదాల్పకుండెనే?
తలఁపఁ ద్రిశుద్ధినమ్ము వని తన్గొన వంగన మెంచఁ బాడియే?
ఉ. వాదముగాదుసుమ్ము చెలువమ్ము మనోజ్ఞగుణమ్ముఁ గల్గు శా
తోదరి దానవాన్వయసముద్భవయయ్యు ముదంబెకూర్చెడున్
మేదురకంటకవ్రజసమేతమహీరుహజాతమయ్యు నా
మోదముఁగూర్పదే మదికి ముచ్చటఁగొల్పి గులాబి నాయకా.

మఱియు,

ఉ. రేయిఁబవల్ నిశాచరపరీవృతయై మనుదానిఁ జెందఁగా
డాయుటకష్టమంచు వికటింబుఁగ నాత్మఁదలంపఁబోకుమా
హాయి మరందపానరతుఁ డక్కటతో మధుమక్షికంబులన్
బాయఁగఁదోలి మేలి మధుపాళినిఁ బాళిఁ బరిగ్రహింపఁడే.

మనోహరా! ఆర్తత్రాణపరాయణుండవు నఖిలధర్మాధర్మకోవిదుండవు నగు నీకు నేను చెప్పవలసినదానను కాను. అయినను కలగుండుపడు మదీయాంతరంగంబునుండి పైకుబికి యనర్గళంబుఁగ వెల్లివిరియు మనోభీష్టంబులం బుక్కిట నిడికొనంజాలక యిట్లు వెల్లడించితినని నాపైఁ గినియకుఁడు.

గీ. జాబుకై వేచెదను తాళఁజాల వలపు
గడియలెన్నుచుఁ దినములు గడుపుచుంటి
నాథ ! పాలింపుమీ వజ్రనాభదైత్య
విభు తనూజ ప్రభావతీ విన్నపంబు."

(అనిచదివి) అహో! ఏమిఁయీవిచిత్రము !

ఉ. తానఁట వజ్రనాభునినుతాస్ఫటికంబఁట మున్నవాని స
న్మానితలీల నన్నుఁ గరుణన్ లిఖియించిన చిత్రమిచ్చి "నీ
కీ నవమోహనాంగుఁడె సుమీ పతియౌ" నని తెల్పెనంట లో
నూనిన వేడ్కనన్ దలచి యుండెనఁటద్దిర ! యేమిచిత్రమో.
సీ. దానవాయిణికినింత దయయేలనాపైనిఁ
గలిగెనో చిత్రసంగతునిఁ జేయ

నాచిత్రఫలకంబు । ననురాత్మజకు నేల
కరుణఁదానొసఁగెనో । కౌతుకమున
నాచిత్రలిఖితుండనైనా నన్నువరునిఁగా
నేలవిధించెనో । యింతికంబ
విధియించినంతనే । వెలఁదిదానవసుతా
తిలకమైమేలఁనన్వలచెనొక్క
గీ. కలిగె నాకిట్టిభాగ్య మా । గౌరికరుణ
హృదయమ! కృతార్థవయ్యెద । వింక నిన్ను
దాంగిలించిన యామోహనాంగి యమిత
కృప మనుపు సంతతానంద । మొసఁగఁజేసి.

శుచి—(తనలో) ఈతండు ప్రభావతీకన్య తనపేర వ్రాసిన యుత్తరంబున కలరి యీ లేమ తన కిప్పుడే కరగతంబైనట్లు భావించుచున్నాఁడు. వీని మనోధైర్య మెఱుంగుటకై యదృశ్యనై యుండి యీ కురంగము నుద్దేశించి యిట్లనియెదను. (ప్రకాశముఁగా)

చ. అలరెదె పత్రసంగతఫలాప్తికిఁ జెంతనుజేరఁ గంటకం
బులు గల వందు గ్రుచ్చుకొనఁ । బోలుఁజుమీ పరికింపలేవొకో
వలచునటంచు దానిపయి । భ్రాంతిజనించెనె యంతకన్న స
త్ఫలములులేవె వ్యర్థము కదా భవదీప్సిత మో కురంగమా.

ప్రద్యు—(ఆలకించి యుత్కలికఁ దనలో) సహ్వా! ఈ శుచిముఖి మరల వచ్చి యదృశ్యయై నాచెంతనే యుండెను కాఁబోలు. ఈ నారీమణి ప్రభావతీకన్యపంపున మూతికయై యీలేఖఁ గొనివచ్చెనని తలంచెదను. శుచిముఖిగాక యొరు లెవ్వ రిట్లన్యాపదేశంబుగ బల్కెదరు? మరల నే నా కురంగము నుద్దేశించియే యిట్లనియెదను. (ప్రకాశముఁగా)

చ. అలరవె పత్రసంగతఫలాప్తికి నాఁకొనియుండి కంటకం
బుల గణియింతువొక్క వలపుం బ్రకటించెదు దాని పీడదే
సలలితరాగసంపద రసస్ఫుటితాచ్ఛఫలంబుఁ జెంద ని
చ్చలుఁదపియించి కోర్కె కొనసాగఁగఁ జేయవె యోకురంగమా.

శుచి—(తనలో) ఈతండు శృంగారరసానుభూతికై యాకొనియుండుటచే దైత్యకంఠకంబులనులక్ష్యపెట్టననియు నేమైననుసరే పూర్ణమైనయనురాగమునుఁ బ్రకటించెడు ప్రభావతీకన్యనుఁ బరిగ్రహించుటకు సర్వవిధములచేతనుఁ బ్రయత్నించెదననియు భావగర్భితంబుఁగ వెల్లడించుచుండె. మరల వీనిని సంబోధించియే యిట్లనియెదను.

(ప్రకాశముఁగా)

సీసపద్యము.

కేసరివక్ష! చక్కెఁ బవింటిదొరవౌదు-

ప్రద్యు. కేసరీమధ్యకౌఁగిలి లభింప.

శుచి. నెలకూనగుఱుతు నీ నిటలంబు-

ప్రద్యు. వామాక్షికుచపాళి నెలకూన గుఱుతులిడఁగ.

శుచి. గజతుండహస్త! చక్కనివాఁడవౌదువు -

ప్రద్యు. గజయానతనువల్లిఁ గైకొనంగ.

శుచి. మంగళాంగుండవై మహిమఁగాంచెదవీవు-

ప్రద్యు. మంగళగళసమాలింగనమున.

శుచి. చక్రవర్తివియన నీవు చాలియుందు-

ప్రద్యు. చక్రవర్తుల సుశ్రోణి సరసఁ జేర.

శుచి. కుముదరుచిగ్రాలు నీదు నేత్రములు మిగులఁ.

ప్రద్యు. గుముదబాంధవముఖినిఁ గన్గొన లభింప.

శుచి—(తనలో) ఈ మోహనాంగుం డాయెలనాగపై బద్ధానురాగుండయేకదా యిట్లు మితిమీరిన విరాళిఁ జెందుచున్నాఁడు. ఇంక నే వీనికిఁ బ్రత్యక్షమై వీనిని వజ్రపురంబునకుఁ గొనిపోవఁ బ్రయత్నించెదను. (అని ప్రత్యక్షంబుఁగ బ్రద్యుమ్నుని యెదుట నిలువంబడి ప్రకాశముఁగా) శ్రీకృష్ణకుమారా! నీ వీ తటాకముచెంత నేమి చేయుచుంటివి?

ప్రద్యు—(సహర్షంబుఁగ) స్నానమొనర్చుచుంటిని. ఎట్లన;- పరిపూర్ణకరుణాసమేతవై నీవు నా కొసంగిన చిత్రపటంబుఁ జూచుచు,

గీ. సకియ నెమ్మేనికాంతి మజ్జనమొనర్చి
యంత శృంగారరసవార్ధియందుమున్గి
పిదప నానందబాష్పాంబుబిందుధారఁ

గ్రుంకులిడుచుంటి శుచిముఖీ! కోర్కులలర.

శుచి—(నవ్వుచు) ప్రద్యుమ్నకుమారా! ఎంత ప్రమాదపుపనిఁ జేయుచుంటివి!

గీ. గాఢవిరహజ్వరంబుచేఁ గలతఁజెంది
వంతనొందుచు నీవిట్లు భ్రాంతిఁ జిక్కి
వనితపై రాగసరసిలో మునుఁగుచున్నఁ
దజ్వరము హెచ్చదే యపథ్యంబు చేత.

ప్రద్యు—శుచిముఖీ! ఈ చిత్రపటాంతర్గత మోహనాకారంబుఁ జూచి తమినిలుపఁ జాలుదునే? (అని చిత్రపటంబుఁ జూపుచు)

సీ. ఈ ముఖపూర్ణిమా హిమకరదర్శనో
త్సుకత నాయెద చకోరిక యనంగ
నీ నీలకబరికా నూనజీమూతసం
ప్రాప్తికై చిత్తంబు బర్హి యనఁగ
నీ హస్తబిసతంతు నెనయ నా డెందంబు
రాజితరాజమరాళ మనఁగ
నీ నవలావణ్య మానితజలకేళి
సలుప మనంబు మత్స్యంబనంగ
గీ. వేవిధంబుల నిగుడుచు వివశయగుచు
మీఱి లోలోన నువ్విళు లూఁరియూఁరి
హృదయ మా వజ్రపురిలోని సుదతిఁ జేరఁ
దను విట స్మరాగ్నికింధన మనఁగ నిలిచె.

మఱియు,

సీ. భువనజాతామోదభూతిచే దేహంబు
జవ్వనితనువు కాసక్తిఁజెంద
భువనజాతామోద భూతిచే చిత్తంబు
వనితకన్నవపైని వ్రాలనెంచ
భువనజాతామోద భూతిచే దృక్తతి
కలికి ముద్దులమోముఁగంబుఁజూడ

భువనజాతామోద భూతిచేఁ బల్కులు
పూఁబోణి గొనబు కెమ్మోవిఁగదియఁ
గీ. ప్రకట సురతరు వల్లి చకోరిక శుకంబు
లగుట లతయని శరరుహం బనుచుఁ జంద్ర
బింబమనుచును రసయుక్త బింబమనుచుఁ
జిత్రగత మోహనాంగి నాశించియుండె.

ఓదూతికారత్నమా!

కవిరాజవిరాజితము.

మ. తరుణమిదేసుమి తామరసాక్షి ముదంబునఁజూడఁగఁ దన్మయతన్
స్మరశరకీలల జాలినిఁదూలుట జాముయుగంబుఁగఁ జాగునయో
యురుగతిఁదత్పర మొయ్యనఁ జేరక యున్నతమోహపయోనిధి నే
దెరలుదునే సుదతీమణి! ప్రొక్కెద దీనుఁడఁగోరికఁ దీర్పఁగదే.

శుచిముఖీ! ఆ రమణీమణి నిశ్చయముగా నన్నువరించియుండెనా?

శుచి—శ్రీకృష్ణాత్మజా!

ఉ. కొమ్మనునోగతం బెఱుఁగఁ గోరెదె యద్భుతమయ్యె నీశరీ
ర మ్మిటనుండ భావమితరస్థలమందున నుండెనొక్కొ మో
సమ్మనియెంచి నీమదిని సందియ మొందెదె నిర్దయుండవై
కమ్మనుఁజూచియున్న నను కంప జనింపదె నీకు నక్కటా.

ప్రద్యు—శుచిముఖీ! "యత్రాకృతి స్తత్రగుణాః" అని లోకములో స్త్రీలకుఁగాని పురుషులకుఁగాని రూపమునుబట్టియే గుణములుప్రకాశింపుచుండును. ఆకారణంబుచే దైత్యరాజతనూజయగు ప్రభావతీకన్యజగన్మోహనస్వరూపంబునకు సుగుణసంపదయు ననురూపంబుఁగనే యుండునని తలంచెదను,

శుచి—సందేహమేమి? అట్టి లోకోత్తరగుణఖని నే నెందునుఁ జూడలేదు. వినుము,

చ. గురువులయాజ్ఞమీరక నకుంఠితభక్తిని వైష్ణవార్చనా
పరతఁజరింపుచు న్బరమపావనశీలయనంగ సత్యవా
క్సరణిని సద్వ్రతంబు లనిశంబునుఁజేయుచు రేబవల్మినున్
దిరముఁగ నాత్మనిల్పి సుదతీమణి పూజలొనర్చుచుండెడే.

ప్రద్యు—(ఉత్కంఠతోఁదనలో) ఓహో! ఏమినాభాగ్యము! (అనిచిత్రపటంబుఁదిలకించి)

సీ. తేనియఁజిమ్ము వాతెఱ చవుల్ప్రచరించు
చందమెన్నుటకు మాసంబుపట్టు
మిలమిలఁగ్రాలెడు మీననేత్రంబుల
పటిమనెన్నఁగశతాబ్దంబుపట్టు
తిలపుష్పములజిగి దళుకొత్తునాసిక
డంబుశ్లాఘింప యుగంబుపట్టు
పూర్ణచంద్రునిభాతిఁ బొలుపొందువదనంబు
వర్ణింప బ్రహ్మకల్పంబుపట్టు
గీ. నింక నితరావయవముల నెన్నఁదరమె
యహాహా! నా మహాభాగ్య మేమనఁగవచ్చు
లోకమోహినియైన యీలోలనేత్ర
నాకు సతిఁగా సృజించె నా నలినభవుఁడు.

(ప్రకాశముగా) శుచిముఖీ! ఈ నవలామిన్నను కన్నులారఁజూచుభాగ్యము నా కెట్లు సందర్భింపఁజేసెదవో నీదేభారము.

శుచి—(తనలో)

గీ. నాయికానాయకులకాత్మఁ బాయనట్టి
విపులవిరహాజ్వరంబును వెడలఁదోలఁ
దగినదివ్యౌషధము ప్రేమ నెగడ వారి
నొక్కయెడఁజేర్చుటేగాదె యుర్వియందు.

ఏయుపాయంబుచే వీనిని వజ్రపురంబులోఁ బ్రవేశ పెట్టనగు? (అని కొంచెమాలోచించి) ఆఁ! నా కిపుడు చక్కనియుపాయ మొకటి పొడఁగట్టినది. (అని శిరఃకంపముఁ జేసి) అటులనే చేసెదను. (ప్రకాశముగా) ప్రద్యుమ్నకుమారా! ఏల నీ విట్లు మితిమీరిన విరాళిచేఁ బరితపించెదవు?

ప్రద్యు—ఈశ్వరకటాక్షంబున నా దైత్యనాథుండు గాంచిన దుస్తరవరప్రభావంబుచే వజ్రపురంబు లాతులకుఁ జొరనశక్యంబు. ఆ మోహనాంగినిఁ జూడకున్న నేఁ బ్రతుకఁగలనా?

చ. పొలుపుఁగఁజంచరీకములు మోహనమంత్రము లుచ్చరింపఁ బై

నొలయుచుఁ జల్వతెమ్మెఱలు నుప్పొనమూఁదఁగ మోహనాంగి యు
జ్జ్వలతరవర్ణనామృత రసం బను తియ్యని మత్తుమందు నే
నెలమిని గ్రోలఁగఁ గర్ణముల నిట్లవశాత్ముఁడనైతినే చెలీ.

శుచి—ప్రద్యుమ్నకుమారా! నీ వెంతవిరాళిఁ జెందుచుంటివో నీపై మరులుగొనిన ప్రభావతి నీకంటె యినుమడుంగుల విరాళిఁ జెందుచున్నయది. అరణ్యంబున నీవు నన్ను విడిచిపోయినతోడనే నే వజ్రపురంబున కేగితిని. మఱియు.

మ. చనఁగా నప్పురిలోఁ బ్రభావతి వనిన్ సౌదామినీరీతి నిం
పున రాజిల్లుచు నీపయింగలతమిన్ మూర్ఛిల్లియుండంగ చెం
తను చేటీమణి రాగవల్లరియు నంతన్ స్వీవఁగాఁ దమ్మివీ
వనఁ దెల్పొంద రహస్యలీల నెఱిఁగింపన్ గల్గె నీసంగతిన్.

ప్రద్యు—(సహర్షంబుగ) ఏమేమీ! ఆకన్నియ నిశ్చయముగ నాపై విరాళిచేత నేమూర్ఛిల్లెనుగా? అటులైన నీసహాయమువలన నే నింక చరితార్థుండ నయ్యెదను. వహ్వా!

శా. హా! రామామణి! యంచు నేఁ బలుకఁ గీరార్భాటి నాసంబు నూ
గారుం జూప మదాళిగంధవహులున్ గాంతాకుచంబుల్ గనం
గా రాయంచలు శీతరశ్మియు మనంగారాదు నే మోహపుం
వారాశిం బడి యుంపఁగల్గుదు సహా వామాక్షి దర్శించినన్.

శుచిముఖీ! ఏయుపాయంబు చేనైన నన్నా రాక్షసపురంబులోనికిఁ దోడ్కొనిపోయి ప్రభావతీకన్య శుద్ధాంతంబునఁ బ్రవేశపెట్టితివేని నీ యొనర్చుమేలు నే నెన్నటికిని మఱచువాఁడను కాను.

శుచి—ప్రద్యుమ్నకుమారా! తహతహ జెందకుము. నేను చెప్పినట్లు నీవు ధీరోదాత్తుండవై ప్రవర్తించితివేని నీయభీష్టంబు తప్పకఁ గొనసాగు. నిన్నిప్పుడు తోడ్కొనిపోయి వజ్రపురబాహ్యంబున నిలిపి నే లోనికేగి యేవిధము చేనైన వజ్రనాభుని యనుమతి వడసి నిన్నా ప్రభావతీకన్య కేళికాభవనంబునఁ బ్రవేశపెట్టెదను. పిమ్మట నీ వచ్చోట,—

మ. చోరవ న్నిశ్చలతన్మలంగి సమయస్ఫూర్తి న్వచోనైపుణిన్
వరలం గాంచె దభీష్టసిద్ధిఁ దమిచే వర్తింప నీకోర్కె నే
నెరపన్ జాలను వజ్రనాభుఁ డనుమానింపన్ జెడున్ నిల్వ దు
ర్భరమై నీకుఁ బ్రభావతీసతికి రంభాకంటకన్యాయమౌ.

(అని పైకిజూచి) అదిగో బృందారకులిపు డెద్దియోఁ బలుకుచున్నారు వినుము.

(అంత తెఱలో)

సీ. అతివృద్ధుడై సూర్యు | డస్తాద్రికేతెంచె
వరిపొలాలు పసిండి | వన్నెఁ గ్రాల
కలకలంబులఁ బక్షి | కులములు తమతమ
గూళ్లఁ జేరుచునుండె | గోగణంబు
మరలి యిండ్లకుఁ బోవుఁ | దఱిపిదూడలు కొన్ని
సొరిది ఱంకెలు వైచు | చును జనంగఁ
పాటలు పాడుచుఁ | బాలికాపులు పొలం
బులనుండి తమగృహం | బులకు నేగఁ

గీ. బాలశాలల బాలకు | ల్పరువులిడుచు
నలరి కిలకిలనవ్వుచు | నరుగుచుండ్రి
రాగముప్పొంగ జనులు స | రాగులగుచుఁ
దమిని వెడలంగఁ దగు నిశాం | తంబులకును.

శుచి—ప్రద్యుమ్నకుమారా! వింటివా బృందారకులపలుకులు. దినాంతంబగుటచేఁ జిమ్మచీఁకటులు కాఱుక్రమ్మకుండ మనము పయనమగుట మేలు. రమ్ము.

ప్రద్యు—మంచిది. అటులనేవచ్చెదను. కాని, శుచిముఖీ! అతికఠినమైన నిబంధన విధించితివి. ఎట్లోగదా.

మ. అలినీలాలక మోవితేనియ జడిన్ | హాసాంకురజ్యోత్స్నఁ దృ
గ్లలితాఘుల్కలవాక్పికాళి ముఖ రా | కాచంద్రబింబంబు ను
జ్జ్వలలావణ్యజలాశయంబుఁ గనుపిం | పన్ నిర్వికారుండనై
నిలువన్ జాలుదునే తమిన్గొనక త | న్వీ! యేగతిన్ బ్రోచెదో.

శుచి—(తనలో) కానిమ్ము చూతము. అప్పటి కెద్దియైన నొకయుపాయము తోచకుండునా. (ప్రకాశముగా) ప్రద్యుమ్నకుమారా! నీవు మనంబుఁ జిక్కఁబట్టియే ప్రవర్తింపవలయుఁ జుమీ. లేకున్న నా ప్రయత్నమంతయు విఫలంబు కాఁగలదు. వజ్రనాభుం డిపుడే కిన్నరుల నిర్జించివచ్చి వజ్రపురంబున గొలువుఁ దీర్చియున్నాఁడు. పోవుదము రమ్ము. (అని యిరువురు నిష్క్రమించుచున్నారు.)

గద్య.

ఇది శ్రీమద్వేంకటరమణ కరుణాకటాక్ష వీక్షణాసార సమాసాదిత
రసబంధురకవిత్వవైఖరీప్రవీణాపస్తంబసూత్ర శాండిల్యస
గోత్రపవిత్ర హోతృకులకలశార్ణవశాకాకైరవమిత్ర వేం
కటరత్నసుపుత్ర వేంకమాంబాగర్భశుక్తిముక్తాఫల
వివిధవిద్వజ్జనవిధేయ వేంకటకృష్ణనామధేయ
ప్రణీతంబైన ప్రభావతీప్రద్యుమ్నంబను

నా ట క రా జ ం బు న

చతుర్థాంకము.

శ్రీరస్తు.

హయగ్రీవాయనమః.

ప్రభావతీప్రద్యుమ్నము.

పంచమాంకము.

రంగము: వజ్రపురమునంగలసభామంటపము.

[రోమంథన తామ్రాక్ష కఠోరదంష్ట్రులతో వజ్రనాభుఁడు కొలువుకూటముఁ బ్రవేశించును.]

వజ్ర—అరే ఆప్తవర్గంబులారా!

ఉత్సాహ. మఱియుచుండుకిన్నరప్రకోభుండుశరణుఁజొచ్చె సం
గరమునందు నాదు దోర్యుగప్రతాపవహ్ని దు
ర్భరముఁగాఁగ నోడి యింక వరుణుఁడున్ గుబేరుఁడున్
బరమవైరియాయముండుఁ బదములంబడన్వలెన్.

ఈ విజయంబు నా కుమారీమణియగు ప్రభావతి కెఱింగింపవలయును.

(అంత తెరలో)

మ. చలమే చిత్రగతి న్మనోహరవిలా సస్ఫూర్తిరంజిల్లి నె
చ్చెలి! మాటాడవిదేమె స్వప్నఫలముం జింతించి విభ్రాంతవై
కలఁతన్మూర్ఛిలితే ప్రభావతి! మెయిన్ గల్గెన్జ్వరం బోమహా
ఫలసంధాయకులార! వైద్యునిటకున్ బంపన్ గటాక్షింపుఁడీ.

వజ్ర—(ఆలకించి వెఱగందుచు) ఆ! ఎక్కడనుండి యీ కలకలము.

రోమం—ఆఁ! దేవా! ఆకలకలం బంతఃపుర సౌధాంతరంబునుండియే వినవచ్చుచుండె.

తామ్రా—ఆఁ! దేవా! దేవరవారి కుమారీమణి జ్వరాతిశయంబుచే మాటాడకుండెనట.

కఠో—ఆఁ! దేవా! దేవరవారాజ్ఞనొసంగినచో నిప్పుడే దాసుండగు ధన్వంతరి నీడ్చి
కొనివచ్చెదను.

వజ్ర—అరే మంత్రులారా! నే నిప్పుడే యంతికంబున కేగి నాపుత్రికారత్నం బెట్టిస్థితిలో నుండెనో స్వయముగఁ దెలిసికొనివచ్చెదను. మీ రీపురంబునఁ దగువైద్యుల నరయుఁడు. (అని యంతఃపురంబునుగూర్చి నిష్క్రమించుచున్నాఁడు.)

రోమం—ఆఁ! సహమంత్రివతంసములారా! మనముకూడఁ జని యేలికయాజ్ఞాప్రకారము జరిగించివత్తము రండు. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

తామ్ర—ఆఁ! ప్రభావతీరమణికి దేహారోగ్యము కలిగెనేని దురాత్ములగు యమ వరుణ కుబేరులు నిర్జింపఁబడినవారే. కఠోరదంష్ట్రీ! వైద్యాన్వేషణార్థమై పోవుదము రమ్ము. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

కఠో—(ఇటునటుఁజూచి) ఆఁ! దేవతాసంబంధినియైన దాసి శుచిముఖి యీలాగువచ్చుచున్న దేమిచెప్పుమా. అంతఃపురవర్తమానములు మాహారాజుగారికి నివేదించుటకుఁ గాఁబోలు.

[అంతె శుచిముఖి ప్రవేశించి]

శుచి—ఓహో కఠోరదంష్ట్రీ! ఈ మనవజ్రపురంబున గుఱుతుగ నెఱుకఁ జెప్పగల నెఱుకత నెందున్నను గొనిరావలసినదని వజ్రనాభమహారాజుగారి సెలవైనది. కావునఁ దత్కార్యనిర్వహణార్థమై నీవు వేవేగఁ జనవలయును. తడవైనచో మన ప్రభావతీకన్యకకుఁ గీడువాటిల్లుఁజుమీ.

కఠో—ఆఁ! నే నిప్పుడే జని రాజాజ్ఞ నెరవేర్చెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు)

శుచి—(స్వగతము) నే ననుకున్నటుల నా యభిప్రాయం బెఱుంగజాలక వజ్రనాభుఁడు విరహ పరవశయై మూర్ఛఁ జెందియున్న నిజకుమారీమణి నిశ్చయముగ రోగపీడిత యయ్యెనని తలంచియే శుద్ధాంతంబున కేగియుండె. అనంతరకర్తవ్య మాచరింపఁ దడవయ్యెనేని యాలేమ ప్రమాదవశంబునఁ బ్రద్యుమ్నకుమారుంగూర్చి యేమేమి పల్వరించునో. ఆ కన్యామణి నిశ్చయావస్థ వజ్రనాభుం డెఱింగినచో నా ప్రయత్నం బంతయు విఫలం బగుటయేఁగాక ప్రభావతీకన్య కేమి యుపద్రవము తటస్థించునో. కావున నే నిపుడే యెఱుకతవేషమును ధరించి కఠోరదంష్ట్రినితో నంతికంబున కేగి నా నేర్పుచే వజ్రనాభుని యనుజ్ఞఁగొని గురుకైతవంబునఁ బ్రద్యుమ్నకుమారు నంతిపురంబునకు రప్పించెదను. అనంతరకర్తవ్య మప్పుడే యాలోచింపవచ్చును. (అని నిష్క్రమించుచున్నది.)

[అంత నంతఃపురమందు శయ్యాతలంబున మూర్ఛిల్లియున్న ప్రభావతికిఁ జెంత రాగవల్లరికైత్యోపచారము లొనరించుచుండ వజ్రనాభుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

రాగ—(వజ్రనాభునిఁజూచి వ్రీడాభయంబులు మనంబునఁ బెనంగొన లేచి నిలువంబడి) సఖీ! ప్రభావతీ! నిన్నుఁ జూడగోరి మహారాజుగారు వచ్చియున్నారు. లేచి కూర్చుని మాట్లాడుము.

వజ్ర—(సెజ్జపజ్జఁగూర్చుండి) ఆఁ! బిడ్డా! పలుకవేమి? (అని తనలో) ఆఁ! ఏమిది! నాప్రియకుమారీమణి గాఢమైనజ్వరంబుచే మైమఱచి పిలిచినను మాటాడకున్నాఁది. కుసుమకోమలియైన నా చిన్నారిముద్దుకూఁతు రీదారుణజ్వరంబున కెట్లోర్చు. ఆఁ! కుమారీ!

ఉ. వాలును కేలఁబూను బలవంతుఁడ నేనని స్వర్గమర్త్యపా
తాళనివాసులందఱు సదా మది నన్నుఁ దలంచి భీతిచే
మూలలడాగియుందు రిటు మూర్ఛమునింగితి వేల నేనువా
హ్యాళినెసంగ వ్యాధిగణ మంతమునొందదె యో ప్రభావతీ.

ఆఁ! నా ప్రియతనూజారత్న మింకను మాట్లాడకున్నయది. ఏమిది!

ప్రభా—(మూర్ఛ తెలిసి కన్నులు తెఱచి వజ్రనాభునిఁజూచి భయవిహ్వలయై దిగ్గనలేచి కూర్చొనుచున్నది-)

(అంత కఠోరదంష్ట్రుఁడు ప్రవేశించి)

కఠో—ఆఁ! దేవా! దేవరహజారము చెంగటికి.

చ. తిరుగుచు నల్లపూసలును తెల్లనిపూసలు సంకుపూసలున్
గుఱుతుఁగ దాల్చిమైతొడవుఁ గోలను కేలనమర్చి పుట్టికన్
శిరమునఁదాల్చి మేత్తెలియఁ జెప్పెదరండని గిల్కరించు నా
యెఱుకలసానివచ్చె నసురేశ్వర! తోడ్కొని రా ననుజ్ఞయే?

వజ్ర—ఆఁ! కఠోరదంష్ట్రా! ఆ యెఱుకలసానిని శీఘ్రముఁగఁ దోడ్కొనిరమ్ము.

కఠో—చిత్తము. (అని నిష్క్రమించి వెంటనే యెఱుకతయైన శుచిముఖితోఁ దిరుగ ప్రవేశించుచున్నాఁడు.)

వజ్ర—ఆఁ! ఎఱుకలసానీ! నాముద్దులగున్న యవస్థ యెట్టిదియో వచింపుము.

శుచి—చిత్తము. (అని ప్రభావతిని సమీపించి.)

ద్విపద—సౌరాష్ట్రరాగము.

రావేయవ్వమా రాజవేయవ్వ
భావంబురంజిల్ల బలుకుదునవ్వ

నాసుద్దువినినంత కొ నయమహా నెయవ్వ
వేసటఁజెందు నీ కొ విధమిప్పు డవ్వ
మలయాలబగవతి కొ మరువ కేయవ్వ
కలుములఁబెంపొందఁ కొ గాంచె దేయవ్వ

అవ్వా! నీచే మొక్క సారెచూడనిమ్ము. (ఆలిప్రభావతికరంబుఁ బట్టుకొని).

అవ్వో యవ్వ! బాగ్గెం కొ గల సెయ్యి
మవ్వంపుకీ_ర్తిసం కొ పదగల సెయ్యి
దానదరమంబులఁ కొ దనరారు సెయ్యి
దీనులరచ్చింప కొ తెగువైన సెయ్యి
పాడిపంటలుగలిగి కొ బాసిలు సెయ్యి
కోడెగానినిఁగూడి కొ కులికెడు సెయ్యి
సౌబాగ్గెమునమించు కొ సరసంపు సెయ్యి
సుబరేకలనుగల్గి కొ సొంపొందు సెయ్యి
సుట్టాలసురబియై కొసోబిలు సెయ్యి
పుట్టుబోగంబుల కొ బొలుపొందు సెయ్యి
దేసదేసములప కొ తిట్టగను సెయ్యి
ఆసలీడేరంగ కొ నలరారు సెయ్యి
దట్టంపుసిగ్గుల కొ సేతను వెల్గు సెయ్యి
పట్టితి మేలొందు కొ బంగారు సెయ్యి.

అవ్వోయవ్వా! మేలుసూపు సూసుకొనుసున్నావు. మేలుకోరిక కోరుసున్నావు. అది కాయో పండో కల్లో నిజమో అవునో కాదో సేకూరునో సేకూరదో అని వెనుకకు ముందుకు త్రొక్కుడుబడుసున్నావేయవ్వా! అది కాయకాదుపండు. కల్లగాదు నిజము. అది సేకూరునా సేకూరదా అంటే పుసపంబునకు తావి సేకూరదే యవ్వా! అయితే మేలు కోరికలకిగినాలు మెండేయవ్వా! అవ్వోయవ్వ! నీతలంపు నాకు పొడగట్టినది. అది మగవారి వంకతలంపా ఆడవారివంక తలంపా అంటే అదిగో మగవారంటే గడ్డంబు ఆడవారంటే లక్కాకు. అదిగో గడ్డంపు పిసాన మేనిన్ని పు డావహించి సిక్కులు పెట్టుసుండనే యవ్వా! దానివలన గలుగు బాదదొలగింప గోరుసుంటివే యవ్వా! అకోరికె

ప్పటికి నెరవేరునంటే ఒకటే రెండే మూడే ఒకటంటే ఒకయేడుకాదు రెండంటే రెండేండ్లుకావు మూడంటేమూడేండ్లుకావు నీతండ్రిగారి సెలవయ్యే నేని యిదిగో యింతలోనే నేకూరు నేయవ్వా! ఆపోతుగాలి యీదచ్చిన పఛ్చిమమూలనుండి వచ్చే నేయవ్వా! అది మాగడ్డపిసాస మేయవ్వా! దానిచే గలుగుబాద నేదొలఁగింపఁ జాలనేయవ్వా! ఈపురంబునకు దచ్చినబాగమందేయవ్వా! నాగురువుండె నేయవ్వా! నీతండ్రిగారి సెలవైతేయవ్వా! వానినిప్పుడే తోడ్కొనివచ్చెద నేయవ్వా! అప్పుడు నీబాదలుతీరు నేయవ్వా! నీతలంపులు సాగు నేయవ్వా! నీకోరిక లీడేరు నేయవ్వా! నీరొట్టె నేతబడు నేయవ్వా! నామాటనిజ మేయవ్వా! వినుము నాబుట్టతోడేయవ్వా! అప్పుడు నన్నుమెచ్చేవేయవ్వా! కోరికలిచ్చేవేయవ్వా!

అమ్మవారమ్మ వారమ్మవారూ జగదమ్మ జగదమ్మ జగదమ్మ
మలయాలబగవతీమాంకాలిచండికాదుర గామహాదేవియోయాదిసత్తి
గైరమ్మబైరవీ కాత్యాయనీదేవి మాతంగకన్యా యుమా యర్ధనారీ
తోడునీడై మాకు దోడ్పడియీామె కోరెడుకోరిక ల్కొనసాగఁజేసి
నాపల్కుదబ్బర కాకుండసేయ సేరిమొక్కెదనమ్మ చిన్నినియిల్లాలా॥అ॥

ప్రభా—(ప్రసన్నవదనయై తండ్రిని వీక్షించి) జనకా! ఈ యెఱుకలసాని పలుకులచే నామనోవ్యాధి నివారించునని యాసవొడముచున్నది. కావున మీ రామెగురువు నిచ్చోటకు రప్పింప నాజ్ఞ నొసంగ వేడెదను.

వజ్ర—ఆఁ! బిడ్డా! మంచిది. (అని యెఱుకలసానితో) ఆఁ! ఎఱుకలసానీ! నాముద్దులపట్టి వ్యాధి నీ గురువు నివారింపఁగలఁడను ధైర్యము నీ కున్నచో వానిని శీఘ్రంబుగ నెందున్నను దోడ్కొనిరమ్ము. అటఁ డీయంతిపురంబునకు వచ్చినపిదప నా బిడ్డ వ్యాధి నివారింపలేనిచో వానికిని నీకును హానిఘటిల్లునని నిశ్చయించుకొనుము. పొమ్ము.

శుచి—చిత్తము. (అని నిష్క్రమించుచున్నది.)

వజ్ర—ఆఁ! పట్టీ! ప్రభావతీ! నీ కిట్టివ్యాధి కలుగుటకుఁ గారణమేమొ దెల్పుము.

చ. అమరులఁ స్రుక్కఁజేసి యమరాధిపుఁజీచనుడంచి వానినా
కముఁగొని కిన్నరేశ్వరుని గర్వముసర్వము డుల్చివచ్చితిన్
భ్రమదముఁజెందకుండఁగఁ బ్రభావతి చింతిలనేల? నీదు డెంద
మునను గల్గుకోరిక ముదంబునఁ జెప్పగదమ్మ తీర్చెదన్.

ప్రభా—తండ్రీ! నా కేమియు తెలియదు.

వజ్ర—ఆఁ! చేటీ! నీ వేమైన మూలము గని పెట్టఁగలిగితివా?

రాగ—దేవా! ఎట్టిపైత్యవ్యాధిచేతనో గాని యీ మా నెచ్చెలి, కతిపయదివసంబులనుండి రేయుంబవలులు నిద్రాహారంబుల నుజ్జగించి విపులజ్వరంబుచే మైమఱచి పల్వరించుచున్నయది. ఆకారణంబుచే యీమె కెద్దియో గాలి సోకెననియే తలంచితిని. అయిన శుచిముఖినిఁ దోడ్కొనివచ్చెదను. (అని నిష్క్రమించుచున్నది.)

[అంత శుచిముఖి కైతవభూతవైద్యుండగు ప్రద్యుమ్నునితోఁ బ్రవేశించుచున్నది.]

వజ్ర—(ప్రద్యుమ్నునిఁ జూచి) ఆఁ! భూతవైద్యుఁడా! నీకు భూతవైద్యమునందు పరిశ్రమకలదా?

ప్రద్యు—దానవేంద్రా! సందేహమేమి? వినుము.

శా. భూతప్రేతపిశాచసంఘములనే నుచ్చాటనంజేసెదన్
ఖ్యాతింజెందెద మంత్రసిద్ధి వినుమింక న్నీకుమారీమణిన్
జేతఃప్రీతిఘటించి సౌఖ్యముల రంజింతున్ మదర్థంబు ని
ర్భీతిన్గైకొనఁగల్గెదన్ నినుగృతార్థున్ జేసెదన్నేర్పునన్.

ఇంత యేల నా సామర్థ్య మెఱింగించెదవినుము.

సీ. దేహజాడ్యంబైన నౌషధివ్యాపథంబులఁ
బాయక దానిఁబాపంగనేర్తు
పీడసోకినఁగాంచి వేవేగమంత్రతం
త్రములనాబాధఁదొలఁగనేర్తు
మతిసంచలించిన మానకఁదగు చికి
త్సల దానిబాగుగా నలుపనేర్తు
విరహాబ్ధిమగ్నయై వెతలఁజెందుచునున్న
దవిలినాథునిఁదెచ్చి దనుపనేర్తు.

గీ. గాక యింకెట్టికతమునఁ గలికి! వగల
బెగిలి నవయుచునున్న నాబింక మొప్పఁ
దగు నుపాయంబు ఘటియించి తన్నివృత్తిఁ
జేసి నిన్నుఁ గృతార్థుఁగాఁ జేయనేర్తు.

వజ్ర—ఆఁ! భూతవైద్యుఁడా! నీ ప్రగల్భోక్తులుచూడ "మంత్రము తక్కువఁతుంపర లెక్కువ" అన్నటులఁ జేయుదువేమో యని తోఁచుచున్నది. నిక్కువంబుఁగ నీకు భూతవైద్యమునందుఁ బరిశ్రమయుఁ గౌశలముఁ గలిగినచో మాప్రభావతి నాడిపరీక్షించి యామె నెంతకాలములో నారోగ్యస్థితిలోకిఁ దీసికొని రాఁ గలిగెదవో వచింపుము.

ప్రద్యు—దానవాగ్రణీ! నాపలుకులు వట్టి ప్రల్లదంబులుగానే భావించితివా?

సీ. నేర్పు లేకున్నచో నేనిటువత్తునే
బెల్లమే కద ప్రాణ మెల్లరకును
చిత్రగతినిఁ గన్య చిత్తసంగతిఁ గాంచి
భ్రాంతినిఁ జెంది భావమునఁ గుంది
మదభీష్టవిషయసం పదఁ గోరి వనసీమఁ
జరియించి నైపుణి సంగ్రహించి
ప్రప్రభావతిదుర వస్థ నీ యెఱుకత
తెలుప నీయనుమతి కలిగెఁ గాన,

గీ. కలికి నలరింప నెమ్మదిఁ దలఁచి యిటకు
వచ్చితినిఁ బ్రల్లదంబులు వలుకనగునె
వినుము, "ముంజేతికంకణంబునకు నద్ద
మేలని?" నాశక్తి నీవింక యెఱుఁగఁగలవు.

వజ్ర—మంచిది. నీ ప్రజ్ఞ యెట్టిదియో చూతముగాక.

ప్రభా—(తనలో) ఈ భిషక్తల్లజునిమాటలు భావగర్భితములుగా నున్నయవి.

ఉ. మామకచిత్తసంగతి నమానుష చిత్రగతిన్ గ్రహించి యు
ద్దామవనంబున న్నిపుణతన్గొని వచ్చితినంచు ద్వ్యర్థిగా
నీమహనీయుఁడిచ్చోడ వచించెడు నిశ్చితభావమేమొకో
తామరసాక్షుఁడీ భిషజతల్లజుఁ డెవ్వరో తోఁచ రాదహో.

శచి—(తనలో) ఈతండు తమిమీరి సంభాషించుచున్నాఁడు! ఏమి యుపద్రవము తటస్థించునో కదా?

ప్రద్యు—రాక్షసరాజవతంసమా!

గీ. పలుపలుకులేల నాదు నేర్పరితనంబుఁ
దెలియుఁ ద్వరలోన నీకూఁతుకే నలరఁ జేయఁ
గలుగఁ దత్సౌఖ్య సంగతికేవలనఁ గోర్కె
సఫలమౌనాకు వినుమునిశ్చయముగాను.

వజ్ర—ఆఁ! ఏది! నా కుమారీమణి నాడిఁ బరీక్షించి తగిన చికిత్స యొనరింపుము. చూతము.

ప్రద్యు—ఏమిదైత్యేంద్రా! ఇంకను సందేహించుచునే యుంటివా. నాడిఁ బరీక్షించుట కు గరగ్రణముఁజేసి యూరకొందు ననుకొంటివా?

చ. ఉరగముఖాంతరస్థమగునుగ్రపుఁ గోఱలఁ బట్టవచ్చు మే
దురబడబానలంబయినఁదోరముఁగాఁ గబళింపవచ్చు భీ
కరమగువ్యాఘ్రదంష్ట్రలనుగ్గైకొనవచ్చును దైత్యకన్యకా
కరముఁగ్రహించి యూరకొనఁగావశమే రజనీచరాగ్రణీ.

వజ్ర—(అలుకగదుర) ఆఁ! మూర్ఖా! ఊరకొనక యేమిచేసెదవురా?

ప్రద్యు—నేఁ జేయునదివినుము.

క. పైత్యజ్వరపీడిత యీ
యత్యంతమనోహరాంగికభిమతలీలన్
నిత్యసుఖయోగ ఫలమిడి
ప్రత్యర్థిగ నేఁగృతార్థపరిణతిఁ గాంతున్.

(అని ప్రభావతిని సమీపించుచున్నాఁడు.)

ప్రభా—(తనలో) ఏమి! వీనిమాటలు మిగుల భావగర్భితములుగా నున్నయవి. ఈపురుషు నిఁజూడ నామనం బేలనోగాని యుత్కలికఁ జలింపుచున్నది. వీని సాహసంబుఁ జూడ నేమియుపద్రవము తటస్థించునో యని భయముకలుగుచున్నది. ఏమిచేయుదును - (అని యొకకేలఁ గురులను బ్రద్యుమ్నునకుఁ జూపుచు శుచిముఖినిఁ దిలకించుచున్నది.)

శుచి—(తనలో) నే నింక యనంతరకర్తవ్య మాచరింపఁ ద్వరపడవలయును.

(అని నిష్క్రమించుచున్నది.)

వజ్ర—ఆఁ! వైద్యుఁడా! ఇంక నీ విస్రంభవాచాలతఁ గట్టిపెట్టి కర్తవ్యమాచరింపుము.

ప్రద్యు—అటులైనచో నీ కుమారీమణి నాడి పరీక్షించుటకై,—

చ. కరముఁ గ్రహించెదన్ ఫలముఁ గాంచెదఁ జిత్రగతిన్ మెలంగి యీ
సరణి నెఱింగెదన్ గలికి సంగతి సంతసమందఁ గల్గెదన్
గురుతరభోగభాగ్యములకుం గుఱిఁ జేసెదఁ గన్యమానసం
బెఱిఁగి చికిత్సలందనిపి యీప్సిత సిద్ధి నొసంగ నాజ్ఞయే?

వజ్ర—ఆఁ! భైషజ్యప్రగల్భ! నా కుమారీమణి కరముఁ గ్రహించి నాడిఁ బరిశీలించి తగు చికిత్సలవలన శీఘ్రముంబ సౌఖ్యముఁ గలుగఁ జేసితివేని గొప్ప బహుమానమునే పొందెదవు.

ప్రభా—(తనలో) హృదయమా! సంభ్రమింపకుము. ఆశలారా! తాళుఁడు

ప్రద్యు—మంచిది. (అని ప్రభావతిని సమీపించి) ఓ దైత్యరాజ గృహాలంకార చూడామణి!

ఉ. చిత్రపు బెత్తెలంబడిన చేప యుఁ జిక్కునటంచు పల్లెవాఁ
డాత్రముతోఁ జనుంగద రయంబున వచ్చితి నేన వైద్యుఁడన్
జిత్రగతిన్ జ్వరంపుటురిఁ జిక్కుఁగఁ జేసిన నాడెఱుంగు నేఁ
బాత్రుఁడనంచుఁ దోఁచినఁ బ్రభావతి! నీదు కరంబొసంగుమా.

(అని ప్రభావతీపాణిగ్రహణంబునకై గమకించుచున్నాఁడు.)

(అంత తెఱలో)

హాహా! సద్గురూ! హా కరుణార్ద్రహృదయులారా! రక్షింపుఁడు. రక్షింపుఁడు. అయ్యో! ఈ రాక్షసకులంబున కెట్టి యుపద్రవము సంభవించునో కదా? చచ్చితిని. చచ్చితిని.

మ. ముదిముత్తైదువటంచు నెంచక ననున్ మూర్ఖాత్ముఁడై వీఁడు చం
పఁదలం పూని గళంబుఁ బట్టె నిదె యో సద్బంధులారా! భయా
స్పదమై యుయ్యెడు దీనురాలిని గృపన్ భావించి రక్షింపరే
యదనై రాక్షస వంశనాశనము కానై యుండెనే హా విధీ.

వజ్ర—(ఆలకించి మహోగ్రకోపావేశపరవశుండై లేచి) ఆఁ! రాక్షసవంశమునుఁ దలపెట్టు దురాత్ముఁ డెవఁడురా? (అని విజృంభించుచున్నాఁడు.)

ప్రద్యు—(కోపోదగ్రుండై) ఏమేమీ! నిరపరాధినియైన నా శిష్యురాలి నెఱుకలసానిని నిష్కారణము బట్టి హింసింపుచున్న ఖలుఁ డెవ్వఁడురా! ఓరోరి దుర్మదాంధా! ఇదిగో నా మంత్రంబుచే నిప్పుడే నిర్ధూమధామంబుఁ జేసెదను చూడుము.
(అని నిష్క్రమించుచున్నాఁడు.)

ప్రభా—(సంభ్రమించుచు దీనవదనయై తనలో) అయ్యో! ఇది యేమియుపద్రవమోకదా.
(ప్రకాశముగా) హా! ప్రియసఖీ! రాగవల్లరీ! (అని మూర్ఛిల్లుచున్నది.)

రాగ—(ప్రవేశించి) చెలీ! ప్రభావతీ! అయ్యో! మరల మూర్ఛిల్లితివే ప్రియసఖీ!

వజ్ర—ఆఁ! చెలీ! నీవు చెంతఁగూర్చుండి సముచితచికిత్సల నాపట్టి తెలివొందునటులఁ జేయఁ బ్రయత్నింపుచుండుము. నే నిప్పుడే చని రాక్షసవంశమును దలపెట్టిన ముది ముత్తైదువను నా మేను రక్షింపఁ గడంగిపోయిన వైద్యుని శిక్షించివచ్చెదను. అరే! వైద్యుఁడా! ఎవఁడవురా నీవు. నిలువుము. నిలువుము. (అని కత్తిఝుళిపించుచు నిష్క్రమించుచున్నాఁడు.)

ప్రభా—(మూర్ఛ తెలిసిలేచి) చెలీ! రాగవల్లరీ! నా జనకుం డెటకేగెనో యెఱుంగుదువే?

రాగ—ప్రియసఖీ! నీతండ్రిగారు వైద్యునిపోకడ లరసిరాఁ జనియుండిరి. భయపడకుము వా రిప్పుడే మరలివచ్చెదరు.

ప్రభా—చెలీ! ఇప్పు డేమియుపద్రవము సంభవించునోయని నాకు భయముకలుగుచున్న దే. మఱియు.

గీ. తండ్రిదగ్గఱనుంటఁ జిత్తమునగలుగు
కోర్కె వైద్యునితోఁ జెప్పి కొనఁగలేక
కలికి! చెయికాలినంత నాకులకుఁ దడవి
కొనినగతి వ్యర్థతనుజెంది కుందుచుంటి.

ప్రియసఖీ! ఆ భిషక్తల్లజుఁడు మరల వచ్చునటే? శుచిముఖివచ్చెనా?

రాగ—భయపడకుము. (అని యటునిటుజూచి) సఖీ! ప్రభావతీ! అదిగో! మన నెచ్చెలియగు శుచిముఖి యాదిక్కునఁ బోవుచున్నయది. (అని యంగుళిచేఁ జూపుచు) వైద్యు నరయుటకే కాఁబోలు.

ప్రభా—సఖీ! నామనం బిపుడేలనోగాని దామరాకుపై నీటిబిందువువలెఁ దల్లడిల్లుచుండెనే.

అకటా! ఏమనిచెప్పుదును.

ఉ. చానరో! యొక్క దీర్ఘకుజశాఖనుఁ బ్రేలు ఫలంబుఁగోరు నా
మానసపక్షిరాజ మను మానము నా నురిఁజిక్కియుండి లో
నూనినవేడ్కఁ బైకెగయ నోపకఁ గొట్టుకొనంగఁజాగె నే
దేనియుపాయము న్నెఱప వేవిడనాయురి రాగవల్లరీ.

రాగ—చెలీ! నీ మనః కీర మపేక్షించు ఫల మెద్దియోం దెల్పుము. పిమ్మటం దత్ఫలావాప్తికై తగిన వెఱవు నాలోచింపవచ్చును.

ప్రభా—ఇప్పు డేమోగాని నామనంబు కలతం జెందియున్నది. ప్రియసఖీ! నీవు వేవేగ. జని శుచిముఖి నెందున్నను దోడ్కొనిరమ్ము.

రాగ—మంచిది. (అని నిష్క్రమించుచున్నది).

ప్రభా—(స్వగతము) ఎఱుకలదానివిధముంజూడ నా కనుమానము కలుగుచున్నది. పూర్వపరిచితవలె నా హృదయమునంగల తెఱంగంతయుం బూసగ్రుచ్చినట్లు వక్కాణింపంగలిగె. ఆలేమ నామేలు కోరి కపటకిరాతవేషంబున వచ్చిన భవానియో లేక నిజమైనయెఱుకతయో తెలియరాదు. వజ్రపురేతరనివాసిను లెవ్వరైనం గపటోపాయంబున వచ్చియుండిరేమో యని యనుకొందుమన్న నా తండ్రిగారి యనుమతిలేకుండ నొరు లెవ్వరు నా హర్మ్యతలంబునకు రాంగలుగుదురు? ఆయెఱుకత వజ్రపురనివాసినియో కాక మదీయాంతఃపురసంచారిణియైన కపటనటనావిదగ్ధయో కావలయు. వజ్రపురనివాసినియే యనుటకు మేలుచూపిన చిత్రపటసందర్శనంబుచే మరులుగొని మేలుకోరికం గోరితినని యెట్లెఱింగె? ఆమగువ భూతభవిష్యద్వర్తమానకాలసంవేదినియుం గామరూపిణియు నన్మనోరథసంవేదినియు మదీయాంతఃపురసంచారిణియు గపటనటనావిదగ్ధయు నగు శుచిముఖియే కావలయు.మరియు నాచతురిక తనతోడం గొనివచ్చిన పురుషుం డెవ్వరైయుండునో తెలియరాకున్నయది. వాని మనోహరరూపము దేవీదత్తంబైన చిత్రఫలకాంతర్గతాకారంబున కనురూపంబుగ నుండుటయేగాక వానిమాటలును భావగర్భితములుగానే యున్నయవి. ఓహో ! ఏమి యీచిత్రము.

మ. చెలిమిన్ జిత్రపుటెత్తెలంబడిన యీ శ్రీచేపన్గొనన్ రమ్మటం
చలరన్ వ్రాసినలేఖ దానెఱిగి నన్ట్లాకాంతుఁ "నేవచ్చితిన్
గలికిన్ జిత్రగతిన్ జ్వరంపుటురిఁ జిక్కించేయునానాడి రం
జిలంగాంజూతునటంచుఁ గైఁగొనంగ నెంచెన్ వైద్యుఁడెవ్వాఁడొకో.

అదియునుంగాక వైద్యక్రియాకైతవుండగు నా మహాపురుషుని మనోహరరూపరేఖావిలాసంబులు చూడ నాతం డభినవమన్మథుం డేమోయని యనుమానము కలుగుచున్నది. ఏమన.

మ. స్మితవక్త్రుండపుడు వైద్యవేషమున నాచిత్తంబెలర్పంగ నా

గతి మైఁదాల్చి విభూతి మారుఁడె శరత్కాలాంబు దాచ్ఛాదిత
స్థితిభాసిల్లెడు మేనమామగుణముల్ సిద్ధింపవే ప్ర-ప్ర-భా
వతి యంచు న్ననుఁ బల్కఁ దొట్రువడఁ బెల్వన్ జాగె నాశ్చర్యమా.

(అని సోత్కంఠయై) హృదయమా! సంభ్రమింపకుము.

ఉ. సుందర చిత్రసంగత విశుద్ధ మనోహర రూపపుష్ప ని
ష్యందమరందతుందిలవిహారసముత్సుకనంచు మానసేం
దిందిర! దుర్గమంబగు సుదీర్ఘపు జాలము నందు జిక్కినీ
వందగరాని సూనరసమానఁగఁగోరి తపించె దేల నే?

(అని నిట్టూర్పువిడిచి) ఏమిచెప్పుదు! నామనం బిప్పు డేలనో గాని పరిపరివిధంబులఁ గలగుండు పడుచున్నయది. (అని యటునిటుఁజూచి సంతోషముతో) అదిగో! నా చెలికత్తియలగు శుచిముఖియు రాగవల్లరియు వచ్చుచున్నారు.

(అంత శుచిముఖియు రాగవల్లరియుఁ బ్రవేశింతురు.)

శుచి—(నవ్వుచు) సఖీ! ప్రభావతీ! నీ చాతుర్య మెంతయైనఁ గొనియాడవచ్చునే!

చ. తెలిసెను లే ప్రభావతి! త్వదీయచమత్కృతి నన్ను నిర్దయన్
దలఁగఁగఁ జేసి నీ వెఱుకతన్ బిలిపించి మనోనిదానవా
ర్తలువిని తద్గురూత్తముని రా నొనరించితి వంట యాతఁడు
జ్వాలుఁడఁట చెప్ప వెంత నెఱజాణవె నేనెఱుఁగంగ లేనటే.

మఱియు:

చ. గురుతరకాననాంతర నికుంజ మహీరుహ వారిరాశి దు
స్తరగిరి గహ్వరంబులను దాటుచు వజ్రపురంబులోన ని
న్నరియుచుఁ జేరవచ్చి ఫల మున్గొనవచ్చునటంచుఁ బ్రీతి నీ
కరమున వ్రాలనెంచిన శుకం బెటకేగనె యోసఖీమణీ.

ప్రభా—(శంకాసంకులితచిత్తయై వెఱఁగందుచు) సఖీ! శుచిముఖీ! నీమాటలు నాకేమియు నర్థముగాకున్నయవి. నిర్దోషినైన న న్నేలఁ బరిహసించెదవు?

రాగ—ప్రియసఖీ! ప్రభావతీ! ఆ కీరము నే గాఁబోలు మన కేళీోద్యానవనాంతరంబున వెదకుచుండిన యీ శుచిముఖిని గని నీచెంతకుఁ దోడ్కొనివచ్చితిని.

శుచి—చెలీ! ప్రభావతీ! మేలుకువతో నిద్రఁబోవువారి లేప నెవరితరంబగు?

ప్రభా—సఖీ! ఏల నాపై నిర్హేతుకంబుగ దోషారోపణఁ జేసెదవు?

చ. వరరుచిరంపు చిత్రగత వైఖరి దాహముజెందు నన్నుఁ డ
గ్గరుట రసంబుఁగ్రైకొనెడు కల్మిఘటించు నటన్నభ్రాంతిచేఁ
దెరలక నామనంబు మృగతృష్ణ జలంబనుభ్రాంతిఁ జిక్కి నా
హరిణముపోల్కె నెంతయును వ్యర్థతఁగుందుచు నుండెనక్కటా.

మఱియు.

ఉ. ఆరయఁ జిత్రలీలలఁ గుజాగ్రఫలంబు రసస్ఫుటంబుఁగాఁ
గోరికలూరఁ జెంత సమకూడినయట్లుల నాసఁ గొల్పియున్
దూరగతంబుఁగాఁగ నెటుఁదోఁచక వంత మునింగి నామనః
కీరము దానితో శుచిముఖీ! చనియెన్ గద యేమిసేయుదున్.

రాగ—(తనలో) ఈ సఖీమణుల మాటలు భావగర్భితంబులుగా నున్నయవి వీరి యభిప్రాయము లేమో యిప్పుడే స్పష్టమయ్యెఁడు. నేఁ ద్వరపడ నేల?

శుచి—(వెఱఁగు నభినయించుచు) సఖీ! ప్రభావతీ! ఏమి! నీ దాహముఁదీర్ప సమర్థంబగు రస మిడఁజాలు విషయంబు నిన్ను నిశ్చయముగ డగ్గరియెనా? అటులైన చో దానిని మరల నీ వేల పోనిచ్చితివి? నే నీమాటలు నమ్మజాలను.

ఉ. ఎంతటిజాణవే ప్రియసఖీ! మదిలోని రహస్యముల్ సదా
చెంతమెలంగు నీ యనుఁగుచేడియ నన్ గనుఁగప్పి చెప్ప క
త్యంతము దాచిపెట్టితివి ధర్మమె? యియ్యెడ నిన్నెలర్పనే
వింతలుపుట్టెనో తెలుపవే భయమేలనె ముద్దరాలవే.

నీవు చెప్పకపోయినను సర్వము నే నెఱిఁగియే యున్నదానను.

పభా—చెలీ! నీకన్న జాణ లెందుఁగలుగుదురు?

క. సుదతి! మాయాకిరాతవై సుందరాంగు
నొకనిగురువని తోడ్తెచ్చి యుత్సుకతను
దెలుపవే పూసగ్రుచ్చిన తెఱఁగు నాదు
మేలుచూపును మేల్కొల్కె మేలమేలె?

ఆ పురుషసింహుండు వైద్యక్రియావ్యాజంబున పచించినమాటలు భావగర్భితములై

నా కెంతయు భ్రాంతిఁగొల్పినవి! ఇంక నీ వేలదాచెదవు?

రాగ—(ఆశ్చర్య మభినయించుచు) ఏమి! ఎఱుకత వేషముధరించివచ్చిన దీ శుచిముఖి యేనా! అటులైనచో నా కెవఁ గురు వెవ్వరై యుండునో కదా.

శుచి—(చిఱునగవుతో) చెలీ! ఆ పురుషుం డొకతస్కరుండు. కావున నే వానిమాటలు నీకు భావగర్భితంబులుఁ గాఁదోఁచె. అయిన నీ వెట్లు భ్రాంతవైతివో వచింపుము

రాగ—సఖీ! శుచిముఖీ! నీ గురువైన యా సుందరాకారుండు తస్కరుం డెట్లయ్యె? వానియొద్ద నీవు తస్కరవిద్యయే నేర్చికొంటివి కాఁబోలు.

ప్రభా—శుచిముఖీ! ఇంకను నన్నుఁ బరిహాసింపుచు నే యుంటివా?

చ. చెలియరొ మిత్రమాగమ విశేషముచే వికసింపఁ జిత్రమా
జలజ నవీన కుట్మలము సన్నిధిఁ జేసట నేడు నాదు హృ
ల్లలిత మదాళి నీకృపఁ జెలంగి యభీష్టమరందమానఁగా
గలుగునటంచు భ్రాంతిఁగొని కౌతుకమందితి నేమిచెప్పుదున్.

నీ వాపురుషవతంసుని కలతెఱం గెఱింగించి నన్ను రంజింపుము.

శుచి—ప్రియసఖీ! సమయాసమయ విచక్షణంబు లేకయే సంభాషింపవచ్చునా?

గీ. గోడలకుఁ జెవులుండు వాకొనఁగనిట్టి
యతిరహస్యపు వార్తలో యబ్జనయన!
కంటక నికుంజమున విరిదంటఁగొనఁగఁ
దలఁప నిర్వ్రకును భ్రమాదంబుఁగాదె.

రాగ—సఖీ! ప్రభావతీ! మాటలసందడిని పంజరములోని చిలుకకు ఫలం బిడ మఱచి వచ్చితిని. క్షమింపుము. పోయివచ్చెదను. (అని నిష్క్రమించుచున్నది).

ప్రభా—చెలీ! శుచిముఖీ! నీమాటలు నా భ్రాంతిని మఱింత బలపరచుచున్నవి. ఆపురుషుం డెవ్వఁడో నిక్కవంబు వచియింపుము. నేను తాలిమి నిలుపలేకుంటిని.

శుచి—ప్రియసఖీ! ఆ పురుషుని రూపరేఖావిలాసంబులు నీ వెఱుంగనివికావు. అయినను వినుము.

ఉ. ఎవ్వని మున్నువాని హృదయేశుఁడు నీకగునంచుఁ జూపెనో
ఎవ్వని హృత్సరోజరస మింపున నీ మొదతేఁటి క్రోలునో

ఎవ్వని వైద్యవేషమున । నిచ్చటికిన్ గొనివచ్చియుంటివో
నెవ్వగమాను మింక తరు । ణీమణి ! నాగురు వాతఁడేసుమీ.

ప్రభా—(సోత్కంఠయై) ఓహో ! ఏమినాభాగ్యము ! సఖీ ! శుచిముఖీ ! వాని నిజ వృత్తాంత మొక్కింత వివరించి నాకుఁ గర్ణోత్సవం బొనరింపుము.

శుచి—చెలీ ! వినుము.

ప. గురుమిష నిన్నుఁగైకొనఁగఁ । గోరియెవచ్చె నతండు రుక్మిణీ
తరుణికుమారుఁడై వెలసి । తమ్ములు తన్గొలువంగ ద్వారకా
పురమున వేఁటలాడుచును । ముద్దులుగుల్కుచునుండె నాకహా!
కర మతివిస్మయం బొదవె । కన్నుల పండువుగాఁ గనుంగొనన్.

ప్రభా—(సహర్షంబుగఁ దనలో) ఆ మోహనాంగుండు నాబోటి విరహిణీజనమనః కురంగంబుల వేఁటాడుచుండెను కాఁబోలు. (ప్రకాశముగా) సఖీ ! నా హృదయేశ్వరుని ముద్దుపే రేమియో యెఱింగింపుము.

శుచి-చెలీ ! వినుము.

క. వనితరో ప్రద్యుమ్నుండని
జనులు పిలుచుచుందు రతని । సౌందర్యంబున్
గొనియాడ నలవికాదెం
దునఁ గన్యాహృదయ పశ్య । తోహరుఁడతఁడే.

మఱియు

చ. లలితవిలాస విభ్రమ క । లాకుశలత్వ పరాక్రమంబులన్
విలసితరూప సంపదల । విశ్రుతుఁడై చెలువారునాతఁడో
యలికులవేణి! చూచితిక । దా నవమోహనమూర్తి వైద్యుఁడై
వలచి నినున్ గ్రహింప నిటు । వచ్చినవాఁ డలమారుఁడే సుమా.

ప్రభా—ఓహో ! ప్రియసఖీ ! నీకతంబున నే నింక ధన్యురాలనయ్యెదను. ఆ నా హృదయేశ్వరుం డిపు డెటకేగియుండునో కదా.

శుచి——ప్రియసఖీ ! నీవు నీ కేళికాభవనంబులోని కేగుము. నే శృంగారవనంబులోని కేగి వాని నరసివచ్చెదను.

ప్రభా-మంచిది.

(అని యెవరిత్రోవను వారు నిష్క్రమించుచున్నారు.)

గద్య.

ఇది శ్రీమద్వేంకటరమణ కరుణాకటాక్ష వీక్షణాసార సమాసా
దిత రసబంధురకవిత్వవైఖరీప్రవీణాపస్తంబసూత్ర శాండిల్య
సగోత్రపవిత్ర హోతృకుల కలశార్ణవరాకాకైరవమిత్ర
వేంకటరత్నసుపుత్ర వేంకమాంబాగర్భ శుక్తిముక్తా
ఫల వివిధవిద్వజ్జనవిధేయ వేంకటకృష్ణ నామధేయ
ప్రణీతంబైన ప్రభావతీ ప్రద్యుమ్నం
బను నాటక రాజంబున
పంచమాంకము.

శ్రీరస్తు.

హయగ్రీవాయనమః.

ప్రభావతీప్రద్యుమ్నము.

షష్ఠాంకము.

రంగము: వజ్రపుర కేళికోద్యానవనము.

[వైద్యవేషుండగు ప్రద్యుమ్నుఁడు ప్రవేశించుచున్నాఁడు]

ప్రద్యు— ఆహా! తా నొకటిఁదలంప దైవము వేఱొకటిఁదలంచు నను టిట్టిదియేకదా.

చ. అమిత మహోగ్ర కాననము నందున నే మృగయాప్రసక్తిచేఁ
దమి విహరింపుచున్న నము తన్వి పయిందగులంగ వచ్చి యా
రమణి గ్రహింపలే నయితిఁ బ్రాప్తము లే కొకవస్తువైన హ
స్తమునను జిక్కిన న్బెదవి దాఁటినదాఁక నిజంబు లేదుగా.

అకటా! నే నెంతయు నవివేకినైతిని.

గీ. పాలు ద్రావలేక పాలచెంబును పిల్లి
బోర్ల ద్రోయు పగిదిఁ బువ్వుఁబోణిఁ
గాంచి కరముఁబట్టఁ గానుండి యక్కటా!
వెకలినగుట దాని విడువనయ్యె

నా దురదృష్టదేవతా క్రందనమో యన నట్టి యార్తాలాప మొనరించి కను మొరంగి నను దిట్టి తిరుప యెవ్వరోఁగదా. ఆ యమ కామరూపసంచారిణియైన శుచిముఖియో నన్ను నా యుద్యమంబు నెఱింగిన వృద్ధరాక్షస వనితయో కానలయు. వృద్ధరాక్షసవనితయే యైన చో రాక్షసవంశనాశనముఁ దలపెట్టునా? శుచిముఖియే యని యనుకొందుమన్న నా కామిని నామనోహారిణియగు ప్రభావతీ కన్య సందేశంబున ద్వారకాపురవరంబున కేతెంచి;

చ. అనుపమరాగరజ్జుల ననంతముఁగాఁ గలయంగఁ బేని నా
మనమను బొంగరంబున కమానుషలీలలఁ జుట్టి వైచి మిం
చిన భ్రమణంబుఁ బైకొనఁగఁ జేర్చియు నిప్పరి నాఫలంబు చే
తనుబడువేళ గ్రద్దవలెఁ దన్నుకపోవునె యీగతిన్ గటా.

అయిన నే నిప్పు డేమనుకున్నను లాభములేదు. శుచిముఖియుఁ గానరాదయ్యె. నే మరల నాశుద్ధాంతమున కేగి నామనోరమను గాంచుభాగ్యంబును లభింపదయ్యె నే నా వాల్గంటిని గన్నులారఁ జూచినతోడనే నామనంబు తన్మయం బయ్యె. మరల ద్వారక కేగుదమన్నను కాళ్లాడకున్నయవి. ఏమిచేయుదును. (అని నలుదెఱఁగుల వీక్షించి) ఏమి! నే శృంగారవనంబునకు వచ్చితినిఁ కాఁబోలు. ఆహా! ఈవన మెంతరమణీయముగా నున్నది.

లయగ్రాహి.

కమ్మనిలతాంతముల కిమ్ముగు నికుంజముల
జుమ్మనుచు రేగు మధుపమ్ములను కాసా
రమ్ములను హంసలు ముదమ్మున మనోభవశ
రమ్ము లను తెమ్ముల బిసమ్ములను మెక్కన్
గ్రమ్ముకొనుచుం గలరుతమ్ములను భూరుహాచ
యమ్ములఁ దమిన్ శుకపికమ్ములెసఁగ న్బిం
ఛమ్ములను విప్పినటనమ్ములను గేకినులు
నెమ్మిఁ గొలుపంగ హృదయమ్ములరుచుండెన్.

ఈ యారామముయొక్క రామణీయతకుఁ గొండొక కారణంబుగలదు. ఏమన,

గీ. నందన వనమ్ములోని విన్నాణమైన
సుమలతా భూరుహము లెల్ల సురుచిరముగ
వెలయు నిచ్చోట దేవేంద్రుఁ దొలఁగఁ జేసి
పూని కైకొన్నకల్మి కాఁ బోలునిదియు.

ఎట్లైన నేమి? నా కిప్పట్టున నేత్రపర్వం బొనరించుచున్న యీ శృంగారవనంబున,

చ. తరుణి ప్రభావతింగనని దన్విరహార్తిని మ్రగ్గుచుంటి నీ
జ్వరమునుఁ బల్లవప్రసవసంగతిఁ బైనొలయంగఁ జల్వతె

మ్మెరలు హిమాంబుబిందుల సకమేళనఁ దేనియ వానలొప్పఁ గ్రొ
వ్విరుల పరాగశయ్యలను ♦ వేడ్కఁజరించి హరింతునియ్యెడన్.

(అని యిటునటుఁజూచి) అదిగో! నక్తంచరుం డొకఁడిటులనే వచ్చుచున్నాఁడు. నేనీ పొదరింటిమాటున గూరుచుండి వానిప్రయత్న మెట్టిదియో తెలిసికొని కర్తవ్యమాచరించెదను. (అని యట్లచేయుచున్నాఁడు.)

[అంత మహాక్రోపనుతో కఠోరదంష్ట్రుఁడు ప్రవేశించి]

కఠో—అరే వైద్యుఁడా! నీవెందుడాగితివిరా? అరే మిథ్యాప్రగల్భ! ఏమిది! ఈ వజ్రపురంబున నే నెంత వెదకినను రాక్షసవంశనాశనమునుఁ దలపెట్టిన ముదిముత్తైదువయు నా మెను రక్షింపఁ గడంగిపోయిన వైద్యుండును గానరాకుండిరి. వారీపురంబు వెలువడియుందురా? ఆఁ! ముసల ముద్గర భిండివాల తోమర ఖడ్గాది శస్త్రంబులతోఁ గాచియున్న వీరభటనికాయంబు నతిక్రమించి యెట్టివారలైన నీపురంబు నధిగమింపఁజాలుదురె?

క. త్రిజగత్పాలకులగు నా
యజహాళీ పురముజొచ్చి ♦ నంతనె వారీ
రజనీచర యోధుల స
ద్భుజ పంజరమందుఁ జిక్కి ♦ పొలియరె తృటిలోన్.

నా సహచరులలో నేరిచేనైన వారీసరికే పంచత్వంబు నొందియుందురు. ఈసంగతి మహారాజుగారికి నివేదించెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

ప్రద్యు—(వెలికివచ్చి) ఈ దుష్టరాక్షసుండు నే రక్షోవీరులచే, నిహతుండనైతిననియేఁ దలంచుచున్నాఁడు. కానిమ్ము. ఏమిజరుగనైయున్నదో చూచెదఁగాక. (అని కొంచెము ముందరకునడిచి) ఓహో! ఈకేళికోద్యానవన మెంతహృదయాహ్లాదకరంబుగ విరాజిల్లుచున్నయది!

సీ. సురసాల సుమలోల ♦ పరిఖేల సరసాళి
మృదుగానములు మది ♦ ముద మొలర్ప
నెలమావి బలుకేవి ♦ లలితావి గలఫలం
బుల మెక్కు శుకపాళి ♦ పలుకు లెసఁగఁ
గురువింద తరుబృంద ♦ మురువొందఁ దమిఁజెంది
కలరుతంబులఁ బికంబులు చెలంగ

వనలూని వలపాని । కనరాని మలయాని
లుఁడు మెలమెల్లఁగా । వెడలుచుండ
గీ. మదమరాళము లెల్లఁ బ।ద్మాకరముల
నలరిబిసములఁ దినుచు ను।య్యోలలనూఁగ
నల్లిబిల్లిఁగ నల్లిన । మల్లె పొదలఁ
బుష్పాడుల సెజ్జలను వన । మొప్పుచుండె.

వహ్వా! నే నిప్పు డా పరి మెళమిళిత మంజులకుసుమపుంజరంజితం బైన మల్లెపువ్వు టీరంబులోని పుష్పాడి సెజ్జపై యొక్కింతతడవు విశ్రమించెదను. (అని యొకనికుంజంబుఁ జొచ్చి) అన్నా! నే నెంతయవ్యక్తుండ నైతిని.

సీ. వైద్యవేషంబున । వజ్రపురంబున
కేతెంచినంత నే । యింపుఁ గలిగె
వజ్రనాభుని సౌధ। భాగంబుఁ గనినంత
నడువలే నైతిఁ గా। ల్తడఁ బడంగ
సౌధంబులోఁ బ్రవే।శముఁ గనినంత నే
నిలువెల్ల మేనిపైఁ । బులకలెసఁగె
నంతిపురముఁ జేరి । నంత నే గుండియ
ఝల్లని చెమ్మట । వెల్లివిరిసెఁ
గీ. బల్కుతొట్రువడెఁ బ్ర । భావతిఁ గనినంతఁ
గరముఁ బట్టఁబోవఁ । గరమువణఁకెఁ
దనువు మఱచియుంటి । గనులీఁదఁ జాగె నా
తరుణమందు మోహ । తమము కప్పె.

ఇప్పుడు నే నేమనుకొన్న నేమిలాభము?

క. పంబుట మోహాతమంబున
హంబున వెలుఁగుఁ గని గొంది । నడఁగుదివాంధం
బుంబలె స్మితవక్త్రాంబుజ
బింబపు రే వెలుఁగుకోఁడి । వెలినైతిఁ గదా.

అకటా! నే నెంత మందభాగ్యుండ నైతిని!

శా. తానే రమ్మని లేఖ వ్రాసెనుగదా తన్వంగి నా పేర న
త్యానందంబుగ వచ్చియున్ననను జెంతం గాంచి రూపింపదో
కానీ చూతమటంచు నూరకొనెనో కామాతురుండంచు నా
పై నింగిన్కవహించెనో జనకుని న్భావించి యట్లుండెనో.

మఱియు నా మోహనాంగి యభిప్రాయమేమో తెలియరాకున్నది.

మహాస్రగ్ధర.

దరహాసజ్యోత్స్నభూతిన్ దరుణిముఖసుధా ధామబింబోదయంబై
యరుదౌ మోహాంధకారం బణఁగుననుచు నత్యంతముప్పొంగి రా నుం
దరి నన్నుం జూచి వ్రీడా నతముఖియగుచు న్నాపయిన్ గిన్కచేఁ ద
త్కురులం జూపించె వాల్చూడ్కులఁ బలుకక నా కోకిలాలాపలీలన్.

ఆ కన్యామణియభిప్రాయము రాగసూచకమో సమయసూచకమో తెలియరాదు. అనుభవముచే వియోగసూచకముగాఁ బరిణమించినదికదా. ఒకవేళ నన్ను గుఱుతించి సంభ్రమించినచోఁ గురులెన్ని కలవో యన్ని చిక్కులు కలుగుననియు వానిలోఁ జిక్కినయెడల మరల మోహాంధకారంబున మునుంగవలసి వచ్చుననియు భావగర్భితంబుగఁ దెలిపెఁగాఁబోలు! ఆహా! ఏమి యాకోమలాంగిచాతుర్యము! ఏదైననేమి? మరల నే నాతరుణీమణి నేవిధంబునఁ జూడఁగలుగుదును? అదియునుఁగాక.

ఉ. కాంచి కనత్క్వణత్ప్రచుర కంకణకింకిణితారహారభూ
షాంచితయౌచుఁ జెక్కిటఁ గరాబ్జముఁ జేర్చి యొయారమొప్ప నన్
గాంచుచు వాల్కనుంగవ ముఖంబున లేనగ వంకురింపఁ జూ
పించి కురుల్చలద్భ్రుకుటి వీఁక చెలింగనె దీనవక్త్రయై.

ఆచూపు నాహృదయంబునకు వాఁడియైనతూపై నన్నుఁ బరిపరివిధంబుల వేధించుచున్నయది. ఆనన్న నెఱింగియేఁగాఁబోలు శుచిముఖి వెంట నేనిక్రమించి యట్టి యార్తాలాప మొనరించె. హా! నామనోహారిణీ! నన్ను వలచి తపించుచుంటినని లేఖ వ్రాసితివే. ఇప్పుడిట్టివియోగంబుఁ గలిగింప నీమన స్సెట్లొప్పె? కాదు. నేనే యపరాధిని. కామాతురుండనై యుక్తాయుక్తవివేచనంబులేక నీమనోగతం బెఱుంగకయే నిర్భయంబుగ నీకరంబు గ్రహింప సాహసించితిని. అకటా! నీపై మరులుగొనియున్నవాఁడనగుటచే మో

హాతిరేకంబున నేనొనర్చిన యీ యపరాధంబున కింతదారుణమైనశిక్ష విధింపవలయునా? ఇంతనిర్దయ కర్కశుండనైతినా?

మాలినీవృత్తము.

కలికి ! కరుణలేదా ? గాసిఁ దూలింపరాదా
పలుకక ననుద్రోయ న్యాడియే చెంతఁజేరన్
బిలువఁబనుపవేలా ? వేసటన్ దాళ బాలా!
చెలిమిఁ దలఁచినంతన్ శిక్షకర్కశుండనైతిన్.

కటకటా! ఏమి నాదురదృష్టము! (అని నల్గడలఁ జూచి నిట్టూర్పుతో)

చ. కులుకుచు లేఁజిగుళ్లనుఁగుం జెలి ముక్కునఁ దెచ్చియివ్వ ను
త్కలికను వానిఁ గైకొని పికంబు తమింగొని ముద్దులాడఁ జి
ల్కలు మిథునోత్సవంబులనెలర్పఁగ గంధవహుండు పూలబం
తులఁగొని కొమ్మలం గవయఁదూలఁగనయ్యెనె నాకు నక్కటా.

(అని విరహపరవశుండై మూర్ఛిల్లుచున్నాఁడు,)

[అంత శుచిముఖి ప్రవేశించి]

శుచి—(తనలో) వైద్యవేషుండగు ప్రద్యుమ్నకుమారుం డేకతంబ యీ యుద్యానవనంబున విహరింపుచుఁ బ్రభావతిపైఁగల తమిచే విరాళిఁజెందుచుండునని యొంటిగియే వచ్చితిని. ఈ యారామమంతయు వెదకిన నాతండు గానరాఁడయ్యె. తిరుగ ద్వారకకేగియుండునా? అట్లు జరిగియుండదు. ప్రభావతీకన్యానురాగశృంఖలానిబద్ధచేతస్కుండగు నా పురుషవతంసునకు వెనుకకుమరలుటకుఁ గాళ్ళాడునా?

గీ. తనదుచిత్తంబు కన్యపైఁ దగిలియుంట
ద్వారకాపురి కెట్లుపోఁదలఁచు నితఁడు?
ధర నయస్కాంతమునకు జెంతనుగలట్టి
యినుము దానిని విడనాడి యేగఁగలదె?

ఆతం డీపువ్వుటీరంబుల నెందైన డాగియుండెనేమో బాగుగఁ బరికించి చూచెదఁగాక. (అని యంతటను గలయఁజూచి ప్రద్యుమ్ను నిరీక్షించి) ఇదిగో! ప్రద్యుమ్నకుమారుం డిచ్చోటనే యున్నవాఁడు. (అని సమీపించి చూచి వెఱగందుచు) ఏమి! ఈతండువిరహవేదనా దంధహ్యమానమానసుండై మూర్ఛిల్లినట్లున్నదే! ఈసంగతి ప్రభావతి కెఱింగించెదను, (అని నిష్క్రమించుచున్నది.)

ప్రద్యు—(మూర్ఛ తెలిసి దిగ్గనలేచి తత్తరపాటుతో) ప్రభావతీ! ప్రభావతీ!!

మ. కలికీ! నన్దరిఁ జేరవచ్చితివి వేడ్కన్గాంచితి న్నన్ను మే
ల్కొలుపన్ లేకఁ దొలంగి నాపయిఁ గటా! కోపించితే యింక నే
నిలుపంజాలుదునే విరాళి ననుమన్నింపంగదే తప్పునా
వలన న్గల్గిన నిట్టినిర్దయకు నేఁబాత్రుండ నైతినే.

ఓజీవితేశ్వరీ!

సీ. దీనచకోరాళి తృష్ణఁదీర్చుచు నుండు
నీదరహాసచంద్రికలటంచు
గతిలేనిశుకపికతతికి విం దిడు నీ చి
గురు దొండపండు వాతెఱయటంచుఁ
బేదనెమళ్లను నాదరించుచునుండు నీ
నీలమేఘవేణియెయటంచు
నాఁకొనుహంసల కాసఁగొల్పెడు నీదు
లాలిత భుజమృణాళములటంచుఁ

గీ. దుమ్మెదలఁబెంచు నీకనుఁదమ్ములనుచు
వినివలచివచ్చితినిగాని వెలఁది! యిట్లు
నా యభాగ్యత నిన్నెడఁబాయఁజేయఁ
దోఁడ నేతెంచునని నాకుఁదోఁచదాయె.

మఱియు నో మనోహారిణీ!

సీ. సారంగనయన సుధారసంబును జిల్కు
నీదుకెమ్మోవియాహ్లాదమొసఁగ
చక్రవాకస్థనీ శారికాకలరుతం
బనుముద్దుపల్కులు మనమెలర్ప
కల్యాణి నీవాలుకన్గవబెళ్కుచూ
పులముల్కు లెదనాఁటి సొలయఁజేయ

మోహనగాత్రినీ మొల్కనవ్వులమోము
వెన్నెలనెలయన వెతలముంపఁ

గీ. గీరవాణిరో కోర్కెలుమీర నీదు
నాదనామక్రియల్మదిఁ బాడుకొనఁగ
మలయమారుత మిటులపైఁ బొదలుచుండఁ
గన్నడ సహింతునే రావె కనవె నన్ను.

హా! దేవీ! భవానీ!

శా. ఓకాత్యాయని! నిత్యమంగళకరీ! యోశాంకరీ! చండికా!
యోకాళీ! శ్రితకల్పవల్లి! గిరిజా! యోపాప విధ్వంసినీ!
యోకల్యాణి! త్రిలోకపూజితసతీ! యోయర్ధనారీశ్వరీ!
నాకుంజూపఁగదే ప్రభావతినిఁ గన్యారత్నమున్ మ్రొక్కెదన్.

ఓజగజ్జననీ!

శా. తల్లీ! నన్నులిఖించి చిత్రమిడి యాతన్వంగికిన్ ప్రీతిరం
జిల్లన్నే నవిభుండనౌదునని శాసింప న్వినన్గాంతుశో
భిల్లన్నే నిటువచ్చి నిష్ఫలమనోభీష్టుండనై యిందు ను
ద్విల్లారన్గని యారకుండుదువె దేవీ! కన్యకన్గూర్పుమీ.

(అని దృష్టినిగిడించి నల్వలంకులఁ గలయఁజూచి) ఆఁ! ఆదిక్కునఁ బొన్నగున్న క్రిందఁ దళుక్కుమని మెఱయున దేమియొకదా.

క. తొలుకరి మెఱుపో నాయెద
వెలుఁగొందెడు దీపకళికొ విలసితమణిరో
చలబెళుకో రాకాళశి
తళుకో మోహంపుమొలకొ తరుణీమణియో.

ఆయన్నులమిన్న నామనోహారిణియగు ప్రభావతియేఁ గాఁబోలు. ఆహా! కరుణాతిరేకంబుచే నా జగన్మోహిని నన్నారయఁ దానే యిచ్చోటునకువచ్చియుండెనాయేమి? వహ్వా! ఏమి నాయదృష్టము! హృదయమా! సంభ్రమింపకుము. నే నీమాటునఁ గూర్చుండి యాలేమయభిప్రాయం బెఱింగెదను. (అని యొకపొదరింటిమాటున గూర్చొనుచున్నాఁడు.)

[అంత ప్రభావతి ప్రవేశించి]

ప్రభా—(తనలో) హా! దేవీ! సర్వమంగళా! నిన్ను నాహృత్పద్మంబున నెలకొల్పి రేయుంబవళ్ళు నిండుభక్తి నారాధించుచున్నను నాపై నీకిసుమంతయైనఁ గరుణకలుగదాయె. నే నట్టిమందభాగ్యనని నన్నిట్లుపేక్షింతివా జననీ?

కవిరాజవిరాజితము.

హిమగిరిరాట్సుత!। యిందుకళాధరి!। యేణవిలోచని!।యీశ్వరి!చి
త్రముఁగని నేనొక। రాజితసుందర। రాజసుతున్ గుణ। రాజినుతున్
రమణుఁడటంచుఁ గ।రమ్మువరించితి। రమ్యగతిన్ గన। రాఁ డకటా!
కమలదళాక్షి!య।ఖండకృపామతిఁ। గానఁగఁ జేయవె। కాంతునిటన్.

అన్నా! ఈ యుద్యానవన మంతయు వెదకినను నా ప్రాణేశ్వరుండు గానరాఁడయ్యె. ఎందుడాగియుండెనోకదా. ఎవ్వరి నడిగి తెలిసికొనియెదను? జగదేకశరణ్యలగు భగవతీమతల్లులనే వేడుకొనియెదను. (అని కృతాంజలియై.)

సీ. గిరిసుతా!నామనో।హరునివేఁ జూపుమా
  పసపు కుంకుమ నీకు। బత్తినిడుదుఁ
బద్మాలయా!నాదు। ప్రాణేశుఁ జూపుమా
  విరిసినపువ్వు లర్పింతునీకు
భారతీ!నాచిత్త।చోరునిఁ జూపుమా
  తులసీదళంబులఁ।గొలుతునిన్ను
నగభేదిరాణి!నా। నాథునిఁజూపుమా
  లలిముత్తెముల నిన్న।లంకరింతు

గీ. వేల్పు టిల్లాండ్రలార ! నా। వెతలమాన్ప
నెంచి నాజీవితేశ్వరు। నిటకుఁదెచ్చి
నాకుఁగనులారఁ జూపి సం।ధానగరిమఁ
దాపమార్పుఁడి ననుఁగన్న। తల్లులార!

ప్రద్యు—(తనలో) ఈ తరుణీమణికి దేవీనిర్మితుండైనవరుండను నేనేఁగాఁబోలు. అటులైనచో చెంతనున్నప్పుడు నన్నాదరింపక యిప్పుడు నాకొరకై యువ్విళ్ళూర నేల? నన్నప్పుడు గుఱుతింపలేదుకాఁబోలు. అయిన నింకేమనునో వినియెదను.

ప్రభా—అకటా! నే నెంతభాగ్యహీన నైతిని. వలచివచ్చిన ప్రాణనాధుని చెయిచేతల విడిచిపెట్టుకొంటిని. ఆ నా వల్లభుండు కురులు చూపింపఁ బరాఙ్ముఖి నైతినని నాపై నలుకవహించెఁ గాఁబోలు. ఏమిచేయుదును? క్షమింపుఁడని వేడుకొందుమన్న నెచ్చోటను గానరాఁడయ్యె. ఓనాధా!

మ. అలుగన్యాడియె నేరమెంచఁ దగ దన్యాయంబు రాకాశశిన్
జులకంజూచునె కైరవాంగన యెలర్పున్నాక వైముఖ్యమున్
దొలగుంగాదటె పద్మినీసఖికి మిత్రుంజూడ నే నక్కటా!
కలనైనన్ నినుబాసియుంటినె మనఃకాంతా! ననుంగావవే.

ప్రాణవల్లభా!

* కందద్వయ కమలవిలసిత రుక్మవతీ గర్భక్రౌంచపదవృత్తము.

ద్వారవతీనాథా! సదుదారా! తరుణరుచిరమృదు ధవళశుభాంగా!
వారిరుహాక్షా! పాలితవారా! వరగుణగణనుత వనరుహచాపా!
సారచరిత్రా! సత్యవిచారా! శరరుహజితముఖ సరసకలాపా!
మారసుధీరా! మాసుకుమారా! మఱవఁదర మెనినుమదిదయ లేదా?

ప్రద్యు—(తనలో) ఈ సుదతీమణికిఁ బ్రత్యుత్తర మొసంగుదమన్న నేమియుపద్రవము సంభవించునో. చెలికత్తియ లెవ్వరైన దగ్గఱ నుండిరేమో.

చ. హృదయమ! తాళుమింక కమలేక్షణమానస పంజరంబులో
ముదమున సంచరింపుచు విమోహముఁ జెందెదవేల భ్రాంతిచే
నదనిదె సత్ఫలంబుఁగొన నాదురపిల్లకుఁ డాశలార! సం
పదగనవచ్చు నీరమణిభావమెఱింగిన దాక యోర్చుఁడీ.

ప్రభా—కానిమ్ము. నా హృదయేశ్వరుం డీవనంబున నెందైన డాగియుండెనేమో వీరం దఱిని తెలిసికొనియెద.

---

* ఈ క్రౌంచపదవృత్తములో గర్భీకృతములైన వృత్తములు.

1 క. ద్వారవతీనాథా! సదు, దారా! తరుణరుచిరమృదు•ధవళశుభాంగా!
వారిరుహాక్షా! పాలిత, వారా! వరగుణగణనుత•వనరుహచాపా!

2 క. సారచరిత్రా! సత్యవి, చారా! శరరుహజితముఖ•సరసకలాపా!
మారసుధీరా! మాసుకు, మారా! మఱవఁదర మెనిను?•మదిదయలేదా?

సీ. గౌరీలిఖిత చిత్ర । గతు నాథుఁగంటిరే
మల్లెలార! లతామ । తల్లులార!
నాప్రాణవల్లభు । నలినాక్షుఁగంటిరే
సలలిత పుష్పకుం । జంబులార!
నామనోహరుని సుం । దరమూర్తిఁ గంటిరే
సురుచిరతరు సరో । వరములార!
నాజీవితేశు స । న్నాసితుఁగంటిరే
యళులార! శుకశారి । కాళులార!
గీ. వైద్యవేషంబుచే నన్ను । వలచివచ్చి
కన్మొఱంగిన నామనః । కాంతునిచటఁ
గాంచినారేమొ చెప్పరే । కరుణతోడ
నగములార! మయూర ప । న్నగములార!

ప్రద్యు—(తనలో) ఏమి! వైద్యవేషంబునవచ్చిన నన్ను గుఱుతించియే యట్లు విముఖి యైయుండెనా? ఒకవేళ శుచిముఖిచే తరువాత నెఱింగెఁ గాఁబోలు.

ప్రభా—అయ్యో! ఈ విటపిపటలంబులును నాయవస్థంజూచి కటకటంబడవయ్యె. ఏమిచేయుదును.

త్రిభంగివృత్తము.

కొలఁకులబిసములఁ । గొసరితినుచుననుఁ
గలుపరె హంసినులారా! విభు నారా మంబునకున్ రా
లలితకిసలయము । లను మెసఁగుచుననుఁ
గలుపరె కోయిలలారా! విభు నారా మంబునకున్ రా
జలదములను గని । యలరుచు దయననుఁ
గలుపరె కేకిసలారా! విభు నారా మంబునకున్ రా

కమలవిలసితవృత్తము

తరుణరుచిరమృదు•ధవళశుభాంగా!, వరగుణగణనుత•వనరుహచాపా!
శరరుహజితముఖ•సరసకలాపా!, మఱవఁదరమెనిను?•మదిదయలేదా?

రుగ్మవతీవృత్తము.

ద్వారవతీనా•థా! సదుదారా!, వారిరుహాక్షా!•పాలితవారా!
సార్థచరిత్రా!•సత్యవిచారా!, మారసుధీరా!•మాన్యకుమారా!.

కలకలములఁ గుజనములఁ జెలఁగుచు ననుఁ
గలుపరె కీరములారా! విభు నారామంబునకున్ రా.

అన్నా! చెలికత్తియ లెల్లఁగిరోకదా. ఇంకనురారైరి.

ప్రద్యు—(తనలో) నాకొరకై యిచ్చోటికి నామనోరమ యేకతంబ వచ్చెనుగాఁబోలు. ఇప్పు డేమియోఁబలుకుచున్నది. వినవలయును.

ప్రభా—ఓప్రాణేశ్వరా!

కల్యాణివృత్తము.

నామనోహరా! కరుణాగుణాకరా!
ననుందయామతిం గనుంగొనంగరా వరా!
కోమలాంగ! నాకోర్కెఁదీర్పరా
కురుల్లనంగఁ జేయ నింత కోపమేలరా
కామమోహనాకార! ధీవరా!
కలాకలాప! నాదుచిత్తకంజభాస్కరా!
ప్రేమఁ జూపరా కనుపించవేమిరా
విరాళిసైపఁజాల నాదువెతలఁ బాపరా.

ప్రద్యు—(తనలో) ఈనారీరత్నము నాయందుగల మోహాతిరేకంబుచే నన్నిప్పుడు చేరరమ్మని పిలుచుచున్నది. చెంత నున్నప్పుడు నన్నలక్ష్యముఁజేసి పరాఙ్ముఖి యగుట కేమిహేతువో తెలుపదాయె. ఆవిషయమై యీలేమ యభిప్రాయం బెఱుంగుట కాకీరమును సంబోధించి యిట్లనియెదను. (ప్రకాశముఁగా)

ఉ. కోరి రసంబుఁగైకొనఁగఁ గొమ్మను జేరియు దానిఁబాసి యా
తీరున సిగ్గులేక వినుతింపుచు వెండియు దానిఁజేరఁగాఁ
గోరెదవేమొ నీకు సమకూడునె కంటకరాజిలోనఁ బెం
పారుఫలంబు నీదగు ప్రయత్నము వ్యర్థమునుమ్ము కీరమా.

ప్రభా—(విని సంభ్రమాశ్చర్యంబులు మనంబునఁ బెనంగొన లేచి నల్వలంకులఁగలయఁ జూచి తనలో) ఏమిది! ఈ యన్యాపదేశవాక్యం బెటనుండి వచ్చుచున్నది? నా మనోహరుండీచెంత నెందైన డాగియుండెఁగాఁబోలు. అటులనే గావచ్చు. కొమ్మనైన నాదరిఁజేరి యధరబింబఫలం బపేక్షించిన కీరమా మోహనాంగుఁడేకదా.

తిరుగ వానికి సమాధానమొసంగ నాతుమ్మెద నుద్దేశించి యిట్లనియెదను. (ప్రకాశముగా)

చ. విరసగతిన్ రవింగనియు విన్నఁదనంబున వాడియున్న యా
సరసిజమందు వ్రాలి మధుసారముఁ గ్రోలఁ దలంచెదేల? ద
గ్గఱఁగల చంపకంబెనయఁగా ఘుటియిల్లదె హాని? యిచ్చటన్
సరసగతిన్ సరోజ మధుసారముఁ గైకొనరాదె తుమ్మెదా!

ప్రద్యు—(ఉత్కలికఁ దనలో) ఓహో! ఈవాల్గంటి తనతండ్రి చెంతనుండుటచే నన్నుఁగని భయవిహ్వలయై నేను తమిమీర సాహసించినచో నాకుఁ గీడువాటిల్లునేమో యని తలంకవలసివచ్చెననియు నందుచే విన్నఁదనంబుఁ బూనియుంటిననియుఁ జతురముగ వెల్లడించుచున్నది. అయిన మరల నాకీరమునుద్దేశించియే యిట్లనియెదను. (ప్రకాశముగా)

ఉ. రాగముఁ జెందియున్న ఫలరాజముఁగాంచి విమోహచిత్తవై
చేఁగొనఁజాల కీవిధము చేడ్పడియుంటివి లక్ష్యపెట్టెదే
బాగుగనీకుఁ గోర్కెగల పట్టునఁ గంటకరాజి? బేలవై
యీగతి వెండి దానిఁ గొన నేఁగఁ దలంచెదె వెఱ్ఱికీరమా!

ప్రభా—(తనలో) అయ్యో! నామనఃకాంతుండు నిరపరాధిని నైన నాయెడల నిష్కారణ మలుకవహించియుండె. ఏమిచేయుదును. అయిన నాపై యింకను నొకింత ప్రేమఁ గనఁబఱచుచుండెఁ గావున నాఫలంబు నుద్దేశించి మరల నిట్లనియెదను. (ప్రకాశముగా.)

చ. సరసఫలంబ! కీరమ్మదు చంచుపుటానుభవంబుఁ గోరి త
త్కరగత మాటకుం దలఁపుగల్గుట నేకద పత్రసంగతిన్
మురియుచుఁ జేరఁదీసి నవమోహనకీరముఁ బాయఁద్రోతువే
గురుతరకంటకంబు సమకూడుట భీతినిఁగాక బేలవై.

మఱియు,

చ. నవరసపూరితంబవు నరనారత మా మురిపెంపుకీర మా
నవమునుఁ గ్రోల ధన్యత నొసంగుదునంచుఁ దలంచుదాననై

పవలును రేయిఁ దల్లడిలి భాగ్యవశంబున నేడు చేరరా
నవమతివై యకారణ మహో నిరసించెదవే ఫలోత్తమా!

ప్రద్యు-(తనలో)ఈ రామామణి నాపై నిండుప్రేముడిచేత నేయ ట్లూరకుంటినని చెప్పుచున్నది. అయినఁ దా నేయభిప్రాయంబుచే నా కయ్యెడఁ దనకురులను జూపించెనో తెలిసికొనవలయును. ఎట్లోఁగదా (కొంచె మాలోచించి) ఇప్పు డానరోజాననచెంత విరాజిల్లు జలాశయంబులోని నెత్తమ్మిపై వ్రాలఁగోరియుఁ దొలంగు ప్రమదాళి నుద్దేశించి యిట్లనియెదను. (ప్రకాశముఁగా.)

గీ. చంచరీకమ! సరసిలో జలరుహంబుఁ
గాంచి తమిఁజెంది కురులను గనినయంత
వ్యర్థతనుఁ జెంది యెడఁబాయవలెనెదాని?
నిర్దయల చేష్టితముల మన్నింపఁదగునె?.

ప్రభా-(తనలో) అయ్యయో! నామనోవల్లభుండు నిర్దోషినగు నాపై యలిఁగి తనకు నేఁ గురులనుజూపించుటచేఁ దా నన్నెడఁబాయవలసివచ్చెననియు నేను వట్టి నిర్దయురాలననియు నే నొనర్చిన యపరాధము క్షమించఁదగినదికా దనియు నుడువుచుండె. నా మనోభావం బెఱుంగకుండెనో యెఱింగియు ననుచితంబని తలంచెనో తెలియరాదు. నా యభిప్రాయంబు తేటఁబడ నా బంభరంబు నుద్దేశించియే ప్రత్యుత్తరంబుఁగ నిట్లనియెదను. (ప్రకాశముఁగా.)

ఉ. తుమ్మెద! తమ్మిపైఁ జనకు దూరమునందున నిల్వకున్న నీ
విమ్మెయిఁజూడు నాదుకురులెన్నితనర్చునో యన్నికష్టముల్
క్రమ్మెడు నంతెకాక విను క్రమ్మర మోహమహాంధకారమం
దుమ్మలికం జరింప వలయుంజుమి పిమ్మట సౌఖ్యమబ్బదే.

మఱియు నోరోలంబరాజమా!

గీ. కోపగించకు నాపైని సాపరాధ
ననుచుఁ గంటకసన్నిహితాప్తికమిత
భయముచే నాదునిర్దుష్టభావమిటుల
నెమ్మిఁ దెలిపినతప్పు మన్నింపఁ దగదె?

ప్రద్యు-(సహర్షంబుగఁ దనలో)ఓహో! ఈ యబలారత్నము నాపై నిష్కళంకమైన యనురాగమునే కలిగియున్నది. ఈలేమ చకితహరిణాక్షియగుటచే నట్లు తలం

నేఁగాని నాయెడల నిర్లక్ష్యభావముచేత కాదు. నిర్హేతుకంబుగ నిరపరాధినిపై దోషారోపణంబుఁ జేసి నేనే యపరాధి నైతిని. కావున నే నిప్పుడీతన్వంగి యెదుటకుం జని తప్పు క్షమింపుమని వేడుకొనియెదను. (అని ప్రభావతియెదుటకువచ్చి ప్రకాశముగా) బాలామణీ!

మ. చపలత్వంబున నిన్నుఁ గోరి ఫలకాంక్షం జేరి వ్యర్థుండనై
విపులార్తిన్వాలి స్రుక్కుచుండి తమిచే విభ్రాంతి కల్గంగ నీ
విపరీతంబు ఘటింపఁ గారణము నీవేయైతివంచంటి నా
యపరాధంబు క్షమించి ప్రోవుమిక కొమ్మా! సత్ఫలాభ్యున్నతిన్.

(అని మోకరించుచున్నాఁడు.)

ప్రభా-(చూచి లజ్జావనతవదనయై చిఱునగవుతో నల్లన వెనుకకుఁ జనుచున్నది)

ప్రద్యు-(లేచి సమీపించి) మనోహారిణీ!

మ. తలఁపన్ రాదఁటె నీహృదబ్జమకరందంబాని యున్మత్తయై
యలరం గోరి సతంబు మోహతమ మత్యంతంబుఁ గన్గప్పను
త్కలికం జేరుటఁ జంపకంబునను లక్ష్యంబుంచునే? నిర్దయన్
వెలిఁద్రోయం జన దీమదాళి నిక తన్వీ! సత్కృపన్ బ్రోవుమా.

ప్రభా-(సహర్షయై తనలో) డెందమా! సంభ్రమింపకుము. కాంక్షలారా! తాళుఁడు.
(అని క్రీగంటిచూపులు సారించుచు చిఱునగవుతో శిరము వంచుకొనును.)

ప్రద్యు-మోహనాంగీ! నీ యనుగ్రహంబునకు నే నేల పాత్రుండను కానైతిని?

సీ. మోహాబ్ధికాంక్షు వీచీహతిదోఁగు నా, కాయంపుతరణిసద్గతి యనంగ
విరహనిదాఘప్రపీడితాస్మన్మనో,బర్హిఁ దన్పెడు నవాబ్దంబనంగ
మదనజ్వరార్తిని విదళించి నను దేర్చు, మంత్రబీజాంచితయంత్ర మనఁగ
కామాంధకారదుర్గమవనంబున నాకు, గతిఁజూపఁగలదీపకళిక యనఁగ

గీ. తరుణి! నీముఖచంద్ర సందర్శనంబు
కలుగునని తెల్ప నొదవు నక్షత్రమనఁగ
నిన్నుఁ గనఁ గోరి తపియించుచున్నకతనఁ
గనుల పండువగొల్పె నీకమ్మ నాకు.

ప్రాణేశ్వరీ! ఆ కమ్మమిన్న ప్రభావ మేమని చెప్పుదును!

ఉ. కమ్మనుగాంచినంతనె ముఖమ్ము ప్రసన్నతఁ జెందె మెండుగాఁ
జెమ్మటలంకురించె నినుఁ జేరెను చిత్తము పొంగుమేనఁ గం
పమ్ముజనించెఁ జీకటులుఁ బర్వెను కన్గవ నిన్ను వైద్యవే
షమ్మునఁజూడనయ్యె నవశక్యము నేఁ దమి నిల్ప నయ్యెడన్.

సీ. దయకల్గదా యెనో తన్వి! కాంతారంబు, నందు నేమృగయావిహారలీలఁ
జెలఁగుచుశుచిముఖిచే నీమనోహర, మోహనాకృతివినిమూర్ఛఁ జెంది
నినుఁ జేరు వెరవు నేఁ గనలేక ద్వారకా,పురి కేగివిరహార్తిఁ బొదలుచుండ
దూతికవచ్చి సంప్రీతినీయుత్తరం, బొసఁగంగ హర్షాబ్ధి నోలలాడి

గీ. తోడనే వచ్చి నినుఁగాంచి దుస్సహంపు
వలపు పురికొల్ప నీకు నే దెలుపలేదె
చేరిచిత్రపుటెత్తెలఁ జిక్కఁ జేపఁ
దీయవచ్చితి వలరాజు కైనె యటంచు.

అటులైనను,

చ. ఎఱిఁగియు నీవెఱుంగకో గ్రహింపఁగ నీకరమివ్వవైతి దు
ర్భరమగువాలుచూడ్కులఁ బరాఙ్ముఖివై కనఁ జేయవేకరుల్
దఱియుట తప్పుగాఁ దలఁచి తన్వి ననుం దఱిమింపఁ జేసితే?
మఱువఁదరంబె నీహొయలు మామకచిత్తసరోజభృంగమా!

ప్రభా-(దీనవదనయై పొదరింటిలోని లతావతంసంబు నుద్దేశించి) ఓలతామతల్లికా!

గీ. క్రూరకంటకనిహితార్తిఁ గూలి తాంత
గతిని వాటిని దాఁట శక్యంబుఁ గాక
పొరలుచుంటివి కల్పకభూజమెట్టు
లల్లికొనఁ గల్గెదవు బిగి యారనీవు?

ప్రద్యు-(సుమాళంబున) చిలుకలకొలికీ! నీ కదియా సందియము!

చ. తరుణిరో! కంటకంబులను దాఁటెను నీ తనువల్లి నేఁడిటుఁ
గరుణ నురోజగుచ్ఛములు గాఢముగా హృదయంబునాట స
త్వరముగ నాయురస్థలి ముదంబొదవన్ బెనవేయరాదె సుం

దరి! తడవేలచేసెదవె తాలిమినేనిక నిల్వఁజాలనే.

(అని కదియంబోవుచున్నాఁడు.)

ప్రభా-(వ్రీడాభరంబున నల్లనఁ దొలంగి తనలో)ఈ నామనోహరుండు నాపైఁగల మోహాతిరేకంబుచే నతిసాహసం బొనరించుచుండె. నా చెలికత్తియ లెవ్వరైన వచ్చెదరేమో. వీనిమనం బొక్కింత మరలింప నా తుమ్మెద నుద్దేశించి యిట్లనియెదను. (ప్రకాశముగా.)

గీ. రసముదొరకునె కేతకీకుసుమమందు
వలపుఁగొలుపుట భ్రాంతి లోఁ గులుకుచుండి
తమినివ్రాలెదె కంటకంబులగణింప
వకట! యెలతేఁటి! వెరవిరుగలవని లేవె?

ప్రద్యు-(తనలో)ఓహో! ఈలేమ దివిజకంటకావృతయగుటచే నిరసింతునేమో యని నాభావం బెఱుంగ నిట్లన్యాపదేశంబుగఁ బల్కుచున్నయది. అకటా! ఈ రక్కసుల ఱేఁడైన వజ్రనాభుఁ డీరాకాపూర్ణచంద్రాననకుఁ గృష్టసర్పమువలె దాపరించె.

చ. వినమె సమస్తజీవులును వేడ్కనెసంగుచుఁ బూర్ణిమాహిమాం
శునిఁగని కృష్ణపన్నగము సుక్కఁగఁజేయుటఁ గుందు నయ్యయో!
వనజభవుండు నాకుటిలవర్తను బారిఁదొలంగఁజేసి చం
ద్రునియకళంకరశ్మి దయతోనెజుపన్ జను లుల్లసిల్లరే?

అయిన నాతండ్రిచేఁ గాళియాహిపని యేమయ్యెనో నాచే వీనిపనియు నంతియే కాఁగలదు. (ప్రకాశముగా) లలనామణీ! నీపైఁగల మోహాతిరేకంబుచే నపస్మారుండనై నే పలికినపలుకుల కలుగఁదగునే? వినుము.

సీ. దరహాసచంద్రికాస్ఫురితాబ్జబింబాననముహృచ్చకోరికానంద మొసఁగ
నకళంకకోదండ భృకుటీచలద్వీక్షణాసారమెదజింక నదరఁజేయ
గండతారుణ్యప్రకాశాస్పదారుణాధరముమానసశుకోద్ధతి నెలర్ప
వరతనూలావణ్య వనబాహుమృదుమృణాళములుచిత్తమరాళిభ్రమియఁజేయ

గీ. నీలజీమూతకబరికానిబిడకాంతి
యంతరంగమయూరనృత్యములఁబెంప
సురుచిరభవత్సదాకృతిజ్యోతిఁగాంచి
పరవశత్వంబుఁజెందు టబ్బురమెనాకు?

మోహనాంగీ! రమ్మని లేఖ వ్రాసిన ప్రేమంతయు విడువఁదగినంత యపరాధ మొన రించితి నే? వేయేల. నీ ముఖపంకజామృతతుందిలంబైన నా మనోమిళిందము పెరవిరుల కాసించునే?

చ. కలికిరో ! సంచలించుచును కాయము గాలిపటంబుఁగా సదా
వెలయఁగఁ జల్వతెమ్మెఱలు వెన్నెలవాకలఁ దోఁగి కోర్కెలన్
బలితపు వీచికానిహతిఁ బొల్పడి కూలెడుదాని రాగర
జ్జులఁగొని వచ్చియుంటి నిటఁ జొన్పఁగదే చెలి నీదుకౌఁగిటన్.

(అని కౌఁగిటఁ గదియింపఁబోవుచున్నాఁడు.)

ప్రభా-(తొలంగి క్రీగంటిచూపుల మందస్మితయై వారింపుచుఁ జిలుకనుద్దేశించి.)

క. చిలుకా ! నీకర్థ్మముఁగా, దలఁగి తొలఁగినట్టికొమ్మ కాసక్తిగొనన్
ఫలమే శిక్షార్హంబది, తలఁచెదె భాగ్యంబులేని దానినెలర్పన్ ?

ప్రద్యు-హృదయేశ్వరీ! ఇంకను నన్ను నేరస్థునిగానే భావింపుచుంటివా? అటులైనచో మన ముభయులము సమానశిక్షార్హులమే. కావున,

క. కలికీ ! నాపై నీకీ, యలుకేలే నిన్నుఁబాయకినటుల విరాళిన్
బలికితి నన్నిట ముద్దుల, చిలుకా ! కౌఁగిటను జేర్చి శిక్షింపఁగదే.

(అని ప్రభావతికరంబు గ్రహించి యొక్కకేల నాశ్లేషింప నిరువురు నొకసంకేతలతానికుంజంబునుగూర్చి నిష్క్రమించుచున్నారు.)

గద్య.

ఇది శ్రీమద్వేంకటరమణకరుణాకటాక్షవీక్షణాసారసమాసా
దితరసబంధురకవిత్వవైఖరీప్రవీణాపస్తంబసూత్ర శాం
డిల్యసగోత్రపవిత్ర హోత్రకులకలశార్ణవరాకా
కైరవమిత్ర వేంకటరత్నసుపుత్ర వేంకమాంబా
గర్భశుక్తిముక్తాఫల వివిధవిద్వజ్జనవిధే
య వేంకటకృష్ణనామధేయప్రణీతం
బైన ప్రభావతీప్రద్యుమ్నంబను
నాటకరాజంబున
షష్ఠాంకము.

శ్రీరస్తు.

ప్రభావతీప్రద్యుమ్నము.

సప్తమాంకము.

రంగము: వజ్రపురోద్యానవనము.

[ప్రభావతీప్రద్యుమ్నులు ప్రవేశించుచున్నారు.]

ప్రద్యు - (ప్రభావతికరంబుగ్రహించి) మనోహారిణీ!

గీ. కంటకవికీర్ణదుర్గమ కాననమునఁ
గుసుమరసమునుఁ గడుపారఁ గ్రోలఁగల్గి
దాని విడనాడఁగాలేక తల్లడిల్లు
తేఁటికిని దారిఁజూపు మిందీవరాక్షి!

నే నిపుడు నీ యనుమతిఁగొని ద్వారకాపురంబున కేగెదను. కతిపయదివసంబులలో నేయుపాయంబుచేనైన సముచితలీలల నిన్నచ్చోటికి రప్పించెదను.

ప్రభా - (దీనవదనయై) అయ్యో! ప్రాణేశ్వరా!

చ. నిలుచునె మేనఁ బ్రాణములు నిన్నెడఁబాసినఁ బంజరంబులోఁ
జిలుకవలెన్నలంగుచుఁ గృశించితి నీకొరకిన్నినాళ్లు నే
డలగిరిజాకృపన్ గలిగినట్టి మనోహరభోగభాగ్యముల్
కలఁగను సౌఖ్యసంపదలకైవడి నింక నదృశ్యమౌనొకో.

ప్రద్యు - జీవితేశ్వరీ! ఈ వియోగబాధ నీ కెంతయో నాకు నంతియేసుమా.

చ. నిను విడనాడియున్నరజనీదివసంబులు కృష్ణపక్షముల్
నినుఁగవఁ గూడియున్నఁ దరుణీమణి! నాకవి శుక్లపక్షముల్
మనమును నీపయిన్నిలిపి మైఁ గొనిపోయెద నాజ్ఞనిమ్ముఁ నీ
యనుపమరాగరజ్జు లనయంబునునన్నట నిల్వనిచ్చునే.

ప్రభా-ప్రాణవల్లభా!

గీ. కమ్మతేనియలానఁ జిత్తంబునందుఁ
దలఁచిన మధువ్రతంబు మంజులసరోజ
కుసుమసంచయముల వ్రాలఁగోరుఁగాని
యొక్కపద్మిని నేనమ్మి యుండునొక్కొ.

ఆకారణంబుచే నా కిప్పట్టునఁ గలిగిన సందియం బేమన,

ఉ. ద్వారక కేగి సౌఖ్యముల భాసిలుచున్ మృగయాప్రసక్తి దు
ర్వారవిమోహపాంథజన భావమృగంబుల వేఁటలాడుచున్
బేరిమిగాంచు నీహృదయ పేటిని నిల్చునొ నిల్వకున్నొ శ్రీ
భారతి దీనురాలగు ప్రభావతి నిన్నిటు బాయనోర్చెదన్.

ప్రద్యు- ధర్మపత్నీవతంసమా! నే నెందున్నను మదీయమనోమిళిందము త్వదీయముఖపంకజంబు నే యాశ్రయించి యుండును. నీ కట్టిసందియం బేలకలిగె? సూర్యచంద్రాదులును పంచభూతములును సాక్షులుగా నిన్ను గాంధర్వవిధిఁ బరిణయంబైతి ననుటకు నిదర్శనంబుఁగ నీ వీయభిజ్ఞానంబుఁ గైకొనుము. (అని తన వ్రేలినున్న కనకాంగుళీయమును ప్రభావతి కొసంగుచున్నాఁడు.)

ప్రభా- ప్రాణనాయకా! నాకు మీ పునర్దర్శనము శీఘ్రకాలములోనే లభింపఁజేయ వేఁడెదను.

ప్రద్యు-మంచిది. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

ప్రభా-అకటా! నా ప్రాణేశ్వరు నెడబాయవలసివచ్చె. వాని పునర్దర్శనం బెప్పటికి లభించునో కదా.

ఉ. దీపములేనియిల్లు రవిదీప్తినెసంగని పద్మముల్ బికా
లాపములేని కాననవిలాసముఁ జంద్రుఁడులేని రాత్రియున్
బ్రాపగు భూరుహంబు నెడబాసినవల్లియుఁ బ్రాణనాథు స
ల్లాపసుఖంబులేని యబలామణి యౌవనభాగ్య మెంచఁగన్.

(అంత తెఱలో)

చ. ప్రమదమునన్ ఘనుం గనుట రాజిలి సైకతసీమలందు నృ
త్యములొనరించు నీరవమణి దగ్గఱఁ జేరఁగ గల్గితే మహా

రమ ! యిటులేక దాదటికి రానగు నాయకుఁ డాత్మనాయికన్
సముచిత లీలఁగూడఁగ భృశంబుగ నాటక కైతవంబునన్.

ప్రభా-(ఆలకించి వెఱగందుచు)ఇట్లన్యాపదేశంబుగ బల్కువా రెవ్వరో కదా! శుచిముఖియేఁ గాఁబోలు. ఈ వాక్యముయొక్క యభిప్రాయ మేమో తెలియరాదు.

[అంత శుచిముఖి ప్రవేశించి.]

శుచి-(ప్రభావతిని సమీపించి) ప్రియసఖీ! ఏమి నేడు నీ వింతప్రసన్నవదనముతో నొప్పుచుంటివి?

చ. నెలనిరసించునెమ్మొగము నెమ్మినెలర్పఁ బ్రసన్నమౌచు వె
న్నెల నిరసించునోయనఁగ నీ నవమౌక్తిక దంతకాంతులన్
జిలుకుచు లేఁతనవ్వు జిగి చెక్కులవన్నియవెట్ట సంతసం
బొలుకఁగ వాత్తెలింగనుల నోరననుంగనె దేలనే చెలీ?

(అని చిఱునగవుతో) వైద్యుని చికిత్సాప్రభావము కాఁబోలు.

ప్రభా-(సిగ్గుచే శిరమువంచి ముసిముసినగవుతో)చాల్లేవే-(అని త్రోసివేయును.)

శుచి-చెలీ! వ్రీడాభరంబుచే నీవు చెప్పకున్నను నీ సోయగ మెఱింగింప దనుకొంటివా?

చ. ప్రమదము మీఱ వెన్నెలపు పైకొనఁగల్గిన గండపాళిపాం
డిమము గులాబివన్నియఁ గనించెఁ బ్రసన్నతఁ జెందె మోము నే
త్రములు వికాసమొందె విదితంబుగ నూర్పులు చల్లనయ్యె నో
రమణిరో తెల్పుమిందు ననురాగఫలాభ్యుదయంబు కల్గెనే!

ప్రభా-(సిగ్గుచే శిరమువంచి) సఖీ! శుచిముఖీ! భూతభవిష్యద్వర్తమాన సంవేదినివియుఁ గామరూపసంచారిణివియు నగు నీ వెఱుఁగరానివిషయం బెందుఁగలుగు? నన్నేల పరిహాసించెదవు?

చ. మరుఁడను వేటకాఁడడరి మామకవృత్తికశాబకంబుఁ దా
గుఱి విరితూఁపులందఱుమ గొబ్బుననివ్వెడ కెగుదెంచి నుం
దరమగు పువ్వుటీరమున దాఁగిననిల్వక జేరవచ్చి నే
ర్పరియయి పట్టి వే హృదయపంజరమందిడి లేచిపోయెనే.

శుచి.—చెలీ! నీ మనోహరుం డీవఱకె ద్వారక కేగి యనుచరసహితుండై తిరుగ రాఁ బ్రయత్నింపుచుండును. ఇప్పుడు నాటకులు కొందఱు వచ్చి పురబాహ్యంబున శిబిరంబుల నిల్చియుండిరి. నీవు వేవేగఁజని నీతండ్రిగారి యనుమతిగొని వారిని లోనికి రప్పింపఁ బ్రయత్నింపుము.

ప్రభా.—మంచిది. అటులనే చేసెదను. (అని నిష్క్రమించుచున్నది.)

శుచి.—(తనలో).

మ. మిషలెన్నెన్నియొ బన్నిదైత్యునకు నెమ్మిన్గొల్పి కన్గప్పి నే
భిషజాకారత నీపురంబునకు రక్షింపన్ రహస్యంబుగా
విషమాస్త్రుండు ప్రభావతీరమణి సంప్రీతిన్గొనం గూడఁడే
కృషిచేఁగాదె నశింపఁజేయనగు దుర్భిక్షంబు నెల్లప్పుడున్.

ఇప్పటికి నాప్రయత్నము మూఁడువంతులు నెరవేరినది. కాని.

చ. అనుపమ మోహవారినిధియందుఁ బ్రభావతి చిత్తశుక్తియా
వనమను స్వాతికార్తి హరి పట్టికృపారసవృష్టియోగముం
గనిప్రసవించె వజ్రపురిఁ గ్రమ్మఁజేరు నతండునైన యీ
దనుజుని క్రోధబాడబముదాకినఁ గీడు ఘటిల్లకుండెడున్.

ప్రభావతిస్థితిఁజూడ నీ రాక్షసాన్వయవృక్షంబునకు వేరుపురుగు గంపరించెననియేఁ దోఁచుచున్నది. ఏమన,

చ. రమణికి మోము తెల్లఁబడె రాగిలుచున్న పయోధరంబులుం
గ్రమముగఁ బొంగెఁజూచుక యుగంబుకదున్నలువెక్కెఁ దన్నితం
బములురువయ్యెఁ గార్శ్యమును బన్నెను భోజన మిందకుండెఁ జి
ట్టములతియయ్యెఁ గన్ను లదటుంగ నెగర్భముఁ దాల్చియుండుటన్.

ఐహ్వో! నేనింక నతిరయంబున నే సంపూర్ణకృతార్థురాల నయ్యెదను.

ఉ. పూనికఁ గల్గియున్నయెడ బుద్ధికసాధ్యము లేదు రుక్మిణీ
సూనునకాప్రభావతినిఁ జూపిన నాటక లీల వెండి సం
ధానముఁ గాగనాహవము నందనకై దువ వజ్రనాభుఁడుం
హానినిఁజెందు నాత్రిదశులాత్తిఁదొలంగుదు రింకిటన్నలే.

(అని పైకిఁజూచి) అదిగో! స్వర్గాధినాథుండగు దేవేంద్రుఁ డిటులనే వచ్చుచున్నాఁడు. ఈయుపాయంబునుఁగూర్చి వానితో నొకించుక ముచ్చటించెదను.

[అంత దేవేంద్రుఁడు ప్రవేశించి.]

ఇంద్రు—(శుచిముఖినిచూచి) ఓహో! హంసనారీ! శుచిముఖీ!

క. స్వాతీవర్షంబునకై, మూతలిడకఁ దెఱచియుండు ముత్తెపుచిప్పల్

భాతిని నీవిజయమువిని, ప్రీతిఁగొనెదు తరుణమునకు వేచితిఁదరుణీ.

నీ ప్రయత్న మెంతవరకుఁగొనసాగినదో వక్కాణింపుము.

శుచి—జే పురందరమహారాజా ! (అని నమస్కరించి లేచి) దేవా ! నాశక్తి యెంతకలదో యంతవఱకు నేఁ గృతార్థురాలనైతిని. ప్రభావతీప్రద్యుమ్నులకు గాంధర్వవివాహంబైనయది. కొదువకర్జంబునకై తగుప్రయత్నములు మీరే చేయవలయును.

ఇంద్రు—బలె ! నీ నైపుణ్య మెంతయైనఁ గొనియాడవచ్చు. పూజ్యురాలా ! నీ వింతవరకెట్లు కృతార్థురాల వైతివో యెఱింగింపుము. ఆ వధూవరులకు గాంధర్వవివాహంబైనంతమాత్రమున మనకోరిక లెట్లుఫలించు?

శుచి—దేవా ! అట్లుబల్కెదరేమి?

ఉ. ఇమ్ముగవజ్రనాభునకనేకవిధంబులఁ గన్నుఁగప్పి చి
త్తమ్ములరించి యాజ్ఞగొని తన్వియభీష్టముఁదీర్ప వైద్యవే
షమ్మున వాని నాయతివసన్నిధికిన్గొనివచ్చి దైత్యనా
శమ్మునఁ గొల్పితి న్బదనికన్ఫలియింపవె దానఁగోరికల్.

ఇంద్రు—శుచిముఖీ ! ఇంక మనకుఁ గర్తవ్యమెట్టిదియో నీవే యెఱింగింపవలయును.

శుచి—పురందరమహారాజా ! అనంతరకర్తవ్యంబు నెరవేర్ప మీరేసమర్థులరు.

ఉ. నాటక కైతవంబున జనార్దనసూనుఁడు మీరుఁ గృష్ణుఁడా
ర్భాటముతోఁడ వజ్రపురబాహ్యమునన్ శిబిరాంతరంబులన్
దీటుగ నిల్చియున్న రజనీచరనాథు ననుజ్ఞపైని వెం
ఘాటిగ మీరుమువ్వురు ముదంబున లోనికి రానొనర్చెదన్.

పిమ్మటఁ గయ్యంబుఁ గల్పనఁజేసి వజ్రనాభుని సంహరింపవచ్చును. శ్రీకృష్ణప్రద్యుమ్నులు కైతవనర్తకులై వజ్రపురోపకంఠంబున శిబిరంబులలో వేచియుండిరి.

ఇంద్రు—(సహర్షంబుగ) బలే ! శుచిముఖీ ! నీబుద్ధివిశేష మెంతయైనఁ గొనియాడఁదగు. కడు చక్కనియుపాయ మాలోచించితివి. నే నిప్పుడే జని శ్రీకృష్ణప్రద్యుమ్నులను గలిసికొనియెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

శుచి—(తనలో) నేఁ దలంచుకొన్న కార్యం బిచ్చోట నే నెరవేరినది. నేనింక వజ్రపురంబులోని కేగి యనంతరకర్తవ్యంబు నెరవేర్పఁ దగుప్రయత్నములు చేసెదను.

(అని యిటునటుఁ జూచి) అదిగో! రాగవల్లరి యత్యంతకుతూహలంబుగఁ నిటుల నే వచ్చుచున్నయది. కారణమేమోకదా!

[అంత రాగవల్లరిప్రవేశించి.]

రాగ—(శుచిముఖినిఁజూచి)సఖీ! శుచిముఖీ! ఇంకను నీ విచ్చోటనే యుంటివా? శీఘ్రంబుగ రమ్ము.

శుచి—అంతిపురంబునఁ గ్రొత్తవింతలు పుట్టినాయేమి?

రాగ—ఈవజ్రపురోపకంఠంబున నాటకులువచ్చి శిబిరంబుల నిల్చియుండిరన్నవార్త విని మనచెచ్చెలియగు ప్రభావతి తండ్రియొద్దకుఁబోయి నాటకముఁజూడ నభిలషింపఁగా వజ్రనాభమహారాజుగా రనుమతించి యానాటకులను లోనికిరా ననుజ్ఞనొసంగుటచే వారు వచ్చియున్నారు. ఇప్పుడే నాటకముఁ బ్రారంభించెదరు.

శుచి—ఏమి! వజ్రనాభమహారాజుగారు రాత్రియమంత్రిభటభృత్యామాత్యవర్గసామంతనికురుంబంబుతోఁ గొలువుదీర్చియుండిరా?

శాగ—సందేహమేమి? అంతయు సర్వసిద్ధముగా నున్నయది. రమ్ము.

శుచి—అటులైనఁ బోవుదమురమ్ము. (అని యిరువురు నిష్క్రమించుచున్నారు.)

ఇది విష్కంభము.

శ్రీరస్తు.

ప్రభావతీప్రద్యుమ్నము.

అంతర్నాటిక.

[అంతఃపురమందు సఖీపరివృతయై ప్రభావతి ప్రాసాదతలంబుననుండ మంత్రిభటభృత్య సామంతనికురుంబంబుతో వజ్రనాభుం డోలగమునఁ బ్రవేశించుచున్నాఁడు.]

వజ్ర.—అరే తామ్రాక్ష! నాటక మింకను ప్రారంభింపకుండిరేమి?

తామ్రా.—ఆఁ! దేవా! అదిగో ప్రారంభించుచున్నారు.

[అంత ప్రద్యుమ్నుఁడు సూత్రధారుఁడై ప్రవేశించి]

నాంది.

ఉ. శ్రీరమణీయమూర్తి కృపతోఁ జేరతి నిందు ననేకలీలలన్
జేరికృతార్థతాప్తి నవశిష్టమొకింతయు లేకయుండఁ జే
కూరనొనర్పఁ బుణ్యజనకోటివిరాజితమైన యీసభా
గారము శంబరారి శరకాండసుమాల లలంకరించుతన్.

(అని సభ్యులపైఁ బుష్పములను జల్లుచున్నాఁడు.)

(నాంద్యంతమున) ప్రస్తావన.

సూత్ర—(తెరవంకఁజూచి) ఓయీమారిషా! నీ వొకసారి యిటురమ్ము.

మారి—(ప్రవేశించి) భావా! ఇదిగోవచ్చితిని. ఏమి సెలవు?

సూత్ర—వినుము.

గీ. అమిత దుష్కంటకావృతమైనయడవిఁ
బటుతరతమిస్రమునఁ జిక్కు పాంథుపగిది
రాజసందర్శనార్థ మీరోజునందు
వచ్చితినిమారిషా! ఫలప్రాప్తికొరకు.

నే నిపు డిచ్చో నొకవిచిత్రమైన నాటకముఁ బ్రదర్శింపఁదలంచి యేతత్కార్యనిర్వాహణార్థమై నీసహాయ మపేక్షించి నిన్నుఁబిలిచితిని.

మారి—భావా! మీరు దర్శింపఁదలంచిననాటక మేది?

శుచి—(జనాంతికముఁగా) చెలీ! ప్రభావతీ! వింటివా సూత్రధారుని పలుకులు?

ప్రభా—(అపవారించి) శుచిముఖీ! రాజశబ్దము సాభిప్రాయగత మని తలంచెదను.

రాగ—(జనాంతికముగా) చెలులారా! సూత్రధారుఁ డిపు డేమియోఁ బలుకుచున్నాఁడు.

సూత్ర—మారిషా! వినుము.

చ. చటుల పరాక్రమస్ఫురణ సర్వసుపర్వులవేఁచుచున్న యా
కుటిల నిశాచరాన్వయని కుంజమునందునఁ బొల్చుపుష్పసం
ఘటనముఁ గోరి తన్నిశితకంటకఖండనమున్ బ్రసిద్ధమౌ
పటుతరనాటకంబు నెఱపం దలఁపూనితి మారిషా! యిటన్.

మారి—బావా! మహనీయులగు నసితాంగుఁడు ననేకాత్ముఁడు మీకు సహాయులై యుండ మీకు జయము కలుగకుండునా?

మ. మునువృత్రాసురుఁ జంపి కావ సురలన్ముఖ్యుండెవండయ్యెఁ గం
సునిఁ ద్రుంప న్శిశుపాలునిన్గడప నేశూరుండు ప్రాపయ్యె నా
ఘనులౌ నందకుమారశక్రసదృశుల్కల్యాణ మూర్తుల్మిమున్
గనిసాహాయ్య మొనర్పఁబూనిరిక మీకార్యంబు గాకుండునే?

వజ్ర—(రోషకషాయితాక్షుండై గద్దెపైనుండి చివాలున లేచి)

పంచచామరము. అరేవృథాభిమాని! మారిషా! పురందరుండుమున్
దురంబునందు నోఁడె నింక తుచ్ఛుఁడైన చక్రికిన్
దరంబెనన్నుఁ గెల్వఁ బ్రల్లదంబులిట్లుఁ బల్కెదే?
పరాకిదేల వజ్రనాభు బాహుశక్తి నెంచవే?

తామ్రా—(వజ్రనాభునితో) ఆఁ! దేవా! నాటకమాడుచుండిరన్నమాట మరచితిరాయేమి?

సూత్ర—మారిషా! వినుము.

చ. నవరసపూజితంబు సుమనఃప్రియసంగ్రహణోచితంబు స
ద్భువనమనోహరంబు బహుపుణ్యజనావళిసేవితంబు ద
ర్పవిలసితంబు వజ్రపురరాజవిరాజితసత్పథంబు నా
నవిరళనాటకం బభిమతాప్తికి నాఁడఁ దలంచితిన్జుమీ.

నీ సహాయంబుచే నే నిక్కార్యంబునఁ గృతార్థుండను కావలయును.

ప్రభా—(జనాంతికముగా) సఖీ! శుచిముఖీ! ఈ కుశీలవులమాటలు భావగర్భితములుగాను న్నయవి. వీర లెవ్వరో నీ వెఱుంగుదువే?

శుచి—(తనలో) శక్రుండును చక్రపాణియుఁ దనకుఁ బాసటయై యుండిరని తెగించి సూత్రధారవేషంబునవచ్చిన యీ ప్రద్యుమ్నకుమారుండు వజ్రనాభునితోఁ జేరి కయ్యముఁ దెచ్చుటకుఁ బ్రయత్నించుచున్నాఁడు. ఇట్లు త్వరపడిన నేమియుపద్రవము తటస్థించునో కదా. (అపవారించి) చెలీ! ప్రభావతీ! వీరు నీ వెఱుంగనికుశీలవులు కారు. వారిభావగర్భితంబులు నీ వెఱుంగనివి కావు. నన్నేలయడిగెదవు? కొంచెము సేపు తాళితివేని సర్వము నీవే తెలిసికొనఁగల్గెదవు.

రాగ—(అపవారించి) సఖులారా! ఈసూత్రధారుఁడు వజ్రనాభమహారాజుగారి మ్రోల రాక్షసవంశమును నిందించుచు శత్రుసంహారనాటకంబును బ్రదర్శించెదనని వాక్రుచ్చుచున్నాఁడు. ఈ సాహసికుఁ డెవ్వఁడో కదా!

మారి—భావా! నే నిపుడు చేయవలసినకార్య మేమియో యానతిచ్చెదరా?

సూత్ర—మారిషా! నీవుపోయి వేవేగఁ బాత్రములను సిద్ధము చేయుము. వీరోచితనాటకంబుచేఁ బుణ్యజనులైన యీసభాసదుల సంభావింతుము.

మారి—మంచిది. అటులనే చేసెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు)

సూత్ర—(ఆలకించుట నభినయించి) అదిగో! కుశీలవు లప్పుడే గానమున కుపక్రమించుచున్నాఁరు.

(అంత తెఱలో)

గీ. పుణ్యజను లెల్ల దక్షిణాంశబునకుఁ బోవు
సమయమయ్యెనుసవర్తి శాసనమున
సాగుసురదైత్యవరవధూ యోగమింక
నహహా! కాలప్రభావ మేమనగవచ్చు.

సూత్ర—నేను కూడఁ జని కర్తవ్యమాచరించెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు).

ఇది యంతర్నాటికా ప్రస్తావనము.

శ్రీరస్తు.

ప్రభావతీప్రద్యుమ్నము.

[అంత నసితాంగమహారాజు గారనేకాత్ముఁడను మంత్రితోఁ బ్రవేశించుచున్నాఁడు].

అసి — ఓయీ యనేకాత్మా! సహస్రాత్ముండనని యనిపించుకొనుటకా నీవీ పేరుఁ బెట్టుకొంటివి? విశేషవిషయంబు లేమైనం గలవా?

అనే — దేవా! మీకుఁ దెలియని విశేషవిషయంబు లెందుఁ గలుగు? అయిన నామనోగత విషయం బెఱింగించెద వినుండు. నామిత్రుం డొకండు కొండొక దైత్యరాజతనూజపై బద్ధానురాగుండై యున్నవాఁడు. ఈ యఘటితఘటనాయమాన భగవతీసంకల్పం బెట్లు నెరవేరునో తెలియరాదు.

ప్రభా — (తనలో) ఆ పురుషుండు నా మనోహరుండే కాఁబోలు

అసి — దైత్యకంటకోల్లుంఠనంబునఁ గాని వాని ప్రయత్నము కొనసాగునా? ఎక్కడనో గాని నిర్మలమైన యనురాగవాహిని నిరర్గళముగఁ బ్రవహింపనేరదు. మఱియు

గీ. కమ్రతావి నొసంగు పుష్పమ్ముఁ గొనఁగఁ
గంటకములుండవే? యట్లుకాక వినమె
కలుగు శ్రేయంబులకును విఘ్నములటంచుఁ ?
గాలమొదవిన ఫలసిద్ధిఁ గాంచవచ్చు.

వజ్ర — (మహోగ్రకోపంబుతో గద్దియనుండి లేచి కరవాలమును ఝుళిపించుచు) అరే! వృథామంగళపాఠకులారా! శైలూషాధములారా!

ఉ. ఎవ్వఁడురా త్రిలోకములనేర్చెడు దానవకంటకంబులన్
ద్రవ్వఁగఁ జాలువాఁడు రణరంగమునన్ బ్రళయాంతకుండనై
నివ్వెఱగందఁగాఁ బెఱుకనిర్జరకంటకకోటి శక్తుఁడన్
గ్రొవ్విమదాంధులై పలుకఁగూడునె నాయెదుటన్ బ్రతాపముల్.

రోమం—(వజ్రనాభునితో) ఆఁ! దేవా! ఇది నాటకముగాని యదార్థకథనముగాదు. మీ రాగ్రహింప నేల? వారి యభిప్రాయమేమో పూర్ణముఁగా వెల్లడికానిండు.

రాగ—(అపవారించి) సఖులారా! ఈ పురుషులు కైతవనాటకులుగాని నాటకులు గారని తోఁచుచున్నది. ఇట్లు దైత్యకంటకోల్లుంఠన సంభాషణంబుల వీర లెట్లు కృతార్థులయ్యెదరు?

శుచి—(జనాంతికముఁగా) సఖీ! రాగవల్లరీ! వారీవిధంబుననే కృతార్థులయ్యెదరు. మఱియు,

గీ. ఆత్మగతకార్యనిర్వాహణార్థమైన
పలుకులకునాగ్రహించుట భావ్యమగునె?
నాటకముఁజూడనర్హులై నారువీరు
వారుప్రత్యర్థులై యట్లు పలుకుచుండ్రి.

అసి- మంత్రివరా! గీ. కుటిలసంచారియును విషఘోరమైన
కృష్ణసర్పంబుమాళిరాగిల్లుమణిని(
గైకొనఁదరంబె యీ యురగంబుఁగెడప
కుండ నీమిత్రుఁ డెంతటికుశలుఁడైన.

అనే—దేవా! దేవరవాక్యం బమోఘంబగుగాక. నామిత్రుం డావజ్రనాభసంహారకార్యసిద్ధికై యనేకవేషంబులు వేయుచుండె. అయినను,

చ. అనయముఁ బాంథలోకము స్వరాతపమేదఁదలంచికోమ్మలక్
గనుఁగొనఁగోరుచుందురు సుఖంబొనఁగూడునె కృష్ణపన్నగం
బెనసిననందు దానిఁ బొలియింపమివ్యర్థులు గారొకో నరేం
ద్రునివలనన్ గృతార్థతఁగనుం సఖుఁడంచు దలంచెదన్మదిన్.

వజ్ర—(కోపదందహ్యమానమానసుండై పండ్లు పెటపెటఁగొఱుకుచు) ఆరే! దుర్గర్వాహతకులారా! నిఖిలలోకభయంకరుండగు వజ్రనాభుని సంహారింప నెవరితరంబురా?

పంచచామరము. దురాత్మ! ప్రేలెదేలయిట్టి దుష్ప్రలాపములరా
సరిన్బనంగినన్ను గెల్వఁజాలువాఁడెవండురా?
కరంబునందుఁ దాల్చియున్న ఖడ్గధారనిన్ను సం
హరించుఁజూడు మిన్నకున్న నాఁడివజ్రనాభుఁడే.
(అని కత్తిని సవరింపుచున్నాఁడు).

కళో—(వజ్రనాభునితో) ఆఁ! దేవా! ఇచ్చోట దేవరవారివినోదార్థమై నాటకమాడు చుండిరి. మీ రిట్లు కోపోద్రగులగుచుండిన వా రెట్లు నాటకమాడఁగల్గెదరు? శాంతింపుఁడు.

ప్రభా—(జనాంతికముఁగా) అయ్యో! సఖులారా! ఈ కుశీలవుల దారుణోద్యోగభావగర్భితవాక్యంబులును నాతండ్రిగారి సంరంభవిజృంభణంబునుఁ జూడ నా కేమో భయముకలుగుచున్నది. ఏమిచేయుదును?

శుచి—(అపవారించి) చెలీ! ప్రభావతీ! ఇప్పుడే నీమనోధైర్యంబునుజిక్కఁ బట్టవలయును. (అని రంగస్థలమువంకఁజూచి) సఖీ! అదిగో! మఱియొక పురుషుఁడు ప్రవేశించుచున్నాఁడు. చూడుము.

[అంతఁ బ్రద్యుమ్నుఁడు పాములబుట్ట శిరంబునఁబెట్టి మూపున నాగస్వరపు బుఱ్ఱ వ్రేల భద్రుండను పేర పాములవానివేషముతోఁ ప్రవేశించును.]

భద్రు—బాబూ! బలే సామంతమైన నల్లతాచుపాము. బహుపొగరెక్కియున్నది. చూడుఁడు. (అని పాములఁబుట్టఁ గ్రిందఁబెట్టి మూతఁదీసి నాగస్వరముఁ బాడుచు నాడించుచున్నాఁడు.)

అనే—ఓరీపాములవాఁడా! ఈకృష్ణసర్పము నెచ్చోటఁ బట్టితివిరా?

భద్రు—బాబూ!

ఉ. సల్లలితప్రసూన మృదుసౌరభ సంపదకాసఁ జెంది నే
నల్లనఁబోయి యొక్కబిలమందునఁగాంచి ఫణాగ్రరత్నమం
దుల్లముజిక్కనక్కటికి మూనకవజ్రపురంబులోని జి
ల్లెళ్ళ పాదన్ గ్రహించితి మఱీమనరంధ్రను దీనినో ప్రభూ.

అసి—అనేకాత్మా! ఈకృష్ణసర్పము తక్షకుఁడేసుమా. ఇంద్రసంరక్షణచే బోతరించి యెట్లుమినమినలాడుచున్నదో చూడుము.

అనే—దేవా! ఇంక నాయింద్రునియుపేక్షచే నది క్షీణింపకుండునా?

భద్రు—బాబూ! సందేహమేమి? ఈలేలిహానమునన్నెంతయైనఁ జిక్కులుపెట్టినది. (అనిసర్పమునుద్దేశించి) ఓసుచ్ఛితవిషోరగమా! ఇంద్రపదంబుఁ జెందితినని గర్వించుచుంటివా?

చ. అనఘుఁడుశంకరుండు గళమందు నినుంధరియించినంత నా
వినతసుతున్ హసించెదె వివేక మొకింతయులేక నీశిరం
బున హరిపాదచిహ్నమును బూనినయంత నె త్రుళ్ళఁబోకు నె
మ్మిని నిను ఘంటుఁగల్ప జనమేజయుఁడుండఁడె కృష్ణసర్పమా.

మఱియు,

చ. ఘనమకుటాగ్రభాగమునఁ గ్రాలుమణిన్గొని విఱ్ఱవీగదే?
ప్రణుత నరేంద్రుచేత నె కరండమునందునఁ జిక్కినప్డు బు
ర్రనుపయికెత్త నీకుఁ దల ప్రాణము తోఁకకు రాకయున్నె? యిం
కను కనుగల్గి వర్తిలుము గర్వమువీడుము కృష్ణసర్పమా.

(అని నాగస్వరపుబుర్రతో దాని నొక చెంపఁబొడుచుచున్నాఁడు.)

అసి—అనేకాక్షా! ఈదుష్టోరగజాతి లోకకంటంబుఁగనే యున్నదిసుమా. ఏమన,

చ. గొనబగుకమ్మతావి నొసఁగుంగద చెంత మెలంగనంచుఁ జం
దనతరుఁ జేర శక్యమగునా యట బుస్సను కృష్ణపన్నగం
బును వెలిఁ ద్రోయకుండ? వలపుంగొని దూరమునందునిల్చి తృ
ప్తినిగని సజ్జను ల్జగతిఁ బ్రీతిఁదలిర్ప నెసంగుచుండరే?

అనే—దేవా! నిశ్చయమే కాని నాకొక్క ధైర్యము కలదు. ఏమన నీకుటిలకుండలి కరండమునం దడంగియుండవలసినదే కాని పైకి తలయెత్తి తిరుగఁజాలదు. ఇంత యేల.

ఉ. ఆరయ దర్భనాకి యమృతాప్తికి నాల్కలు రెండుకాఁగఁ బెం
పారి దురుద్ధతిన్ బిలవిహారముసల్పు చడంగుఁగాని యా
భైరవిగారుడప్రముఖ బంధచయంబులఁ గట్టఁజాలు నీ
ధీరు నరేంద్రుఁ గృష్ణఫణి తేఱికనుంగొన సాహసించునే?

భద్రు—బాబూ! తగినశక్తియుక్తులులేక యేమరియున్నచో నీకృష్ణసర్పముచే నరేంద్రునకేగాక చెంతఁజేరువారందఱకు నుపద్రవమే సంభవించును. కాని యీదుష్టోరగము పట్టినకొద్దికాలమువరకు బహుతేజుగనుండి యొకయెడ సురింగె. పిమ్మట మరలఁబట్టి రాఁజేసితిని. బాబూ! ఇప్పుడు లోలోపల రోజుచుండునే గాని మునుపటిపొగరంతయు నడంగినది.

అసి—ఇదివరలో తగిలినదెబ్బలకుఁ గోఱలూడిపోయెఁ గాఁబోలు.

అనే—ఓరీపాములవాఁడా! దీని నీ వేలయుపేక్షించుచుంటివి?

చ. కనుపొరగప్పియున్న యెడఁ గాంచఁగనేరక క్రిందుమీఁదు త్రొ
క్కును కడతేర్పకున్న నెటులోఁగఱవంగఁ దలంచు దీని స్వే
చ్ఛనువిడువంగ రాదుసుమి చప్పిడిదెబ్బల లక్ష్యపెట్టునే?
విను సవరైన దుడ్డుఁగొని పిండిఁగ దంచుము కృష్ణసర్పమున్.

భద్రు—(బుట్టలోనిపాము వెలికిరా మరల నందులోనికిఁ ద్రోచి) ఓతుచ్ఛకాకోదరమా! నీ వేనాడోచచ్చినట్లు పడియుండవేని బాబుగారు సెలవిచ్చినట్లు చేసెదను. నీకింత గర్వమేల?

చ. వనధిజనింప నాయమృతపాత్రనుగాచెద నేరికైనఁ గై
కొనఁదరమానెయంచు నడుగుంబడిత్రుళ్ళవె? రెండుకళ్ళదు
మ్మునుబడఁజేసి యావినతపుత్రుడు దాని గ్రహింపలేదె? నీ
కనువగుమూలనే యొదుగనోఁదలయెత్తక కృష్ణసర్పమా.

అని—(తనలో) ఈ పురందరుండు తనకు వజ్రనాభునిపైఁగల కోపాతిశయంబుచే వజ్రనాభ భావగర్భితంబుఁగ నీకృష్ణసర్పముయొక్క బుద్ధిను సమగ్రముగఁ జితుకబో దువుమని ప్రద్యుమ్నున కుపదేశించుచుండె. ఆహా! ఏమి వీనిపంకము! (ప్రకాశముఁగా) ఓరీ పాములవాఁడా! ఈకృష్ణసర్పముయొక్క శిరోమాణిక్యము నూడఁబెఱికితివాలేదా?

భద్రు—బాబూ! సర్వజనకంటకసంచారిణియైన దీనిబుద్ధి సమగ్రముఁగఁ జితుకఁబోదు పకుండ నా కది పూర్ణముగా స్వాధీనమగునా? ఇట్లెన్నిసార్లు పొడిచినను దీనికి సిగ్గులేదు.

అనే—మాటలు చేతనా?

భద్రు—

మ. వినుఁడీ నేనిటవజ్రముల్గొనఁగఁ గావింపన్వలెన్వజ్రనా
భనిరోధప్రతికార మేక్రియను ప్రాపై మీరునాకాంక్షితం
బునుసిద్ధింపఁగృతార్థులయ్యెదరొ బాబూ!

అనే—
వెఱ్ఱివాఁడా! నరేం
ద్రునిచేఁజిక్కినఁ గృష్ణసర్పమణి నిందున్ గైకొనన్ రాదొకో.

వజ్ర—(మహోగ్రకోపంబున గద్దెపైనుండి చివాలునలేచి) ఓరోరి కుశీలవాధములారా!

ఉ. బిచ్చముఁగోరివచ్చితిరి భిక్షుకులార! మదీయక్రోధపుం
జిచ్చునఁగూల దుర్మదముచేఁ గడుక్రొవ్వుట బ్రేలుచుండిరే?
ఇచ్చటవజ్రనాభు నెదిరించి ప్రతిక్రియ నాచరింపఁగాఁ
జచ్చుటయా మదీయ పటుశాతకఠోర కృపాణధారచేన్.

భద్రు—(రాక్షస సభవంకదిరిగి వజ్రనాభునితో)

శా. రక్షోవల్లభ ! యర్థివౌచునిటులన్ రప్పింపఁగా నేను ప్ర
త్యక్షామోదకరప్రభావతినిఁ బ్రత్యర్థక్రియావాప్తి బల్
దక్షత్వంబున వజ్రనాభ సదమూల్యంబౌ లసద్రత్నపుం
భిక్షంగైకొనవచ్చినాఁడఁ జుమి పృథ్వీకంటకాగ్రేసరా.

ఇంక చల్లకువచ్చి ముంతదాచనేల? నీ దానధారాపూరంబున.

క. ఆజీవనమునుగొనురవి, తేజంబున వారిజంబు దీపింపదె? నే
నీజీవనమున దానవ, రాజాననగైకొనంగ రానయ్యెఁజుమీ.

రోమం—(అత్యుగ్రకోపంబుతో లేచి) ఆఁ! దేవా! ఈ నర్తకాధముండు దేవరవారికుమారీమణిని వివాహోచితంబుగఁ గైకొనంగోరి విరోధిగా వచ్చెనట. వీని నింక యుపేక్షింపరాదు.

తామ్ర—ఆఁ! దేవా! ఏలినవారి సెలవైనచో నిప్పుడే యీ నరకీటకంబును బలమైన నా యీ గదాదండముచే నలిపిచంపెదను.

కరో—ఆఁ! దేవా! వైద్యవేషమ్మున దేవరవారి శుద్ధాంతంబునకేగిన నరాధముండు వీఁడే కాఁబోలు. వీనిని వేవేగ సంహరింపవలయును.

వజ్ర—(ప్రళయకోప దందహ్యమాన మానసుండై పండ్లు పెటపెటఁగొఱుకుచు ఖడ్గంబు నవరింపుచు మహోగ్రంబుగఁ బైకురికి) అరే! ద్రోహి!

పద్మనాభవృత్తము.

ఓరోరి ద్రోహప్రచారా! మదోన్మత్త! ఉద్వృత్తిచే బ్రేలెదే నాదు మ్రోలన్
సైరింతునే నీవు కోరన్మదీయాత్మజన్ మూర్ఖ! కాఙ్క్షోవ్వితే? వజ్రనాభున్
జేరం దలంపూని తారాఫలభ్రాంతి చేమంటపై వ్రాలుపుర్వు న్బలెన్? వే
రారాయిక న్వేషధారీ! నినున్నే బిరాన న్వధింతున్ మహాఖడ్గధారన్.

(అనిఁ ప్రద్యుమ్నుని గదియుచున్నాఁడు.)

ప్రద్యు—ఓరీ! దుర్మదోదగ్రవాచాల! నీ సంరంభవిజృంభణం బికఁగట్టి పెట్టుము. పట్టి బీరము లేలపల్కెదవు? చేతనైన నాతో రణంబు సల్పుము. (అని విజృంభించుచు.)

లయగ్రాహి.

రాక్షస! దివౌకసవిపక్ష! నిను నింతదను కక్షతునిఁ జేసితిఁ గటాక్షమున
నీవా, యక్షులజయించి గిరిపక్షములఁ ద్రుంచుహరి శిక్షయొనరించు

టొక లక్షణమెనీకుఁగా, దక్షతనునీ మొదటి బిక్షుకుఁడుగాని సిరి వక్ష
మునఁదాల్చు కమలాక్షుఁడునుగానీ, రక్షణముసల్పిన సమక్షమునఁ
ద్రుంచినిను నీక్షణమనేను మది రేక్షణగ్రహింతున్.

రోమం—ఆఁ! దేవా! ఈ యల్పనరకీటకంబుపై మీరు కడంగవలయునా? ఈ నా ఖడ్గభు
జంగంబు వీనిప్రాణవాయువులను గ్రోలుటకుఁ ద్వరపడుచున్నయది. నాకు సెల
వొసంగెదరా? మీయెదుటనేఁ వీనిని సంహరించెదను.

వజ్ర—ఆఁ! రోమంధస! మంచిది. వీనిని శీఘ్రంబుగఁ గడతేర్పుము.

రోమం—చిత్తము (అని మహాసంరంభంబునఁ బ్రద్యుమ్నునితోఁ బోరి యోహాటించి ప
లాయితుఁడగును.)

(ఇటులనే తామ్రాక్ష కఠోరదంష్ట్రి లోహాటించిన యనంతరంబ)

ప్రద్యు—(ప్రభావతి నుద్దేశించి వజ్రనాభునితో)

క. పూనికనీకై వచ్చితి, సూనాస్త్రుఁడనేనురక్కసులయుప్పరిగన్
రాణించెడు దానవనరు,గా నినుసాధించిగెలుపుఁ గైకొందుఁజుమీ.

(అని రభసంబున విజృంభించుచు వజ్రనాభునితో)

ఓరీ నక్తంచరాధమా!

ఉ. చూచితెనీదుమంత్రులగు శూరుల కేగతి సంభవించెనో?
తోఁచదె? నీవు నావిపుల దోర్బ్యగవహ్నికి నిల్వఁజాలెదే?
నీచ! పదంబులంబడుము నీయసువుల్బయి నాసగల్గినన్
గాచెద లేనిచో నిపుడ కాలునిప్రోలున కంపెదన్నినున్.

వజ్ర—(అత్యంతకోప ఘూర్ణమానతారకుండై రోజుచు) అరే దురాత్మ! అరే బాలిశా!

స్రగ్ధర.

ఓరీదుర్గర్వ! మూర్ఖా! యురకపయిపయిన్ హుంకృతుల్మీరనన్నున్
జేరన్నీకెగ్గుకల్గున్ జెనటి! తొలఁగుమ క్షీణదోస్తంభవీర్యా
సారంబైనట్టి నా శస్త్రముగనుమిదిగో సాహసంబూనినిల్వన్
ఘోరాజిన్ ద్రుంతునిన్నుంగగుయికయిమనుచుస్నాయుచున్నేలగూలన్.

(అని యుద్ధమునకు మొనయుచున్నాఁడు.)

అసి—ఓరీవజ్రనాభా! ఈశ్వరవరప్రసాదంబుచేఁ బెచ్చుపెరిఁగి క్రిందుమీదుఁ గానక
త్రుళ్లిపడుచుంటివి. నీపాగ రడంగు కాల మాసన్నమైనది. వినుము.

చ. అరయక దుశ్చరిత్ర నబకలాంగుఁడు శంకరుఁ డిచ్చినట్టి యా
వరములఁగన్నుఁ గానక దివౌకస పీడ నొనర్చినట్టి ము
ష్కరులగు నీదుపూర్వులకుఁ గల్గినశిక్ష యెఱుంగవై తె? దు
ర్భరతర సాధుశాపమున భస్మముగావె వరప్రభావముల్?

వజ్ర—అరే! ప్రేలరీ! ఎవఁడవురానీవు? (అని యసితాంగునిపై విజృంభించుచున్నాఁడు.)

అసి—ఓరీ! దుర్మదాంధా!

ఉ. ఏమిర నన్ను నీవెఱుఁగవే వరగర్వముచేతఁద్రుళ్లెదే ?
రాముఁడనై వధించితిని రావణునిన్ బలి దైత్యుఁద్రొక్కితిన్
వామనమూర్తినై చు శిశుపాలునిఁజంపిన కృష్ణుఁడన్ సుర
స్తోమశరణ్యుఁడన్ వినుము దుర్మద ! నిన్గడతేర్పవచ్చితిన్.

ప్రద్యు—ఓరీ తుచ్ఛనిశాటా!

ఉ. చేవయొకింత యున్నహత శేషసురారులలోననిల్వుమీ
ఈవిధినిన్నుఁజిత్రవధ నేనొనరించెదఁ బొట్టఁజీల్చి నీ
ప్రేవులదాల్చి నాయఱుత వెచ్చనినెత్తురు ద్రావి పెండ్లికిన్
బ్రేవుమటంచుఁబోయెద వరించెద నీదునుతన్ ప్రభావతిన్.

(అని యుద్ధమునకు మొనయుచున్నాఁడు.)

వజ్ర—(శరీరము కంపింప రోషకషాయితాత్ముం డై తనలో) ఏమిచెపుమా! నా దేహమం తయు వడంకుచున్నయది. నా వామనేత్రంబు నా వామభుజంబు నదురుచున్నయవి. ఇదియేమి దైవమాయయో తెలియరాదు. అయిన నావంటివీరాధివీరున కిట్టి నిమిత్తమాత్రంబు లొక లెక్కయే? (హుమ్మని యార్చుచు గఱచి పండ్లు పెటపెటఁ గొఱుకుచు కత్తిసవరింపుచు ప్రకాశముఁగా) అరేరే ద్రోహి! కైతవవర్తనాధమా!

ఉ. ప్రేలకుమింక నోరి రణభీరువ ! నోటికి వచ్చినట్లు నా
కేలనుఁదాల్చియున్న పటుఖేటకముగ్ గనుఁగొమ్ముదీని చే
నాలములోన నిన్ను దునుమాడెదప్రేల్మిడి మానుమట్టివా
చాలత నీదుపౌరుషముసాగదు నాయెదుట న్నరాధమా.

(అని పెల్లాగుచు రణంబునకు డీకొనుచున్నాఁడు.)

శుచి—(తనలో) పహ్వా! ఈదైత్యాధముని గాత్యాయనీదేవి యావేశించెఁ గాఁబోలు. వీనిసర్వాంగములు నెత్తుపడంకుచున్నవి!

ప్రద్యు—అరే! దుర్మద! శివెక్కినదాయేమి? ఏలవడెంకెదవు? రారమ్ము. నీగర్వంబిప్పుడే యపనయించెదను. (అని మార్కొనుచున్నాఁడు.)

వజ్ర—(మహార్భాటంబుతో కత్తి ఝుళిపించుచు) ఓరీనరాధమా!

పంచచామరము.

హుటాహుటిన్మదోగ్రభంగి హుమ్మటంచు లేచె దీ
విటుల్మనుష్యకీటకంబ యేర యింక నా సము
త్కటప్రభూతరోషవహ్ని దాకి నిల్వనీకు దు
ర్ఘటంబు ప్రేలకుండుమింక కండకావరమ్మునన్.

(అని కదిసి కొంతతడ వత్యుగ్రంబుఁగ సాహసంబొనరించి యిరువురు నొకవిజనస్థలంబునకు నిష్క్రమింతురు.)

ఇంద్రు—శ్రీకృష్ణా! సుతవత్సల! మనప్రద్యుమ్నుం డతిసాహసంబున నీరాక్షసేంద్రునితో రణంబునకు డీకొనియె. ఎట్లోఁగదా!

పంచచామరము.

వరప్రభావుఁడైన ఘోర వజ్రనాభదైత్యునిఁ
దరంబెచంపలాతిఖడ్గ ధార నెట్టివానికిన్

శ్రీకృ—ఓయీసహస్రాక్షా! భయపడకుము.

తిరంబుఁగాఁబెనంగ బార్వ తీకృపన్నిజాసిచే
దురంబులోనఁజచ్చుఁ గంపి తుండుగాన దైత్యుఁడే.

మఱియు నేనిప్పుడే పాలికలనికేగి యదృశ్యుండనై యుండి నామాయచే నా దైత్యాధముని స్వశస్త్రహతునిగాఁ జేసెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

ఇంద్రు—(ఉత్కలికఁ దనలో) వహ్వా! ఇంకనాకు భయమెక్కడిది.

(అంత నుప్పరిగ నొకకలకలంబు వినంబడ నాలకించుచున్నాఁడు.)

రాగ—అయ్యో! ప్రియసఖీ! ప్రభావతీ! ఎంతగాఢమూర్ఛమునింగియుంటివే !

శుచి—(తనలో) ఈలేమ కపటనాటకవేషధారియగు భద్రుండు తనమనోహరుండే యని యెఱింగినతోడనే విషాదానందరసనిమగ్నయైయిట్లు మూర్ఛిల్లె. ఇప్పుడేమిచేయనగు? (ప్రకాశముఁగా) ప్రభావతీ! ప్రభావతీ!

క. చెలియరో యేమే యిటు మూ
ర్ఛిలియుంటివి? నీమనంబు చెదిరెనె? నీకో

ర్కాలు కొనసాగును నిన్నా
కలన న్నీవిభుఁడు జయముఁగ నిగ్రహియించున్.

ఇంద్రు—(తనలో) అన్నా! పాపము! ఈయుపద్రవమువలన నా కన్నియ కెట్టికీడువాటిల్లునో కదా!

చ. అసురకుమారి యయ్యు నసురాంతకపుత్రునిఁ గోరియుంట నీ
బిసరుహనేత్ర నెమ్మనము వెన్కకుఁ బోయిన గొయ్యి ముందుకున్
వెసఁ జన నుయ్యి కాఁగ దురపిల్లుచుఁ గ్రక్కున గ్రుంగ వీలుఁగా
కుసురు చలింప మూర్ఛిలె నయో! యిది యేమి యుపద్రవంబొకో.

కానిమ్ము. అంతకును భగవంతుఁ డగు శ్రీకృష్ణుఁడే కలఁడు.

ప్రభా—(మూర్ఛ తెలసి లేచి జనాంతికముగా) సఖులారా! నాజనకుండా పురుషవతంసునితో నింకను రణంబు సల్పుచునేయుండెనా?

రాగ—ప్రియసఖీ! వారిరువురకు నింకను సమరంబు జరుగుచునేయున్నది ఏరికిని జయాపజయంబులు తేలలేదు.

ప్రభా—సఖీ! శుచిముఖీ! ఇప్పుడు నే నేమి చేయుదునే?

చ. తనువునొసంగి నన్ను సతతంబును ప్రేముడిఁ బెంచునట్టి నా
జనకునిపైని ప్రేమ విడఁజాలుదునా? యటు చిత్రలీల నా
మనము హరించినట్టి నవమన్మథు నాపతిఁ బాయ నోర్తునా?
వినుటకు మున్న నేరి మృతి వీడెద ప్రాణముల న్సఖీమణీ.

(అని మరల మూర్ఛిల్లుచున్నది)

ఇంద్రు—(తనలో) అన్నా! ఈనవలామిన్న దుర్భరమనోవేదనచేఁ బ్రాణపరిత్యాగముఁ జేయుటకు సాహసించుచున్నది. ఎట్లో కదా!

(అంత తెఱలో)

ఉ. ఆగ్రహమూర్తియై చుఁ బ్రళయాంతకుఁడో యన వజ్రనాభుఁ డ
త్యుగ్రకృపాణపాణియయి యుద్ధమొనర్చుచుఁ గంపితాంగుఁడై
నిగ్రహవృత్తి మే నెఱుఁగ నేరకఁ దాఁకిన ఖడ్గధారచే
నుగ్రగతి న్మృతింగనియె నో రజనీచరులార! వింటిరే.

ఇంద్రు—(సోత్కంఠుఁడై) ఓహో! ఏమి నాభాగ్యము! ఇంక నాకష్టములన్నియుఁ గ
ట్టెక్కె. వహ్వా!

గీ. అఖిలలోకైకకంటకుఁ డైన వజ్ర
నాభదైత్యుండు మృతిఁజెందఁ శోభఁగాంచె
దశదిగంతము లెసఁగను హాస్తములనిలిపి
సర్వజీవులు నిద్రించుఁ సౌఖ్యమెసఁగ.

(అనియిటునటుఁజూచి) అదిగో! సమీపంబునఁ గాళీయాలయంబు గాన్పించుచున్నది. నే నచ్చోటికేగి యా భగవతి నర్చించెదను. (అని పరిక్రమించుచున్నాఁడు.) (అంత తెఱలో) హాహా! హరికేశవులారా! సమస్తదేవతలారా! మా నెచ్చెలియగు ప్రభావతిని రక్షింపుఁడు. రక్షింపుఁడు. ఓముకుందా!

మ. రజతాద్రీశునకైన దుర్లభుఁడఁవౌ యార్తత్రాణపారీణ! యో
త్రిజగత్పావన! భక్తలోకశరణా! దీనావనా! సత్కృపన్
గజరాడ్గామినియా ప్రభావతిని వేఁగంగావవే ప్రాణముల్
త్యజియింపన్నమకట్టెరాఁగదవె కృష్ణా! యార్తరక్షామణీ!

ఇంద్రు—(ఆలకించి వెఱఁగందుచు) ఏమి! ప్రభావతీకన్యసాహసము! (అని యిటునటుఁ జూచి) అదిగో! ఆకన్యారత్నము కాళీసందర్శనార్థమై కాంబోలు ఖడ్గధారిణియై మహోగ్రంబుగ నిటులనే వచ్చుచున్నది. నే నీమాటున డాఁగియుండి యా నెప్రయత్న మెట్టిదియో గనిపెట్టెదను. (అనియొకమాటున డాఁగుచున్నాఁడు.)

[అంత నదే ప్రకారము సఖీపరివృతయగు ప్రభావతి ప్రవేశించుచున్నది.]

ప్రభా—(భక్తిపూర్వకంబుగ దేవికి దండప్రణామం బాచరించి) ఓదేవి! (అని యంజలి ఘటియించి.)

క. పితృఘాతకురాలనునీ సుతనుజగజ్జనని! కరుణఁ జూడఁగదే యీ
క్షితిలోన నీవదిక్కో సతి! శాంకరి! గర్భగుప్తిఁ సాకవె నన్నున్.

(అని మరల బ్రణమిల్లి లేచి) ఓభవానీ!

కాళీదండకము.

శ్రీమన్మహాదేవి కాత్యాయనీ సర్వమాంగల్యదాత్రీ మదేభాననక్రౌంచ
దారప్రియామాత్మోద్భవభ్రాజితోత్సంగ సమ్మోదినీ మోహినీ దుష్ట

సంహారిణీ కేశవాంభోజ సంభూత శక్రాది బృందారకోదారహృత్త్రిప్త
పాదద్వయాంభోజినీ మోక్షసంధాయినీ యాపదుద్ధారిణీ భక్తరక్షా
మణీ పాపవిచ్ఛేదినీ దుర్మదారాతివిధ్వంసినీ హంసినీ మాహిషాస్మాలినీ త
త్త్వచిద్భాసినీ పావనీ ఘోరసంసారవారాశి దుఃఖోర్మికోత్తారిణీ నిత్య
కల్యాణి నీరేజపాణీ కనద్దృగ్జితైణీ లసద్దివ్యరోలంబవేణీ జగత్కా
రిణీ సర్వభూతావనీ భద్రసంచారిణీ భీమసంగ్రామ భీభత్సరూపిణీ
రక్తమాంస బల్యాన్నసమ్మోదినీ భూతభేతాళ పైశాచికోల్లాసినీ
పూజితామ్నాయసంవాసినీ యన్త్రశస్త్రానుసందాననైపుణ్యనిర్ధూ
తవిద్వేషిణీ దివ్యకైలాస గోత్రాంతరక్షేలినీ సత్కృపాశాలినీ
భూరికాపాలినీ చిత్తజోజ్జీవినీ నిత్యసౌభాగ్యసంధాయినీ సజ్జనధ్యే
యినీ భవ్యకారుణ్య లక్ష్మీకటాక్షేక్షణీ చండరుద్రాణి మాయామ
యీ భైరవీ యాదిశక్తీ సతీ పార్వతీ చండికా దుర్గ దాక్షాయణీ రాజ
రాజేశ్వరీ దక్షవాటీ మఖధ్వంసినీ యర్ధనారీశ్వరీ సర్వయోగీంద్ర హృ
ద్వారిజాలోలభృంగీ కపర్ది జటాజూటగంగాసపత్నీ చరస్థావరా శేష
బ్రహ్మాండభాండాంతరస్థాయినీ లోకముల్ సృష్టిజేయంగఁ బెంపన్ ల
యింపన్ ద్రిమూర్త్యాత్మకంబైన తేజంబు నీయంద బొల్పున్నినున్న
న్నుతింపంగ నాయాదిశేషాహికైనం దరంబౌనె నే నెంతదాన న్నడుం
దీనురాల న్నినున్నమ్మియుంటి న్గురుద్రోహముంజేసి యాపన్ననైతిన్నదే
తల్లి దీనార్తిసంత్రాణ కారుణ్యవల్లి యటన్నా మొరాలింపవే సత్కృ
పం జూడవే నాకికం దిక్కు నీవే మదంబా! కటా! శివద్వేషితుండౌ వరు
న్నిష్కళంకంబుగా భర్తఁగాఁగోరుటన్నాదె నా[illegible] పంచత్వముం
జెందె నాథుండు నన్నిట్టులం గూర్మిఁ జేపట్టునో [illegible] చే నావ
రుం దేర్చి నాకోండలంబొందు డింపింపఁగాఁ జేయు నాకెవ్వఁ డింపవంగ దే
శాంకరి లేనిచో నే నిదే నాదుతంత్రిన్నతె [illegible] కీర్తించంబు

ఖండించి నీకున్సమర్పించెదన్ బ్రీతిఁ గైకొనఁగదే లోకమాతా

నమస్తే నమస్తే నమస్తే నమస్తే నమః.

(అని నిమీలితనేత్రయై కొంతతడవు ధ్యానించి ఖడ్గంబు చేఁబూని తనకంఠంబు ఖండింపఁబోవును.)

[అంత మహాశక్తి సాక్షాత్కరించి.]

శక్తి—ఆఁ! కుమారీ! వద్దువద్దు అజ్ఞానురాలవై యతిసాహసం బొనరింపకుము. త్రిలోకకంటకుండైన వజ్రనాభదైత్యుని మరణంబునకు బ్రాజ్ఞురాలవగు నీవు దుఃఖించుట యుచితమగునా? వాని దుర్విచేష్టితంబులు నీ వెఱుంగకుంటివా?

చ. శమదమనిగ్రహుల్ పరమశాంతుల యోగులఁ ద్రుంచి మానిస
త్తములసుఖంబులెల్ల సతతంబును పాడొనరించి బ్రాహ్మణో
త్తములనుజంపి దేవతలఁ దంచి పతివ్రతలంగలంచి దో
సము లొడిగట్టు నీజనకుచావునకుం దురపిల్లఁ జెల్లునే?

ప్రభా—ఓహో దేవీ! సర్వమంగళా! నాతండ్రి యెంతటి దుష్టచిత్తుండైనను;—

శా. "సొమ్ముల్కాన్కగఁ దెచ్చితిం దొలఁగునిన్ జూడన్ శ్రమంబంత యుఙ్
గొమ్మా! ముద్దులగుమ్మ! వేడ్కలరఁగా గైకొమ్మా" యటంచున్ననుఙ్
సమ్మోదమ్మునఁ జూచి మోము దరహాసస్ఫూర్తిశోభిల్లఁగా
నమ్మా! రమ్మను తండ్రి లేఁడుకద కట్టా! నాకికన్ శాంకరీ!

జగజ్జననీ! నే నొక్కనాఁడు మదీయాంతఃపురంబున హంసతూలికాతల్పంబుపై శయనించి నిదురింపుచుండ నీ విట్లు నిర్హేతుకజాయమానకటాక్షవీక్షణంబుల నాకు సాక్షాత్కరించి యొక మోహనాకారుని చిత్రపటంబు నాకొసంగి యీపురుషరత్నంబే నాకు పతి కాఁగలండని చెప్పి తిరోహితవైతివి. పిమ్మట నామనం బాసుందరాంగునిపైఁ దగుల మోహాతిరేకంబుచే,

చ. జనకునికన్నుఁ గప్పి యనిశంబుఁ దపించుచు పెన్వ్రాలి నా
మనము హరించినట్టి నవమన్మథు పేరను లేఖవ్రాసి రా
నొనరిచి నేరహస్యముగ నుత్సుకత న్వరుఁగూడి నేన కా
రణముగఁ దండ్రిచావు హానకరంగ ఘటించితి నాహవంబునన్.

అట్టి పితృహంత్రినగు నన్ను నాప్రాణనాధుం డనుగ్రహించునా? నాకింక సర్వ శరణ్యంబవు నీవ. పతితపావనీ! నన్నురక్షింపుము. (అని ప్రణమిల్లుచున్నది.)

ఇంద్రు——(తనలో) ఓహో! ఈసాధ్వీమణియోగ్యత జగదేకవర్ణనీయంబుగ నున్నయది.

క. జనకుని మరణమునకుఁ గా
రణమై పితృహంత్రినైతి రమణుఁడు కూర్మిన్
గనునో యను మానించునొఁ
యనిపరితాపమున నాత్మ హత్యకుఁ దొడరెన్.

ఏపతివ్రతాతిలకంబునకైనఁ బతిభక్తియుఁ బితృభక్తియు నిట్లుండవలదా?

శక్తి——ప్రభావతీ! నిష్కారణము నీ వేల యాత్మనింద చేసికొనియెదవు? నీ తండ్రి చావునకు నీ వెంతమాత్రమును కారణభూతురాలవు కావు. వినుము.

గీ. తన కరాంగుళిఁ బరులనేత్రములు పొడువఁ
బూను దుర్మతి తన కన్ను పొడిచికొనుట
కిదియ దృష్టాంత మనఁ బరహింసఁగోరి
యబల! నీతండ్రి తనకుఁ దానంతమొందె.

మఱియు దుష్టచిత్తులు దుర్వ్యసనాసక్తులు సాధుహింసాపరతంత్రులు క్రూరక ర్ములు నగు దైత్యుల దుష్కులంబున గంజాయివనములో తులసిమొక్క మొలచినట్లు పవి త్రమ్మగు యీవంశములో ధర్మకలశంబు లభించినపగిది దేవతాంశచే జన్మించిన నీవు [illegible] పహతుండగు నీతండ్రిమరణంబునకు దుఃఖింపఁ బనిలేదు. "అవశ్యమనుభోక్తవ్యం కృతం కర్మశుభాశుభం" అనువాక్యము దెలియంగకుంటివా? నీతండ్రి [illegible] తిగా స్వశస్త్రహతుండై యాత్మద్రోహం బొనరించుటం జేసి యధిక పతితుండు కాఁడనియు నన్నను భగవంతుండును నీ మామగారునగు శ్రీకృష్ణునిమాయచే [illegible] వున వానికిఁ బుణ్యలోకమే ప్రాప్తించును. నీవువరించిన పురుషుఁడు నీకన్న [illegible] గుణములు నీపై యనురాగపూరితుండై యున్నవాఁడు [illegible] నలుంగఁడు. అతఁడు జయోత్సాహుండై వచ్చినన్ను [illegible] యులదాంపత్యంబు దైవప్రేరితంబు. కావున నీవింక [illegible] రుండగు ప్రద్యుమ్నునిచెట్టపట్టి [illegible] యురారోగ్య పుత్రపౌత్రాభివృద్ధి నెసంగుము. [illegible]

[illegible] దీర్ఘాయుష్మంతుండై సుగుణగణా
[illegible] ల్లు. అదిగో శ్రీకృష్ణప్రద్యుమ్ను లిటుల నే
[illegible] (అని [illegible] యగును.)

[[illegible] ప్రద్యుమ్నులు ప్రవేశించుచున్నారు.]

[illegible] బళె!

[illegible] నలదిక్కులందుఁ జం
[illegible] చెందిన వారి దృక్చకో
[illegible] యుదయించి యించె శ్రీ
[illegible] ఘటింపఁదలంచినాఁక హా.

[illegible]
[illegible] ప్రసూనభూరుహం
[illegible] నుయ్యెలలూఁగియూఁగియా
[illegible] నాఁడిదోఁబుచుల్
[illegible] గ వీచుఁ దెమ్మెరల్.

[illegible] నీమామగారునగు శ్రీకృష్ణభ
[illegible] రింపుము.
[illegible] రంబుచే [illegible] నో
[illegible]

[illegible] ప్రభావతికిని నా
[illegible] యుఁ దత్సఁయో
[illegible] శుచిముఖి
[illegible] ప్రద్యుమ్నుండను
[illegible] గుణశీలవయోరూపంబుల [illegible]
[illegible] దగినభార్యయు. (ప్రకాశముఁగా)
[illegible]

[illegible] చేనట్లు బం
[illegible] ప్రద్యుమ్నుఁడు నాదీప్తి బల్
[illegible]

పరసస్ఫూర్తినొసంగి నీదుగుణశీలస్నేహయోగాప్తి భా
స్వర సత్కీర్తి మయూఖముల్ నిగుడదిక్కుల్వ్యాపిలన్ జేయుతన్.

మఱియు, శా. నీగర్భస్థకుమారశేఖరుఁడు నిర్నిద్ర ప్రభావుండు బా
హాగర్వుం డసమానరూపగుణ విద్యాశాలియుం సంతతం
బా గౌరీకృపచేత వజ్రపురమర్త్యాంతంబు బృందారకో
ద్యోగుండై యురుకీర్తినేలుచుఁ జిరాయుష్మంతుఁడై వర్ధిలున్.

శుచి—దేవా! పితృమరణ సంజాతచింతాకులస్వాంతయగు ప్రభావతి దేవరవారితో నొక సంగతి విన్నవించుకొనఁ గోరుచున్నయది.

శ్రీకృ—ఏమని?

శుచి—దేవా! వినుండు.

"గీ. జనని చిన్ననాఁడె చనిపోయె ననుఁ బ్రోచు
కన్నతండ్రి లేఁడు గతివినీవ
నీదు గర్భగుప్తి నెగడింప నీపాద
ములకుఁ జేరఁదీయ మ్రొక్కుచుంటి" అని.

శ్రీకృ—ప్రభావతీ! నీ వెంత వెఱ్ఱిదానవు!

చ. మృతుఁడగుతండ్రికై వగవనేల? యతండు వరప్రభావుఁడై
యతులితభోగభాగ్యములనందియు మోక్షపదంబుఁ జెందె నీ
పతి యనురక్తిఁ జూచు నిను భాముని రుక్మిణి యాదరించెడుం
గుతుకముఁ జెందుమమ్మ మదిఁ గొందలమందకుమమ్ముకోడలా.

మఱియు-గీ. రిక్క చెలికత్తియలతోడ రేవెలుంగుఁ
గవయఁబోయెడు రోహిణీకాంతరీతి
నువిద నీ భర్తయైన ప్రద్యుమ్ను చెంత
కరుగు శుచిముఖి రాగవల్లరుఁ తోడ.

(అని ప్రద్యుమ్నునితో) కుమారా! ఈ ప్రభావతీరమణి గాంధర్వవిధి నిదివరకే పంచభూతములు సాక్షిగా నీకు ధర్మపత్నియైనది. ఇప్పుడీయింద్రునిసమక్షంబున మరల పాణిగ్రహణ మాచరింపుము.

[అంత మంగళతూర్యనాదంబు లెసంగ ప్రభావతీప్రద్యుమ్నులకుఁ బాణిగ్రహణ మహోత్సవము జరుగును.]

ఇంద్రు—సర్వలోక శరణ్యుండవగు నో శ్రీకృష్ణా!

మ. మునువారాశిమునింగి మందరనగంబు న్వెన్నుపైఁదాల్చి భూ
మినిఁ గోడంబున నెత్తి కంబమునఁ బేర్మిన్ బుట్టి మిన్ముట్టి బ్రా
హ్మణ సంప్రీతినొనర్చి సీతఁగొని శేషాఖ్యన్ వ్రతోద్ధాపకుం
డన ధర్మ ప్రతిపాదకుండనఁగఁ గృష్ణా! కావవే నేల్పులన్.

శా. నాపుణ్యంబున నిన్నుఁగావించితిని కృష్ణా! సత్కృపన్నీవు నా
ప్రాపై నాదు పరాభవంబుఁ దొలఁగింపం జేయవే నాకృత
జ్ఞాపారీణతఁ దెల్ప నీకిదె నమస్కారంబుఁ గావింతు నో
యాపద్బాంధవ! ప్రీతిఁగైకొనిననున్ హర్షాంబుధిన్ దేల్పవే.

(అని ప్రణమిల్లుచున్నాఁడు.)

శ్రీకృ—నాకాధిపా!

శా. నీకాంతుల్ఛలియించె నేటికి సురానీకంబు హర్షించె నీ
నాకంబేలుచు నోలలాడు మిక నానాభోగభాగ్యంబులన్

మఱియు నీవే నాకు మహోపకారివైతివి. ఏమన,

నాకుంగోడలుఁగాఁ బ్రభావతినిఁ గన్యారత్నమున్ సాధ్వినిన్
రాకాచంద్రముఖిన్ ఘటించు టుపకారంబయ్యె నిప్పట్టునన్.

ఇంద్రు—శ్రీకృష్ణా! ఈదాంపత్యంబు సమకూర్ప శుచిముఖియే ముఖ్యకారకురాలు.

శ్రీకృ—అవును. ఆసంగతియు నే నెఱుంగుదును. (అని శుచిముఖితో) ఓశుచిముఖీ!

చ. పలుమరు వేషభాషలఁ బ్రభావతికి న్సఖివై మెలంగి వే
ల్పుల పనిఁదీర్పఁ దద్వరునిహం దొనఁగూడఁగఁజేయ లేదె శౌ
శలమున వజ్రనాభుఁడచిఁ జావఁగఁ గారణ మీవయైతి మి
క్కిలి నినుమెచ్చితిన్ శుచిముఖీ! వరమొక్కటిఁగోరు మిచ్చెదన్.

శుచి—(సహర్షయై) దేవా! మహానుభావా!

గీ. దాసురాలను నే నంత • దాన బ్రహ్మ
రుద్రులంతటివార • లెఱుఁగరాని
నీ పదాంభోజయుగ్మంబు • నేనుగంటి
చాల దే సఫలమయ్యె నా • జన్మ నేడు.

మహాత్మా ! భక్తవత్సలా ! సద్గుణకజాయమానకటాక్షంబుచే నాకోకపరంబుఁ ప్రసాదింపననుగ్రహింపఁదలఁతు. కావున నీ సేవన నేమన;—

భరతవాక్యము.

మ. సవిరతోర్వీమణి సర్గ్వపాలన సశ్లోకుం డగుండు నీభక్తుఁడు
ర్వ్యాపిశ్రీపోన్నతిరాజ్య సేలనలయున్ • శ్రీవత్సవాయాన్వయా
గ్రణరాశాశశి కీర్తిచంద్రికలు బర్వన్ దిక్కులన్ సంతతో
న్నవ్రుత్తు వేంకటసింహగోత్రపతి యా • చంద్రార్కతార ప్రభన్.

మఱియు, మంగళ మహాశ్రీవృత్తము.

సొరిగను సర్వధరాధిపతులు రాజ్యముల • నెమ్మిఁబరిపాలన మొనర్పన్
ఖ్యాతిఁగ ఘనాఘనుఁడ • ఖండ సమవృష్టికలు • గంగనొనరింప సతతంబుఁ
క్షోణితలము సస్యఫల • సంపదగనన్ రుజలు • క్షామములు లేకనలరారన్
క్షేమములరన్ సకల • జీవులు సుఖించి నిను • జేరవలె మంగళమహాశ్రీ.

శ్రీకృ—
ఇంద్రు— } తథాస్తు, తథాస్తు, (అని యందఱు నిష్క్రమించుచున్నారు.)

గద్య.

ఇది శ్రీమద్వేంకటరమణకరుణాకటాక్షవీక్షణాసారసమాసాదిత రసబంధుర
కవిత్వవైఖరీప్రవీణాపస్తంబసూత్ర శాండిల్యసగోత్రపవిత్ర హో
తృకులకలశార్ణవరాకాకైరవమిత్ర వేంకటరత్నసుపుత్ర
వేంకమాంబాగర్భశుక్తిముక్తాఫల వివిధవిద్వజ్జనవిధే
య వేంకటకృష్ణనామధేయప్రణీతంబైన ప్రభా
వతీప్రద్యుమ్నంబను నాటకరాజంబున సర్వం
బును సప్తమాంకము సంపూర్ణము.

మ. అమలక్షత్రియవంశజాత! గుణరత్నాలంకృతా! ధీయుతా!
సమదద్వేషవిభంజనా! ప్రియముతో సాలంకృతంబైన దా
నముగా మీకు నొసంగియుంటిఁ గృతికన్యారత్నము స్సద్వరో
త్తమ! సింహాద్రి జగత్పతీ! కొని ననున్ ధన్యాత్మునిం జేయుమా.

ఉ. వేంకటసింహగోత్రపతి! విద్యలభోజ! జగత్పతీంద్ర! య
ప్రభంకపకీర్తి! మీఘనసభాస్థలి సత్కవికోటిలోఁ గవి
త్వాంకుఁడనన్ బ్రశస్తిఁగనియర్థిలి నే మిముఁజేరి కొల్చుచే
యుంకువగా నొసంగెద నహో నృప! నాకృతికన్య నేలుమా.

కృతిప్రదానము.